ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 05-08- 2026 | సంపుటి: 17, సంచిక: 123, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



అరుంధతి పశుపతి తరహాలో హరీష్

## క్షుద్రపూజలు

- బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి వారికి అఘోరాలతో తాంత్రిక పూజలు చేయడం అలవాటే
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాకలం) : 'బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారు.. ఇందులో ఎలాంటి దాపరికం లేదు.. తెలంగాణలో వర్షాలు పడొద్దని, పంటలు పండకూడదని ఆయన కుట్రలు చేస్తున్నారు. ఆయనకు స్వార్థం పరాకాష్ఠకు చేరింది. ఆయన అరుంధతి సినిమాలో పశు పతిలా మారాడు' అని టీ పీసీసీ అధ్యక్షుడు మహే ష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం ఆయన గాంధీభవ న్‌లో టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్, పార్టీ నేతలు శ్యామ్‌మోహన్, సామా రామ్మోహన్‌రెడ్డితో కలిసి

తరువాయి 2వ పేజీలో...

పోలీస్ పోస్టుల భర్తీని

# పారదర్శకంగా నిర్వహించాలి

## పరీక్షలకు భంగం కలిగించే కుట్రలను అడ్డుకోవాలి

### ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

ప్రశ్నపత్రాల తయారీ నుంచి పరీక్షల ముగింపు వరకు కట్టుదిట్టమైన భద్రత

కోచింగ్ సెంటర్లు, సోషల్ మీడియా, నకిలీ వెబ్‌సైట్లపై ప్రత్యేక నిఘా

సైబర్ క్రైమ్, ఇంటెలిజెన్స్ విభాగాలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాకలం) : రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ ఉద్యోగాల నియామక ప్రక్రి యను పూర్తిస్థాయి పారదర్శకత, కట్టుదిట్ట మైన భద్రతతో నిర్వహించాలని ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. నియామక పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలకు తావులేకుండా, అభ్యర్థుల విశ్వాసాన్ని నిలబెట్టేలా నిర్వహిం చాలని స్పష్టం చేశారు. పోలీస్ నియామ కాలకు సంబంధించి కొన్ని రాజకీయ పార్టీలు, ఇతర స్వార్థపూరిత శక్తులు పరీక్షల నిర్వహణకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు అందించిన సమాచారాన్ని ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికా రులతో అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితులను సమగ్రంగా సమీక్షించారు.

తరువాయి 2వ పేజీలో...

ప్రజారోగ్యంతో

# చెలగాటం

## హైదరాబాద్‌లోని 13సంస్థల్లో 'హెచ్-ఫాస్ట్' తనిఖీలు

25 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడి పదార్థాలు స్వాధీనం - కల్తీదారులపై కఠిన చర్యలు: సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాకలం) : విషపూరిత కెమికల్స్ ఉపయోగించి మసాలా దినుసులు తయారు చేస్తున్న ముఠాల గుట్టు ను హెచ్-ఫాస్ట్ (హైదరాబాద్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) రట్టు చేశారు. నగరంలోని 13 మసాల వ్యాపార సంస్థలు, ప్రాసెసింగ్ కేంద్రాలపై సంయుక్తం గా దాడులు నిర్వహించి భారీగా కల్తీ మసాలాలు, వాటి తయారీకి సిద్ధంగా ఉంచిన ముడి పదార్థాలను స్వాధీ నం చేసుకున్నారు. కల్తీ మసాలాల నాణ్యత పెంచేందుకు సింథటిక్ రంగులు, ఇండస్ట్రియల్, బట్టల డైలు, టాల్కమ్ పౌడర్, రైస్‌బ్రాన్ ఆయిల్ వంటి హానికరమైన పదార్థాలు కలిపినట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధిం చిన వివరాలను హైదరాబాద్ సీపీ సజ్జనార్ మంగళవారం మీడియాకు వివరించారు. హెచ్-ఫాస్ట్ బృందం ఆధ్వర్యంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి 140 రోజుల్లో 202 కేసులు నమోదు చేశారు. దాదాపు 2.46 లక్షల కిలోల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

తరువాయి 2వ పేజీలో...



శ్రీశైలానికి

# భారీగా వరద

## 2.48 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

- 108 టీఎంసీలకు చేరిన మట్టం
- జూరాల ప్రాజెక్టు 33 గేట్లు ఎత్తివేత
- 34.10 టీఎంసీలకు చేరిన ఎస్సారెస్పీ నీటి మట్టం
- పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు
- నిండు కుండలా ఎగువ మానేరు డ్యాం

హైదరాబాద్, ఆగస్టు 4 ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్‌లో జలాశయాలకు వరద ప్రవాహం పెరిగింది. రెండు లక్షలకుపైగా క్యూసెక్కుల వరద వస్తున్నది. మంగళవారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 2.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 33 గేట్లను ఎత్తి 2,21,331 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టికి ప్రస్తుతం 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా,

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్






దివ్యాంగుల సంక్షేమానికి

## ప్రత్యేక నిధులు

- తెలంగాణకు రూ. 9.19 కోట్లు విడుదల
- ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్ర సామాజిక న్యాయ మంత్రి బీఎల్.వర్మ.

7

## 'ప్రజాకలం' కథనానికి స్పందన




4

గుట్టుచప్పుడు కాకుండా సాగిన వేలానికి బ్రేక్

ఆగస్టు 13 వరకు మార్కెట్ దుకాణాల దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రభుత్వ ఆఫీసులన్నింటికీ

# 'టీ-ఫైబర్'ద్వారానే నెట్

## 1 నుంచి ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దు

- ఇంటింటికీ ఇంటర్‌నెట్ వర్తింపజేయాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాకలం) : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1నుంచి 'టీ-ఫైబర్' ద్వారానే ఇంటర్‌నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. సెప్టెంబర్ 1 తర్వాత ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'టీ-ఫైబర్'పై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీ-ఫైబర్ నెట్‌వర్క్ వినియోగం ద్వారా ఏటా ప్రభుత్వానికి సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

మిగతా 2వ పేజీలో...



## నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ
- నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

3

కేసీఆర్ కుటుంబం వల్లే

# సింగరేణికి నష్టం



బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ.54 వేల కోట్ల బకాయిలు పెట్టాయి

ప్రధాని మోదీ సహకారంతోనే సింగరేణికి మూడో బ్లాక్ : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాకలం) : తెలంగాణ అభివృద్ధికి నరేంద్రమోదీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని, ఇందులో భాగంగానే తాజాగా సింగరేణికి వరుసగా మూడో కోల్ బ్లాక్ పీకేవోసీ డిప్‌సైడ్ దక్కిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణికి నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా బకాయిలు పడిందని, కేసీఆర్ కుటుంబంతో సింగరేణి సంస్థకు ఎంతో నష్టం వాటిల్లిందని ఆయన విమర్శించారు.

కేసీఆర్, రేవంత్ రెడ్డి పుణ్యమా అని సింగరేణికి రూ.54 వేల కోట్లు బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. మంగళవారం ఢిల్లీ లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తను బొగ్గు శాఖ మంత్రి అయినప్పటి నుం చి రాష్ట్రప్రభుత్వంతో చర్చిస్తూ.. సింగరేణికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నానని చెప్పారు. వేలంలో పాల్గొనడం ద్వారా వీలైనన్ని ఎక్కువ బ్లాక్స్‌ను పొందేలా ప్రోత్సహిస్తున్నానని, దీంట్లో భా గంగా.. పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందన్నారు.

అనేక కంపెనీలు వేలంలో పాల్గొనడానికి ముందుకు వచ్చినా సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. తాజా కోల్ బ్లాక్ కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు చిగురించాయని, సింగరేణిని గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకునేందుకు ప్రయ త్నించాయని విమర్శించారు. కేసీఆర్, రేవం త్ పుణ్యమా అని సింగరేణి కార్మికులకు సంబంధించిన రూ.54 వేల కోట్లు బకాయిలు పేరుకుపోయాయన్నారు.

**బకాయిలు ఎందుకివ్వట్లేదు..**

సింగరేణికి బకాయిలు ఎందుకు ఇవ్వట్లేదు? సింగరేణి తెలంగాణలో లేదా? సింగరేణి కార్మికులు తెలంగాణ ప్రజలు కాదా? రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. 'కిషన్ రెడ్డి సింగరేణికి అన్యాయం చేశారంటూ కేసీఆర్ కొడుకు మాట్లాడుతున్నాడు. సింగరేణికి అన్యాయం చేసిందెవరో చర్చకు సిద్ధమా? మీ కు టుంబం పుణ్యమా అని సంస్థ దివాళా తీసే ప్రమాదంలో ఉంది. నేను బొగ్గు శాఖ మంత్రి అయ్యాకే సింగరేణికి న్యాయం జరుగుతోంది.

తరువాయి 2వ పేజీలో...

డిఫాల్ట్ మిల్లర్లపై

# ఉక్కుపాదం

ప్రతి రూపాయి, ప్రతి గింజను వసూలు చేస్తాం

దశాబ్ద కాలం సీఎంఆర్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



2

## పోలీస్ పోస్టుల భర్తీని
# పారదర్శకంగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, భద్రపరిచే విధానం, రవాణా, పంపిణీ, పరీక్ష కేంద్రాల నిర్వహణ తదితర ప్రతి దశలో అత్యంత అప్ర మత్తంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. నియామక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యం లేదా అవకతవకలకు ఆస్కారం లేకుండా అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు కోచింగ్ సెంటర్ల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించిన తప్పుడు ప్రచారం, పుకార్లు, ప్రశ్నపత్రాల లీకేజీ పేరుతో సోషల్ మీడియాలో జరిగే దుష్ప్రచారాన్ని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తా మని మోసాలకు పాల్పడే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలు, సైబర్ మోసగాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం సైబర్ క్రైమ్ విభాగం, ఇంటెలిజెన్స్ విభాగాలు సమన్వయంతో పనిచేసి పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, డీజీపీ సీవీ ఆనం ద్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంతో చెలగాటం

మొదటి పేజీ తరువాయి...

ఇందులో కల్తీ మసాలా దినుసులు 25.3 టన్నులు, 6,700 కిలోల జీలకర్ర, 2,350 కిలోల జీలకర్ర పొడి, 4,960 కిలోల ఆవాలు, 2280 కిలోల షాజీరా, 550 కిలోల లవంగాలు, 254 కిలోల సోంపుతో పాటు అల్లం-వెల్లుల్లి పేస్ట్, మాంసం, పనీర్, పాల ఉత్పత్తులు, పండ్లు, ఊరగాయలు, టీ పొడి, వాటర్ ప్లాంట్‌ల ద్వారా విక్రయించే తాగునీటిలో టైటానియం ఆక్సైడ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలు వినియోగిస్తున్నట్లు గుర్తించామని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

**ముగ్గురి అరెస్ట్, క్రిమినల్ కేసులు నమోదు**

ఆయా సంస్థల నుంచి 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడి పదార్థాలను స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. కల్తీ మసాలాల తయారీకి పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కల్తీ దారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో నిందితులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ (బీఎన్ఎస్) 110 కింద హత్యాయత్నం కేసులు నమో దు చేస్తామని హెచ్చరించారు. కల్తీ ఆహారపదార్థాలపై ఉక్కుపాదం మోపు తామని స్పష్టం చేశారు.

**'హెచ్-ఫాస్ట్'రికార్డు రికవరీలు**

ఆహార పదార్థాలను కల్తీ చేసే సంస్థల పునాదులు కదిలించడమే లక్ష్యంగా ఏర్పాటైన 'హెచ్-ఫాస్ట్' బృందం రికార్డు స్థాయిలో తనిఖీలు నిర్వహించిందని సీపీ వెల్లడించారు.

140 రోజుల వ్యవధిలోనే 2.46 లక్షల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుందన్నారు. హెచ్-ఫాస్ట్ ఆధ్వర్యంలో ముమ్ముందు కూడా తనిఖీలు కొనసాగుతాయని సీపీ వెల్లడించారు.

# అరుంధతి పశుపతి తరహాలో హరీష్ క్షుద్రపూజలు

మొదటి పేజీ తరువాయి...

మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కరువుతో ప్రజలు అల్లాడిపోవాలని హరీష్ రావు కుతంత్రాలు చేస్తున్నారని, తమ పార్టీ నేతలు అద్దంకి దయాకర్, సామా రామ్మోహన్‌రెడ్డిలకు నోటీసులు ఇవ్వడం అందు లో భాగమేనని అన్నారు. హరీష్‌రావు క్షుద్ర పూజలు చేశాడని చెప్పడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. తమిళనాడు తిరుచిరాపల్లి , శివమొగ్గలో క్షుద్ర పూజలు చేసే దేవాలయాలు ఉన్నాయన్నారు. మార్చి 2న , జూన్ 2న తిరుచ్చి, మే 31, జూన్ 1 జులై 23 న హరీష్‌రావు శివమొగ్గ వెళ్ళారని, అందుకు సంబంధించిన తమ వద్ద ఆధారాలు ఉన్నాయని మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. తాము చెప్పిన తేదీ లలో హరీష్‌రావు ఎక్కడ ఉన్నారో మీడియాకి సమాధానం చెప్పాలని డిమాం డ్ చేశారు. క్షుద్రపూజలకు సంబంధించి వాస్తవాలు మాట్లాడిన కాంగ్రె స్ నాయకులకు నోటీసులు ఇచ్చారని ఆయ న తెలిపారు.

'శివమొగ్గ వెళ్ళిన హరీష్‌రావు, ఫోటోలు సోషల్ మీడియా, ఫేస్ బుక్‌లో ఎందుకు పోస్ట్ చేయలేదు..? తిరుపతి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడే హరీష్‌రావు ఈ దేవాలయాలకు వెళ్లినప్పుడు ఎందుకు మీడియాతో మాట్లాడలే దు?' అని మహేష్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. అక్కడ ఏమి మొక్కుకున్నారు, ఏమి పూజలు చేశారో చెప్పలేదన్నారు. రాష్ట్ర ప్రజలు బాగు కోసం పూజలు చేస్తే ఎందుకు బయటకు రాలేదన్నారు. ఆ రెండు ఆలయాలయాల్లో ఆయ న క్షుద్రపూజలు చేయడం ఎంత వరకు స మంజసం..? అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ నాయకు లకు అఘోరా, తాంత్రిక పూజ లు చేయడం అలవాటుగా ఉందన్నా రు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో క్షుద్రపూజలు చేస్తున్నారని జరిగిన ప్రచారాన్ని మొదట్లో తను నమ్మలేదని, కానీ హరీష్‌రావు వైఖరి చూసి అనుమానాలు వస్తున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమం స మయంలో పెట్రోల్ పోసుకున్న హరీష్‌రావుకి అగ్గిపెట్ట దొరకలేదని ఆ యన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వైఖరి వల్లే ఆత్మహత్యలు జరిగాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఇష్టారాజ్యంగా ప్రభు త్వం నడపారని ఆయన విమర్శించారు.

తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వం తప్పులు చేస్తే ప్రతిపక్షంగా విమర్శలు చేయడం సహజమన్నారు. కరువు వస్తే ఎ లాంటి చర్యలు తీసుకోవాలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని.. కానీ బీఆర్ఎస్ ఆ పని చేయడం లేదన్నారు.

# శ్రీశైలానికి భారీగా వరద

మొదటి పేజీ తరువాయి...

అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. నారాయణపూర్‌కు 1,45,400 లక్షల క్యూసెక్కులు వస్తుండగా, 1,45,376 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంలోకి భారీగా వరద వస్తున్నది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 2,48,148 క్యూసెక్కుల జలాలు వచ్చి చేరుతున్నాయి. మహారాష్ట్రలో కురిసి వర్షాలతో గోదావరి బేసిన్‌లోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. మెదక్, కామారెడ్డి జిల్లాల మధ్య 1.820 టీఎంసీల సామర్థ్యం ఉన్న పోచారం ప్రాజెక్టులోకి 2,150 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకో వడంతో అలుగు పోస్తున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువమానే పూర్తిస్థాయి నీటిమట్టం 31 అడుగులకు, 24 అడుగుల నీరు చేరింది. మరో ఏడడుగులు చేరితే మత్తడి దూకే అవకాశం ఉన్నది.

**కామారెడ్డి జిల్లాలో 18 సెంటీమీటర్ల వర్షం**

కామారెడ్డి జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు 18 సెంటీమీటర్ల వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతున్నది. కామారెడ్డి పెద్ద చెరువు అలుగులు వెళ్తున్నది. కామారెడ్డి సుభాష్ థియేటర్ వద్ద అర్ధరాత్రి రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో ప్రైవేట్ బస్సు పెళ్లి కోసం వస్తుండగా సైలెన్సర్‌లోకి నీరు వెళ్లడంతో మధ్యలోనే ఆగిపోయింది. వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని బస్సులోని ప్రయాణికులను తాడు సాయంతో బయటకు తీశారు. పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. సింగీతం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తారు. కళ్యాణి ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తారు. నల్లమడుగు ప్రాజెక్ట్ వద్ద జోరుగా వాగు ప్రవహిస్తున్నది. జిల్లాలో 18 వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

## కేసీఆర్ కుటుంబం వల్లే
## సింగరేణికి నష్టం

మొదటి పేజీ తరువాయి...

ఈ సంస్థకు ఉన్న రూ. 54వేల కోట్ల బకాయిలు ఇచ్చేలా రాష్ట్ర బీజేపీ తరఫున ఒత్తిడి చేస్తాం' అని ఆయన తెలిపారు.

**కేసు పెట్టిన డీసీపీపై వేధింపులు**

ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాగ్రాంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని, అభ్యంతరకరంగా మార్ఫింగ్ చేస్తూ పోస్టులు చేశారని, మోదీ తల్లిపై కూడా నీచంగా, అమానవీయంగా పోస్టులు పెట్టారని మండిపడ్డారు. దీనిపై బీజేపీ నేత సాయి కిరణ్.. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఐటీ చట్టం ప్రకారం జూలై 29 న సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కేసు నమోదు చేశారని, దర్యాప్తులో భా గంగా.. పోస్టులు చేసినవారితోపాటుగా మెటా ఇండియా హెడ్‌కు కూడా నోటీసులు ఇచ్చారన్నారు. అయితే మెటా సంస్థకు నోటీసులు ఇచ్చిన డీసీపీ అరవింద్‌బాబుని రాష్ట్ర ప్రభు త్వం వేధింపులకు గురిచేస్తోం దన్నారు. మెటా కంపెనీపై ఎలా కేసు పెడతారం టూ.. ఢిల్లీ నుంచి రాహుల్‌గాంధీ.. తెలంగాణ కాంగ్రెస్ చీఫ్, తెలంగాణ సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో డీసీపీని బదిలీ చేశారని చెబుతున్నారన్నారు. రెండేళ్లలో 44 సార్లు అధికారు ల బదిలీలతోఆందోళన నెలకొందని, డీసీపీని బదిలీ చేసి, మిగిలిన అధికారులను కూడా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

**గతంలో ఫామ్‌హౌస్ ఫైల్స్‌తో..**

'ఫాంహౌస్ ఫైల్స్' పేరుతో గతంలో కేసీఆర్ ప్రతిపక్ష నేతలను, మీడియా వ్యక్తులను, సినిమా నటులను, కుటుంబసభ్యులపై కూడా ఫోన్ ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసింది అందరూ చూశారని, తన ఫోన్‌ను ట్యాప్ చేశారని కేసీఆర్ కూతురే చెప్పారన్నారు. కాంగ్రెస్ మద్దతుతో తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభు త్వం.. అక్కడి ప్రతిపక్ష నేత ఏదో చేశాడని ఆయన్ను అరెస్టు చేశారని, మరి వారికి అ క్కడో న్యాయం.. ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తే ఇక్కడ మరో న్యాయమా? అని ప్రశ్నించారు.

# ప్రభుత్వ ఆఫీసులన్నింటికీ 'టీ-ఫైబర్'ద్వారానే నెట్

మొదటి పేజీ తరువాయి...

అంతేకాకుండా ఇంట్రానెట్ బేసిస్ లో సెక్యూర్డ్ ఇంటర్నెట్ యాక్సెస్ కల్పించడం ద్వారా రాష్ట్ర డేటా సెంటర్‌కు అనుసంధానం ఏర్పడి, పూర్తి స్థాయి డేటా సెక్యూరిటీ చేకూరు తుందన్నారు. గడిచిన ఆరు నెలల్లోనే రాష్ట్రవ్యా ప్తంగా 4,487 ప్రభుత్వ కార్యాలయాలకు 'టీ-ఫైబర్' ద్వారా ఇంటర్నెట్ సేవలు అంది ంచేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు ఇప్పటికే సుమారు రూ.13 కోట్లు ఆదా అయ్యిందన్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ సేవలను విస్తరించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో తలెత్తే లోపాలను ఎప్పటికప్పుడు సరిచేస్తూనే రాబోయే రోజుల్లోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ వైడ్ ఏరియా నెట్‌వర్క్(టీ-స్వాన్)ను నెల రోజుల్లోపు పూర్తిస్థాయిలో టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ'కి పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సేవలు అందిం చేందుకు ఏర్పాట్లు చేయాలని 'టీ-ఫైబర్'కు సూచించారు. అలాగే ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, దీనికోసం ప్రిన్సిపుల్ మానిటైజేషన్ పార్టనర్‌ను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డిఫాల్ట్ మిల్లర్లపై ఉక్కుపాదం

## ప్రతి రూపాయి, ప్రతి గింజను వసూలు చేస్తాం
## దశాబ్ద కాలం సీఎంఆర్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్
## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాకలం) :

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవస్థపై గత పది నుంచి పన్నెండు సంవత్సరాల కార్యకలాపాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం సేకరణ నుంచి బియ్యం అప్పగింత వరకు జరిగిన ప్రతి లావాదేవీ, మిల్లర్ల వారీగా డిఫాల్టు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ దర్యాప్తులు, న్యాయపరమైన చర్యలు, అమలు వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించి, భవిష్యత్తులో ఇలాంటి లోపాలకు తావులేకుండా సమ గ్ర సంస్కరణలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పౌరసరఫరాల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దశాబ్దకాలంగా జరిగిన ధాన్యం సేకరణ, సీఎం ఆర్ బకాయిలు, ఎఫ్‌సీఐకి అప్పగించిన బియ్యం, జిల్లాల వారీగా, మిల్లర్ల వారీగా పెండింగ్ డిఫాల్ట్, రికవరీల పురోగతి, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలను విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడు తూ, తప్పుడు విధానాలను అవలంబించిన వారికి శిక్షలు విధించడం మాత్రమే కాదు.. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసి న ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయిని పూర్తిగా తిరిగి రాబట్టడమేనని ప్రభుత్వ లక్ష్యమన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద కొనుగోలు చేసే ప్రతి ధాన్యం గింజ వెను క తెలంగాణ రైతు చెమటతో పాటు ప్రజ ల సొమ్ము ఉందన్నారు. సివిల్ సప్లయ్ శాఖ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధా న్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం ఎంపిక చేసిన రైస్ మిల్లర్లకు అప్పగిస్తుందని, వా రు ఒప్పందం ప్రకారం నిర్దేశిత పరిమాణం, నాణ్యతతో బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని మంత్రి గుర్తు చేశారు.

**టన్ను బియ్యం తగ్గినా..**

మిల్లర్‌కు అప్పగించే ప్రతి బస్తా ధాన్యం ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తి అని, అందులో ఒక్క గింజ దారి మళ్లినా అది తెలంగాణ ప్రజలకు నష్టమన్నారు. ప్రభుత్వానికి రావలసి న ఒక్క టన్ను బియ్యం తగ్గినా ప్రజా పంపిణీ వ్యవస్థ బలహీనపడుతుం దని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. పెండింగ్ బకాయిల్లో ఎక్కువ భాగం గత ప్రభుత్వాల కాలంలో పేరుకుపోయినవేనని, ప్రస్తు తం వాటి రికవరీకే అత్యంత ప్రాధాన్యం ఇ స్తున్నామని తెలిపారు. నగదు రూపంలో చెల్లింపులు, ధాన్యం తిరిగి అప్పగింత, నాణ్యమైన బియ్యం సరఫరా వంటి అన్ని మార్గాల ద్వారా గరిష్ఠ స్థాయిలో రికవరీలు సాధించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన పరిమిత గడువు కారణంగా ఇప్పటికే గణనీయమైన రికవరీలు జరిగాయని అధికారులు తెలిపారు. మిగిలిన ప్రతి కేసుపై మిల్లర్ వారీగా గడువు నిర్ధారించి ప్రత్యేక రికవరీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

**సమూల సంస్కరణలు..**

సీఎంఆర్ విధానంలో మార్పులు తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. ఒప్పంద నిబంధనలను మరింత కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, డిఫాల్టర్లపై కఠిన చర్యలు తీసుకునే అంశాలను కొత్త విధానంలో చేర్చాలని నిర్ణయించి నట్లు చెప్పారు. పెండింగ్ రికవరీలు, ఆస్తుల జప్తు, బ్యాంకు గ్యారంటీల అమలు, సివిల్, క్రిమినల్ కేసుల పురోగతితో పాటు రికవరీలకు అడ్డంకిగా ఉన్న ప్రతి పరిపాలనా అవ రోధాన్ని వెంటనే తొలగించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఒక్క గింజ కూడా దారి మళ్లకుండా సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవే శపెట్టాలన్నారు. దీనిలో క్యూఆర్ కోడ్‌తో గన్నీ సంచులు, జీపీఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్, జియో ట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ రీకన్సిలియేషన్, ప్రొక్యూర్మెంట్-మిల్లింగ్-ఎఫ్సీఐ డేటాబేస్ల అనుసంధానం, ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ, రిస్క్ ఆధారిత మిల్లుల ఆడిట్లు వంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టాలని మంత్రి సూచించారు.

**నిజాయితీ మిల్లర్లకు పూర్తి భరోసా..**

డిఫాల్ట్ కారణంగా రైతులు ఏ విధంగానూ ఇబ్బంది పడరని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కనీస మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో నేరుగా సకాలంలో చెల్లింపులు, సేకరణ ప్రక్రి య యథావిధిగా కొనసాగుతాయని హామీ ఇచ్చారు. నిజాయితీగా పనిచేస్తున్న రైస్ మిల్లర్లకు భయపడాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించే వారు, ఒప్పందాలను ఉల్లంఘించే వారు మాత్రం ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని మంత్రి హెచ్చరించారు. ప్రజల ఆస్తిని కాపాడటంలో, ప్రభుత్వ బకాయిలను పూర్తిగా రాబట్టటంలో, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్, ప్రొక్యూర్మెంట్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, లీగల్, మార్కెటింగ్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**విజిలెన్స్ దాడులు కొనసాగుతాయి**

రాష్ట్రంలోని అత్యధిక మంది రైస్ మిల్లర్లు నిజాయితీగా ప్రభుత్వంతో కలిసి పనిచేశారని, అయితే కొద్దిమంది మాత్ర వే బియ్యం అప్పగింతలో జాప్యం చేయ డం, ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించ డం, ఒప్పందాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడ్డారని మంత్రి తెలిపారు. అన్నారు. ఈ సమావేశంలో విజి లెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రభుత్వ ధా న్యంపై నిర్వహించిన తనిఖీలు, దాడులు, నమోదుచేసిన క్రిమినల్ కేసులు, రికవరీలు, న్యాయపరమైన చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లుల్లో భౌతిక తనిఖీలు, స్టాక్ల ధృవీకరణ, స్టాక్ రిజిస్టర్ల పరిశీలన, కొనుగోలు రికార్డులతో సరిపోల్చడం, ప్రభుత్వ ధాన్యం లేదా బియ్యం అక్రమ మళ్లింపులపై లోతైన విచారణ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం, నమ్మకద్రోహం వంటి నే రాలకు ఆధారాలు లభించిన ప్రతి సందర్భంలో క్రిమినల్ కేసులు నమోదు చేయ డంతో పాటు, పదేపదే డిఫాల్ట్ చేస్తున్న మిల్లర్లపై బ్లాక్లిస్టింగ్ సహా కఠిన పరిపాలనా చర్యలు తీసుకుంటామని అధికారు లు తెలిపారు.

# అక్రమ ఆస్తుల వేట

**హైదరాబాద్‌లో ప్రారంభమైన బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం**

## పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల అప్పగింత, అక్రమ ఆస్తుల రికవరీపై ప్రత్యేక దృష్టి
## సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి, చట్ట అమలు సంస్థల సమన్వయానికి ప్రాధాన్యం
## సాంకేతికత ఆధారిత పారదర్శక పాలనతో అవినీతికి అడ్డుకట్ట వేయాలని పిలుపు
## జీఈఎం, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వంటి భారత నమూనాలను వివరించిన కార్యదర్శి రచనా షా




హైదరాబాద్, ఆగస్టు 4 :అవినీతి, ఆర్థిక నేరాలు, అక్రమ ఆస్తుల తరలింపు వంటి అంతర్జాతీయ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే దిశగా బ్రిక్స్ దేశాలు మరింత సమన్వయంతో ముందుకు సాగాలని భారత ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వేదికగా మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ (ఏసీడబ్ల్యూజీ) రెండో సమావేశంలో సభ్య దేశాల ప్రతినిధులు కీలక అంశాలపై చర్చలు ప్రారంభించారు. ఆగస్టు 4, 5 తేదీల్లో జరిగే ఈ సమావేశంతో పాటు బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశం కూడా నిర్వహిస్తున్నారు. సమావేశాన్ని ప్రారంభించిన భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా మాట్లాడుతూ, సుస్థిరమైన అభివృద్ధికి అవినీతి అతిపెద్ద అడ్డంకిగా మారిందన్నారు. ప్రజలకు అందాల్సిన నిధులు ఆసుపత్రులు, పాఠశాలలు, మౌలిక వసతుల అభివృద్ధికి చేరకుండా అవినీతి మళ్లిస్తోందని, తద్వారా ప్రజల విశ్వాసం దెబ్బతింటోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి అనేది ఒక్క దేశానికి పరిమితమైన సమస్య కాదని, దాన్ని ఏ దేశమూ ఒంటరిగా ఎదుర్కోలేదని పేర్కొన్న రచనా షా... అక్రమ ఆర్థిక లావాదేవీలను అరికట్టడం, ప్రజా సంపదను కాపాడటం, అంతర్జాతీయ అవినీతి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం బ్రిక్స్ దేశాలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్రత, జవాబుదారీతనం, పరస్పర సహకారం, సాంకేతిక ఆవిష్కరణలే అవినీతిపై పోరాటానికి బలమైన ఆయుధాలని ఆమె స్పష్టం చేశారు.

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తులు ప్రపంచ దేశాలకు సవాలుగా మారారని పేర్కొన్న ఆమె, నేరస్తులకు ఏ దేశమూ ఆశ్రయం కల్పించకూడదని స్పష్టం చేశారు. అలాంటి నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించడం, దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, అక్రమ నిధుల తరలింపుకు అవకాశం కల్పిస్తున్న లోపాలను తొలగించడం వంటి అంశాల్లో బ్రిక్స్ దేశాలు మరింత బలమైన సహకార వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి ఆరోపణలతో పరారీలో ఉన్న నిందితులను గుర్తించి వారి అప్పగింత ప్రక్రియను వేగవంతం చేయడానికి ఏర్పాటు చేసిన బ్రిక్స్ అనధికారిక సహకార భాండాగారం పురోగతిని ఆమె స్వాగతించారు. అలాగే బ్రిక్స్ దేశాల చట్ట అమలు సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు ప్రతిపాదించిన బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్ త్వరగా కార్యరూపం దాల్చాలని ఆకాంక్షించారు. అక్రమ ఆస్తుల రికవరీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన బ్రిక్స్ అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ కీలక పాత్ర పోషిస్తుందని రచనా షా పేర్కొన్నారు. సమాచార మార్పిడి కోసం రూపొందించిన ప్రామాణిక నమూనాలు, ప్రతి దేశంలోని నోడల్ అధికారులు, నిపుణుల డైరెక్టరీ ద్వారా చట్ట అమలు సంస్థల మధ్య వేగవంతమైన, సమర్థవంతమైన సమన్వయం సాధ్యమవుతుందని వివరించారు. అవినీతిని నిరోధించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఆమె... డిజిటల్ గుర్తింపు వ్యవస్థలు, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక కొనుగోలు విధానాలు అవినీతికి అడ్డుకట్ట వేయడంలో సమర్థవంతమైన సాధనాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం), ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ), ముఖరహిత పన్ను విధానం, డేటా ఆధారిత పర్యవేక్షణ, సాంకేతిక నిఘా వ్యవస్థలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు.

సమావేశంలో నిర్వహిస్తున్న "నవకల్పనలు – –సాంకేతికత ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అంశంపై ప్రత్యేక సదస్సు ద్వారా సభ్య దేశాలు తమ అనుభవాలను పంచుకుని, అవినీతి నిరోధక రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థంగా వినియోగించే మార్గాలపై చర్చించనున్నట్లు కార్యదర్శి తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర విశ్వాసం, సమాచార భాగస్వామ్యం, చట్ట అమలు సంస్థల సమన్వయం మరింత బలోపేతమైతే అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి, ఆర్థిక నేరాలకు సమర్థవంతంగా అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# మెట్‌పల్లి పెద్ద చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

## - మత్స్యకారులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి..
## - చెరువు బండ్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం) మెట్‌పల్లి పెద్ద చెరువును కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. చెరువు బండ్‌తో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మెట్‌పల్లి పెద్ద చెరువు ఈ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా మత్స్యకారులకు జీవనాధారమని పేర్కొన్నారు. అధికారుల అవగాహన లోపంతో చేపట్టిన పనుల కారణంగా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపిస్తూ, వారికి ప్రభుత్వం వెంటనే తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చెరువు బండ్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. చెరువును గతంలాగే పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, నీటిని నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెట్‌పల్లి పట్టణ



ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి పెద్ద చెరువుబండ్‌నువెంటనే పునరుద్ధరించాలని, మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలని, చెరువును యథావిధిగా నీటితో నింపాలన్నారు. పట్టణాన్ని ప్రజలను ప్రభుత్వం కాపాడాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఉస్మాన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా - సూపర్వైజర్ స్వరూప రాణి



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం)

జగిత్యాల పట్టణంలోని 46వ వార్డులో గల ఉస్మాన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వార్డు కౌన్సిలర్ అనీష్ కుతేజ ఆధ్వర్యంలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ స్వరూప రాణి మాట్లాడుతూ, శిశువు పుట్టిన గంటలోపు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలలో కొలస్ట్రం తోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు అధికంగా ఉంటాయని, అందువల్ల అది శిశువుకు తొలి టీకాలా పనిచేస్తుందని తెలిపారు. ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని, రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలు కొనసాగించడం వల్ల పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా తల్లులు, చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే తొమ్మిది నెలల గర్భిణుల ఇళ్లను, ఇటీవల ప్రసవించిన బాలింతల ఇళ్లను సందర్శించి ప్రసూతి అనంతర సంరక్షణ, శిశు ఆరోగ్యంపై అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రిజ్వానా బేగం, షాహిన్ సుల్తానా, తిరుమల, గజాల జబీన్, సబిహా సుల్తానా, శ్రీదేవి, రజిత, మాధవి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

## - టీఎన్జీఓ భవన నిర్మాణానికి రూ. 10 లక్షల మంజూరు
## - క్యాబినెట్ హోదా పొందిన ఎమ్మెల్యే విజయరమణ రావుకు సత్కారం

పెద్దపల్లి,ఆగస్టు 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు కు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పించిన సందర్భంగా మరియు పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ భవన నిర్మాణానికి మొదటి విడతగా రూ.10 లక్షలు మంజూరు చేసినందుకు తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డితో పాటు టీఎన్జీఓ జిల్లా కార్యవర్గ సభ్యులు,వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. బ్రాహ్మణ పండితులు రంగాచార్యులు,పవన్,హరీశ్ వేదోచ్ఛారణల నడుమ ఆశీర్వచనాలు అందించగా,నాయకులు ఎమ్మెల్యేను శాలువా,గజమాల,తలపాగాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో



ఎమ్మెల్యే ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందిస్తూ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం ఎంతో ఆనందదాయకమని నాయకులు కొనియాడగా,ఉద్యోగుల సంక్షేమం కోసం తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ అనిత రెడ్డి,ఉపాధ్యక్షులు శ్రీనివాస్,మహేందర్ రెడ్డి,సంయుక్త కార్యదర్శులు ప్రవీణ్,శ్రీధర్, కార్యవర్గ సభ్యులు శిల్పారెడ్డి,స్వప్న,వివిధ యూనిట్ల అధ్యక్షులతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘాల నాయకులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు అండగా ఉంటాం

## -మాజీ ఎంపీపీ గోపాగోని సారయ్య గౌడ్

పెద్దపల్లి,ఆగస్టు 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

వృత్తిరీత్యా గీత కార్మికులు ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొంటూ ఉపాధి పొందుతున్న నేపథ్యంలో,తాటి చెట్టుపై నుండి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలై పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన బాలసాని సమ్మయ్య గౌడ్,అలాగే జూలపల్లి మండలం కాచపూర్‌కు చెందిన పాలకుర్తి రాములు గౌడ్ ఆరోగ్య పరిస్థితిని కల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపాగోని సారయ్య గౌడ్ స్వయంగా పరిశీలించి వారిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు సహకారంతో బాధితులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందేలా,న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గౌడ సంఘాల నాయకులు పడాల కొమురయ్య గౌడ్,బాలసాని వెంకటేశం గౌడ్,కాచపూర్ గౌడ సంఘం అధ్యక్షులు రాజేశం గౌడ్,అంజయ్య గౌడ్,మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యాన పంటలతోనే రైతుల ఆర్థిక ప్రగతి

## రైతు రిజిస్ట్రీతో సంక్షేమ ఫలాలు - మండల ఉద్యానవన విస్తరణ అధికారి బి.రాము

పెద్దపల్లి,ఆగస్టు 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పామాయిల్ సాగుకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని,రైతులు సాంప్రదాయ పంటల సాగుకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటల వైపు అడుగులు వేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని పెద్దపల్లి మండల ఉద్యానవన విస్తరణ అధికారి బి.రాము పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని రాఘవాపూర్,పెద్దబొంకూర్ శివార్లలో విస్తృతంగా పర్యటించిన ఆయన..అక్కడ సాగులో ఉన్న పామాయిల్,బీర,కీరదోస అలాగే ఇతర కూరగాయల తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల శ్రమను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వరి,పత్తి,మొక్కజొన్న వంటి ఒకే రకమైన సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తేనే రైతులకు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. మార్కెట్‌లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉండే ఉద్యాన మరియు కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందవచ్చని సూచించారు. ఇక ప్రభుత్వపరంగా అందుతున్న డ్రిప్,స్ప్రింక్లర్, పామాయిల్ తోటలు మరియు ఇతర ఉద్యాన పథకాల రాయితీలను రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలంటే



విధిగా రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలని కోరారు. ఆధునిక డ్రిప్ సేద్య పద్ధతులను పాటించడం వల్ల నీటి వినియోగం గణనీయంగా తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు పెరుగుతాయని వివరించారు. అంతేకాకుండా,సాగు నీటి ఎద్దడిని నివారించేందుకు ఫార్మ్‌పాండ్ల నిర్మాణానికి ప్రభుత్వం వంద శాతం రాయితీని అందజేస్తోందని రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కలవల తిరుపతితో పాటు ఉద్యానవన రైతులు అడిచర్ల శంకరయ్య,రాజేశం,తిరుపతి,వంశీ,రాజు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కృషి చేయాలి

## జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ - మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ
## నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 4(ప్రజా కలం) జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల పై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియచేయాలన్నారు. నేరాలను ముందుగానే అరికట్టే విధంగా ఇంటెలిజెన్స్ సేకరణ, బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, అనుమానిత వ్యక్తులపై నిఘా, సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, జైలు నుంచి విడుదలైన నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు




నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ఎస్పి వెంట డిఎస్పి రాములు, ఎస్.ఐ కిరణ్ కుమార్,రాజు నాయక్ సిబ్బంది ఉన్నారు.

# బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమిద్దాం

## - తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు
## - ఆగస్టు 6న హైదరాబాద్‌లో జరిగే 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ'ను విజయవంతం చేయాలని పిలుపు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం) బీసీ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా సామాజిక న్యాయ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు అన్నారు. ఆగస్టు 6న హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' పోస్టర్లను మెట్‌పల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ, కోరుట్ల నియోజకవర్గ ప్రజలు, బీసీ సంఘాల నాయకులు, యువత, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన మార్గంలో సామాజిక న్యాయం కోసం ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా, సమాజంలో సమాన అవకాశాలు కల్పించే చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ఈ పోరాటంలో బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధమైన మార్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి బీసీలకు న్యాయం జరిగేలా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజార్ భాయ్, సుఖేందర్ గౌడ్, లింగంపల్లి సంజీవ్, రెండ్ల రాజన్న, నాని, ప్రశాంత్ ముఖీమ్, తోట శ్రీనివాస్, గంగాధర్, వెంకటేష్, లింగంపల్లి ప్రణీత్, సుద్దాల నాగరాజు, అచ్చ శేఖర్ నారాయణ గౌడ్, ప్రణయ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

## మెట్ పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు - విద్యార్థుల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి
## జిల్లా రవాణా శాఖ అధికారి సంధాని మహమ్మద్ - మెట్‌పల్లిలో స్కూల్ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం) ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మెట్ పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు అన్నారు. పాఠశాల విద్యార్థుల ప్రయాణ భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో జగిత్యాల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో స్కూల్ బస్సు డ్రైవర్లు, పాఠశాల యాజమాన్యాలకు రోడ్డు భద్రతపై సమగ్ర అవగాహన సదస్సు నిర్వహించారు. జగిత్యాల జిల్లా రవాణా అధికారి సందాని మహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మెట్ పల్లి డిఎస్పీ రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములు, డీటీవో సందాని మహమ్మద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి. శ్రీనివాసరావు, ఎం. సాయిచరణ్, షేక్ రియాజ్ స్కూల్ బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాల్సిన రోడ్డు భద్రతా నిబంధనలను వివరించారు. సదస్సులో ప్రధాన సూచనలు ప్రతి స్కూల్ బస్సులో తప్పనిసరిగా ఒక అటెండెంట్ ఉండాలని వెల్లడించారు. స్కూల్ బస్సు నడిపే డ్రైవర్‌కు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. ప్రతిరోజూ ప్రయాణానికి ముందు టైర్లు, బ్రేకులు, స్టీరింగ్‌తో పాటు వాహనంలోని అన్ని నియంత్రణ వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గతంలో జరిగిన స్కూల్ బస్సు ప్రమాదాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ,ప్రమాదాలకు దారితీసే కారణాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, విద్యార్థుల భద్రతను ఎలా కాపాడాలి అనే అంశాలపై డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో మెట్‌పల్లి పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 120 మంది స్కూల్ బస్సు డ్రైవర్లు, వివిధ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థుల భద్రతకు ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు.

# బాలల సంరక్షణ కేంద్రాలు పిల్లలకు కుటుంబ వాతావరణాన్ని కల్పించాలి

## – జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం)

మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ కమిటీ చైర్మన్, అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ మంగళవారం జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మకపేట్‌లోని మిచ్చమ్మ చారిటీస్, కోరుట్లలో మాతృ సేవా సంస్కృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న విద్య, ఆరోగ్య సేవలు, పోషకాహారం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, నిర్వహణ రికార్డులు, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పిల్లలతో ఆత్మీయంగా మాట్లాడిన అదనపు కలెక్టర్ వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, సంక్షేమం, దైనందిన జీవనం, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలల సంరక్షణ కేంద్రాలు పిల్లలకు ఇంటి, కుటుంబ వాతావరణాన్ని కల్పించేలా ఉండాలని అన్నారు. సంరక్షణ కేంద్రాలే పిల్లలకు కుటుంబంగా మారినప్పుడే వారి శారీరక, మానసిక, విద్యా, సామాజిక అభివృద్ధికి మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నిర్వహకులు పిల్లలకు నాణ్యమైన సేవలు అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎ.




భాస్కర్ మాట్లాడుతూ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగ అధికారులు తరచూ సంరక్షణ కేంద్రాలను సందర్శిస్తూ నిర్వహకులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జ్ అధికారి పడాల సురేశ్, సంరక్షణ కేంద్రాల అధికారిని కరుణశ్రీ, బాలల సంక్షేమ సమితి సభ్యులు శివకుమార్, శిశు వైద్య నిపుణులు డాక్టర్ కోటగిరి భీమేశ్, సామాజిక ప్రతినిధి హరి అశోక్ కుమార్,ఎన్జీవో ప్రతినిధి శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో గణేశ్, కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర, సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు డాక్టర్ జేఎన్ వెంకట్, రంజిత్, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

ప్రజా కలం

బుధవారం, ఆగస్టు 05, 2026

# 2 లక్షల కోట్ల దాటేస్తున్న జీఎస్టీ

దేశంలో వస్తు సేవల పన్ను సూళ్లు ఇటీవల రూ. 2 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. సాధారణంగా జీఎస్టీ రేట్ల ల్యాండ్‌స్కేప్‌లో సంస్కరణలు, రేట్ల సర్దుబాట్లు చేసిన తర్వాత స్వల్పకాలంలో పన్ను ఆదాయం తగ్గుతుందనే అంచనాలు ఉండేవి. అయితే, అనుకున్నదానికి భిన్నంగా రాబడి ప్రతి నెలా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం దీనిని పన్ను వ్యవస్థలో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనంగా చూపుతున్నప్పటికీ.. నాణేనికి మరోవైపు ఉన్న పన్ను రాబడి స్వభావాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ఆర్థిక సూత్రాల ప్రకారం, జీఎస్టీ అనేది అడ్ వలోరమ్ పన్ను. అంటే, ఇది ఒక వస్తువు లేదా సేవ తుది విక్రయ ధరపై శాతంగా లెక్కిస్తారు. అంటే ఓ వస్తువు ధర వంద రుపాయలు అయితే దానిపై ట్యాక్స్ 18 శాతం అయితే .. పద్దెనిమిది రూపాయల ట్యాక్స్ కట్టాలి. మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరిగినప్పుడు పన్ను శాతం మారకపోయినప్పటికీ, ప్రభుత్వానికి వచే పన్ను మొత్తం ఆటోమేటిక్‌గా పెరుగుతుంది. ఉదాహరణకు, రూ. 100 విలువైన వస్తువుపై 18% జీఎస్టీ పడితే ప్రభుత్వానికి రూ. 18 వస్తుంది. కానీ ద్రవ్యోల్బణం వల్ల అదే వస్తువు ధర రూ. 150కి పెరిగితే, అదే 18% చొప్పున ప్రభుత్వానికి రూ. 27 పన్ను సమకూరుతుంది. అంటే వ్యాపారం లేదా వస్తువుల వినియోగ పరిమాణం పెరగకపోయినా, కేవలం ధరల పెరుగుదల వల్ల కూడా పన్ను వసూళ్లు గణనీయంగా పెరుగుతాయి.ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సంరక్షణాత్మక వాణిజ్య విధానాలు, సుంకాల యుద్ధాలు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం భారతీయ మార్కెట్‌పై కూడా పడి నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్, ముడిసరుకుల ధరలు పెరగడానికి దారితీసింది. ఆసియా, ఐరోపా మార్కెట్లలో రేగన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వ్యాపార వ్యయాన్ని పెంచడంతో.. ఆ భారం అంతిమంగా వినియోగదారుడిపై పడింది. ధరలు పెరగడం వల్ల ప్రజల జేబుల నుంచి ఎక్కువ సొమ్ము పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది.కేవలం రూ. 2 లక్షల కోట్ల జీఎస్టీ రికార్డు కలెక్షన్లను మాత్రమే చూసి దేశంలో ప్రగతి ఉప్పొంగిపోతోందని తీర్మానించడం సమగ్రమైన విశ్లేషణ కాదు. ఈ రాబడిలో ఎంత భాగం నిజమైన ఆర్థిక వృద్ధి ద్వారా వచ్చింది, ఎంత భాగం ద్రవ్యోల్బణం వల్ల పెరిగిందో వేరు చేసి చూడాలి. ఒకవైపు ధరల భారంతో సామాన్య ప్రజల కొనుగోలు శక్తిపై ప్రభావం పడుతుంటే, మరోవైపు అదే ధరల పెరుగుదల ప్రభుత్వానికి రికార్డు రాబడిని తెచ్చిపెడుతోంది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ. 29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది.దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించిందిపన్ను సంస్కరణలతో పాటు పన్ను నిఘా పెరగడం సానుకూలాంశమే అయినప్పటికీ, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల వల్ల పెరుగుతున్న పన్ను భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించే చర్యలపై దృష్టి సారించడమే నిజమైన ఆర్థిక నిర్వహణ అవుతుంది

# 'ప్రజాకలం' కథనానికి స్పందన

## గుట్టుచప్పుడు కాకుండా సాగిన వేలానికి బ్రేక్

### - ఆగస్టు 13 వరకు మార్కెట్ దుకాణాల దరఖాస్తు గడువు పొడిగింపు




పెద్దపల్లి,ఆగస్టు 04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రోడ్డును ఆనుకుని ఉన్న13 ప్రతిష్టాత్మక నూతన వాణిజ్య దుకాణాల వేలం ప్రక్రియ ఎలాంటి ప్రచారం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోందంటూ,దీనివల్ల అర్హులకు అన్యాయం జరిగి కొద్దిమందికే లబ్ధి చేకూరుతుందని,అర్హులకు అన్యాయం - ఆప్తులకు లబ్ధి,ప్రచారం లేదు..పారదర్శకత అంతకంటే లేదు అని జులై 27న 'ప్రజాకలం'లో వచ్చిన సంచలన కథనానికి ఎట్టకేలకు స్పందన లభించింది.ఈ నేపథ్యంలో స్థానిక వ్యాపారులు,ప్రజల నుంచి వ్యక్తమైన తీవ్ర విమర్శలు, విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న మార్కెట్ కమిటీ అధికారులు వేలం ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి మంగళవారం వెల్లడించిన ప్రకటన ప్రకారం..ఈ దుకాణాలను పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించనున్నారు.కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు 3, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1,ఇతరులకు 7 చొప్పున బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం నిర్దేశించిన కనీస ధర ప్రకారం ఒక్కో దుకాణానికి నెలవారీ అద్దె రూ. 15,462 ఉండగా,ఆసక్తి గల అర్హులైన వ్యాపారులు,నిరుద్యోగ యువత దరఖాస్తు ఫారాలను రూ.3 వేలు చెల్లించి సంబంధిత కార్యాలయ పనివేళల్లో పొందవచ్చని తెలిపారు.గతంలో ఉన్న గడువు ముగియగా,ప్రస్తుతం దరఖాస్తుల విక్రయం మరియు స్వీకరణను ఆగస్టు 13, 2026 మధ్యాహ్నం 03:00 గంటల వరకు పొడిగిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరగా, మరింత సమాచారం కోసం 7330733468, 7330733318 నంబర్లను సంప్రదించాలని సూచించారు. 'ప్రజాకలం' కథనం ద్వారా అధికారుల్లో వచ్చిన ఈ సానుకూల స్పందన పట్ల స్థానిక వ్యాపార వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై అవగాహన




ఇబ్రహీంపట్నం ఆగస్టు 04 (ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం లోజరిగిన ప్రత్యేక గ్రామసభలు ఎర్దండి, గోదూర్,వర్షకొండ, ఇబ్రహీంపట్నం మండలంలో వర్షకొండ లో ఎంపీఓ రామకృష్ణ రాజు,గోధుర్ తహసీల్దర్ ప్రసాద్,ఎర్దండి వ్యవసాయధికారి రాజ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ గణేష్.పాల్గొన్నరు. ఇబ్రహీంపట్నం లో ఎంపీడీఓ గణేష్.మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక,ఎస్ బి ఎం స్వచ్ఛభారత్ రూల్స్, జలసిరి వంటి అంశాల పైన ఎల్నినో ప్రభావం ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ఎస్ బి ఎం స్వచ్ఛ భారత్ లో గల ప్రతి గ్రామములో నాలుగు రకలా చెత్త డబ్బాలు తడి, పొడి, శానిటరీ చెత్త, ప్రత్యేక జాగ్రత్త అని ఉంటాయని వాటిని ఏ విధంగా వాడాలో లో ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక లో చేయాలవల్సిన పనులా వివరాలు జలసీరి వల్ల మనం నీటిని భవిష్యత్తులో ఏ విధముగా ఉపయోగపడునో వివరించారు.గ్రామ సభలో సర్పంచ్ లు, పాలకవర్గసభ్యులు మహిళలు పాల్గొన్నారు.

# ఎండపల్లి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

### - సమీక్ష సమావేశం పూర్తికాక ముందే వెళ్లిపోయిన మండల ప్రత్యేక అధికారి




ఎండపల్లి, ఆగస్టు 04 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం రైతు వేదిక లో ఎండపల్లి మండల అభివృద్ధి కార్య క్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఎం రవి ప్రసాద్ డిఎఫ్ఓ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సమీక్ష సమావేశం పూర్తి కాక ముందే మండల ప్రత్యేక అధికారి మధ్యలోనే వెళ్లిపోయారు. సర్పంచులు వారి గ్రామాల సమస్యలు చెప్పుకుందామనుకుంటే మండల ప్రత్యేక అధికారి మధ్యలోనే వెళ్లిపోయారు ఎంపీడీవో దొండ కృపా కృపాకర్ కు సర్పంచులు గ్రామాల సమస్యలు విన్నవించుకున్నారు మండలం లోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఎండపల్లి మండల వ్యవ సాయ శాఖ అధికారి కమాల్ల మహేష్ మాట్లా డుతూ రైతు భరోసా గురించి మండలంలోని 9.992 మంది రైతులకు రైతు భరోసా కింద రైతులకు వారి బ్యాంకు ఖాతాలోజమా అయ్యాయని అలాగే రైతు బీమా కింద 25 మంది రైతులకు గాను 23 మంది రైతులకు రైతు బీమా కింద క్లైమ్ లు పూర్తి అయ్యా యని మిగతా ముగ్గురికి సాంకేతిక పరిశీలనలో ఉన్నదని వ్యవసాయ అధికారి ఏవో తెలిపారు. అలాగే విద్యుత్ ఏఈ బండి సమ్మయ్య మాట్లాడుతూ 5.375 విద్యుత్ వినియోగ దారులకు గృహ లక్ష్మీ పథకం కింద జీరో బి ల్ ద్వారా 15 లక్షల 15 వేల ఎనిమిది వందల ముప్పై ఏడు రూపాయలు ప్రతినెల ఇవ్వడం జరుగుతుందని అలాగే మండలంలోని ఇండ్ల పై నుండి వైర్లు తొలగించడానికి మంత్రి కోట నుండి 32 లక్షల 22 వేల 229 ఎస్టిమేషన్స్ పంపించడం జరిగిందని ఏఈ తెలిపారు. ఎండపల్లి కొత్తపేట గుల్లకోట గ్రామానికి సబ్ స్టేషన్ లో ప్రత్యేకమైన నూతన బ్రేకర్లను ప్రారంభించడం జరిగిందని మండలంలోని పాతగూడూర్, రాజారాం పల్లి చర్లపల్లి గ్రామాలలో డామేజ్ కింద ఏ బి కేబుల్ మార్చడం జరిగిందని మండలంలోని అన్ని గ్రామాలలో నూతన విద్యుత్తు లైన్ల కోసం 60 లక్షల 12 వేల 442 రూపాయల ఎస్టిమేషన్స్ పంపించడం జరిగిందని. మండలంలోని వివిధ గ్రామాలలో మిడిల్ డ్యామేజ్ పోల్స్ వేయడం జరిగిందని. రైతుల కోసం వ్యవసాయ బావుల వద్ద నూతనంగా ట్రాన్స్ఫార్మర్ బిగించడం జరిగిందని విద్యుత్ ఏఈ బండి సమ్మయ్య తెలిపారు విద్యుత్ పైన గుల్లకోట సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ కోడిపుంజులపల్లి సింగిల్ ఫేస్ డి టి ఆర్ ఉన్నదాన్ని తీసుకువెళ్లి వేరే కాడ బిగించారని దాన్ని వెంటనే సింగిల్ ఫేస్ డి టి ఆర్ ను కోడిపుంజుల పల్లెలో సింగిల్ ఫేస్ డి టి ఆర్ ను అమర్చాలని సర్పంచ్ కోరారు. అలాగే తెనుగు వాడలో సింగిల్ ఫేస్ డి టి ఆర్ ఇంటి పక్కకు ఉన్నందున మేకల కొట్టం వద్ద దానిని వెంటనే వేరే కాడికి షిఫ్ట్ చేయాలని సర్పంచ్ కోరారు అలాగే ఎండపల్లి సర్పంచ్ మారం సునీత జలంధర్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ప్రతి సర్టిఫికెట్ తొందరగా ఇప్పించాలని సర్టిఫికెట్ల కోసం పోతే రేపు మాపు అని కాలయాపన చేస్తున్నారని సర్పంచ్ సున్నిత తెలిపారు. కొత్తపేట గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి మాట్లా డుతూ గ్రామంలో ఎండపల్లి, వెల్గటూర్ మండలాల సరిహద్దులో ఉన్న త్రీఫేస్ ట్రాన్స్ఫార్మర్ ఫీజు కొట్టేసినచో అధికారుల కు ఫోన్ చేసినచో అది మా పరిధిలో లేదని వారు అంటున్నారని అలాగే ఎండపల్లి మండల అధికారులకు ఫోన్ చేస్తే అది మా పరిధిలోకి రాదు అని అంటున్నారని మరి ఇది ఎవరి పరిధిలోకి వస్తుందని దీనిని వెంటనే పరిష్కరించాలని సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి విద్యుత్ అధికారులను కోరారు. పాత గూడూర్ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య సరి హద్దులు నిర్ణయించా లని వారు రెవెన్యూ అధికారు లను కోరారు. రాజారాం పల్లి సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఎండపల్లి రాజారాంపల్లి గ్రామాల సరిహద్దులు నిర్ణయించాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమం లో మండల ప్రత్యేక అధికారి డిఎఫ్ఓ ఎం రవి ప్రసాద్, ఎంపీడీవో దొండ కృపాకర్, మండల తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఎఫ్ఆర్వో, ఆర్ ఐ అన్వేష్, విద్యుత్ ఏఈ బండి సమ్మయ్య, వ్యవ సాయ అధికారి కమల్ల మహేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈ, వైద్యాధికారి డాక్టర్ పి లవ కుమార్, మండల ఏపీఎం తులసిమాత, పి ఆర్ ఏ ఈ రాజు, ఉపాధి హామీ ఏపీవో, పశు వైద్యాధికారి డాక్టర్ బూర మనోజ్ కుమార్, ఐసిడిఎస్ అధికారులు హౌసింగ్ ఏఈ గౌతమి, ఇతర అధికారులు, మండలంలోని గ్రామాల కార్యదర్శులు సర్పంచులు సంఘ రమేష్ యాదవ్, గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, కందికట్ల అమృత రాజేష్, జీరెడ్డి మహేందర్ రెడ్డి, మారం సునీత జలంధర్ రెడ్డి, గాదం భాస్కర్, సింగిరెడ్డి లింగారెడ్డి, బాల్సాని శారద మల్లేశం గౌడ్, కోడిపెల్లి కొమరమ్మ శ్రీనివాస్, పడిదం లావణ్య మొగిలి, ఆవుల మమత పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం)

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం దరూర్ క్యాంప్‌లోని ఈవీఎంలు భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములోని ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతినెలా ఈవీఎంలను తనిఖీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు తలెత్తకుండా పటిష్టమైన భద్రత ఉండేలా చూడాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పచ్చదనం-పర్యావరణ పరిరక్షణపై గ్రామ సభలో అవగాహన

### - గ్రామసర్పంచ్ మారు గంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహణ



మెట్ పల్లి రూరల్, ఆగస్టు 04(ప్రజా కలం);

మెట్ పల్లి మండలం కోనారావుపేట గ్రామసర్పంచ్ మారు గంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చదనం-పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించి, పరిశుభ్రత, పచ్చదనం ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో బండి ప్రదీప్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందించాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, క్యారీ బ్యాగులు, పర్యావరణానికి హాని కలిగించే ఇతర వస్తువులను వినియోగించకూడదని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని కోరారు. అలాగే జలసిరి కార్యక్రమం,ఇంకుడు గుంతల నిర్మాణం,వర్షపు నీటి సంరక్షణ,భూగర్భజలాల పెంపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం నీటి సంరక్షణకు సహకరించాలని,గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కని పరంధాములు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి పట్నం రాణాప్రతాప్, కారోబార్ పుల్ల శ్రీనివాస్ గౌడ్, వీఓఏ బాపూరపు వనిత, అంగన్‌వాడీ టీచర్లు అందె రమాదేవి, చిలుకమారు సుజాత, జక్కని స్వప్న, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలో జోరుగా చేరికలు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం) తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్)కు పట్టణాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరికల పర్వం జోరుగా కొనసాగుతోంది. మంగళవారం మెట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణానికి చెందిన మైనారిటీ నాయకుడు ఎం.ఎ. మజీద్ తెలంగాణ రక్షణ సేనలో చేరగా, డాక్టర్ రఘు పార్టీ కండువా కప్పి ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ వర్గాలకు చెందిన నాయకులు, యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజార్ భాయ్, సుఖేందర్ గౌడ్, లింగాపెల్లి సంజీవ్, రాజన్న, ముఖిమ్, తోట శ్రీనివాస్, గంగాధర్, వెంకటేశ్, ఆరిఫ్ పాల్గొన్నారు.

# డ్రోన్ స్ప్రేయర్ సేవలను ప్రారంభించిన పీఏసీఎస్...

మల్లాపూర్, ఆగస్టు 04 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో మంగళవారం డ్రోన్ స్ప్రేయర్ సేవలను సంఘ అధ్యక్షుడు వేంపేట నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘ పరిధిలోని రైతులందరూ డ్రోన్ స్ప్రేయర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు వినియోగించుకోవడం ద్వారా తక్కువ సమయంలో సమర్థవంతంగా పంటలకు మందుల పిచికారీ చేయవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పాదం భూమేష్, సంఘ డైరెక్టర్లు కొత్తూరి నారాయణ, బోయిన కొండయ్య, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



## వెల్గటూర్ "వ్యవసాయ మార్కెట్ యార్డ్" వద్ద

# హైమాస్ బల్బుల ఏర్పాటు

### రూ. 5 లక్షల నిధులు మంజూరు - ఆనందంలో రైతులు



వెల్గటూర్, ఆగస్టు 4, ప్రజాకలం ప్రతినిధి : వెల్గటూర్ గ్రామ శివారులో గల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోల్ల తిరుపతి, పీసీసీ అధికార ప్రతినిధి తాటిపర్తి శైలేందర్ రెడ్డిలు మంగళవారం"ఐమాస్" బల్బులను ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ సరైన విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇక్కడున్న పరిస్థితిని మార్కెట్ కమిటీ సభ్యులు, నాయకులు మంత్రి లక్ష్మన్ కుమార్ దృష్టికి తీసుకుపోగా , స్పందించిన మంత్రి రూ. 5లక్షల నిధులనుప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. కాగా చైర్మెన్, నాయకులు వాటితో అక్కడ అవసరమైన విద్యుత్ స్తంభాలు, వైరు, బల్బుల వంటివి కొనుగోలుచేసి, మార్కెట్ యార్డు ఆవరణలో వెలుగులు వచ్చే విధంగా శ్రమించడం పట్ల మండల ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంద్ర శ్రీకాంత్ రావు, నాయకులు రవి, విజయ్, బుచ్చయ్య, డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు..

మల్లాపూర్, ఆగస్టు 4 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో మొక్కజొన్న పంటలను కరీంనగర్ మొక్కజొన్న పరిశోధన స్థానం



శాస్త్రవేత్తలు డా. బి. రాంప్రసాద్, డా. ఇ. రజనీకాంత్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని, కొన్ని చోట్ల మొక్కలు ఎండిపోతున్నట్లు గుర్తించారు. భూమిలో ఉండే శిలీంధ్రాల కారణంగా ఈ సమస్య ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. నివారణలో భాగంగా ప్రొపికొనజోల్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి మొక్కల వేర్ల వద్ద తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. మూడు రోజుల తర్వాత వాలిడోమైసిన్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, అనంతరం 19:19:19 ఎరువును 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లావణ్య, సర్పంచ్ శంకరమ్మ, రైతులు కంది రవీందర్, గడ్డం రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిపేట పారాబాయిల్డ్ రైస్ మిల్లులో విజిలెన్స్ సోదాలు..



మల్లాపూర్, ఆగస్టు 4 (ప్రజా కలం ప్రతినిధి):
జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలోని ఏ.ఆర్.ఎస్ పారాబాయిల్డ్ రైస్ మిల్లులో మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం, బియ్యం నిల్వలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లుకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు వివరాలు, మిల్లింగ్ రికార్డులు, ఇతర సంబంధిత పత్రాలను తనిఖీ చేశారు. అలాగే ప్రభుత్వ ధాన్యం నిల్వలు, బియ్యం తరలింపు అంశాలపై కూడా అధికారులు ఆరా తీసినట్లు సమాచారం.

## గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయండి

పెద్దపల్లి,ఆగస్టు 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
ప్రజాకవి,విప్లవ గాయకుడు,ప్రజా యుద్ధనౌక గద్దర్ మూడవ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఘన వర్ధంతి సభను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద దళిత లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడీ సుదర్శన్,తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య తదితరులు కలిసి వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. గద్దర్ ఆశయాలు,ఆయన ప్రజా ఉద్యమాలకు అందించిన అమూల్యమైన సేవలు,సాహిత్య వారసత్వాన్ని ఈ సభలో ప్రముఖులు స్మరించుకోనున్నారని తెలిపారు.గద్దర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం,ప్రజా చైతన్య మార్గాన్ని భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొంటూ,ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రజాసంఘాల నాయకులు,కళాకారులు,మేధావులు,ఉద్యమకారులు,గద్దర్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం,తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు



## మూడు నెలలు గడిచినా పూర్తికాని విద్యుత్ పనులు

### - పంచరాయి తండాలో కనెక్షన్ కోసం ఎదురుచూపులు

(వరంగల్/పర్వతగిరి) ఆగస్టు 04, ప్రజాకలం ప్రతినిధి. మండలంలోని మాల్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పంచరాయి తండాలో విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేసి, కనెక్షన్ ఇవ్వాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. తండాకు చెందిన భానోత్ వెంకటి, వెంకన్న, మిట్టు ల ఇంటి వద్ద విద్యుత్ సరఫరా కోసం అధికారులు మూడు నెలల క్రితమే స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే స్తంభాలు నాటి మూడు నెలలు గడుస్తున్నా, వాటికి ఇంకా కరెంట్ వైర్లు వేయలేదు. దీనితో పాటు, మిట్టు ఇంటి పక్కనే ప్రమాదకరంగా ఉన్న మెయిన్ విద్యుత్ తీగలను (సప్లై వైర్లను) సరిచేయడానికి అధికారులు మరో రెండు అదనపు స్తంభాలను కూడా అక్కడే ఉంచారు. కానీ ఆ పనులను కూడా ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. మూడు నెలలుగా స్తంభాలు వేసి ఉన్నప్పటికీ, తదుపరి పనులు ముందుకు సాగకపోవడం లేదు ఇప్పటికైనా విద్యుత్ శాఖ



ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
పంచరాయి తండాలోని భానోత్ వెంకటి ఇంటి వద్ద నాటిన స్తంభాలకు వెంటనే వైర్లు వేయడంతో పాటు, మెయిన్ తీగలను సరిచేయడానికి తెచ్చిన మిగతా రెండు స్తంభాలను కూడా అమర్చి, త్వరగా విద్యుత్ సరఫరాను ప్రారంభించాలని విద్యుత్ అధికారులకు తండా ప్రజలు కోరుతున్నారు.

## అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు బెదిరింపులు

### - కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు



(వరంగల్/పర్వతగిరి) ఆగస్టు 04, ప్రజాకలం ప్రతినిధి.
వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దూపతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్‌కు ఒక బాధితుడు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. అదే తండాకు చెందిన బానోత్ నవీన్ అనే యువకుడు ఈ మేరకు పర్వతగిరి డిప్యూటీ తహశీల్దార్ హరిత కు, వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకున్నాడు. బాధితుడు నవీన్ తెలిపిన వివరాల ప్రకారం దూపతండా సర్పంచ్ ధరంసోత్ తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ భూక్యా రాములు తో కలిసి ఆకేరు వాగులో ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా పగలు రాత్రి తేడా లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారని వందల ట్రాక్టర్ ల ఇసుకను పల్లే పకృతి వనం వద్ద నిల్వ చేశారని ఈ అక్రమ రవాణాను ప్రశ్నించినందుకు, అడ్డుకున్నందుకు అధికారులకు పోలీస్ లకు సమాచారం ఇచ్చారనే నెపంతో సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ అనుచరులు తనపై కక్ష పెంచుకున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసు యంత్రాంగం, రెవెన్యూ అధికారులకు కూడా పెద్ద ఎత్తున లంచాలు ఇస్తూ ఈ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాను ఇసుక రవాణాను అడ్డుకుంటే దారి పొడవునా గొడవలు చేస్తున్నారని, తన ప్రాణాలకు ముప్పు తలపెట్టేలా ప్రవర్తిస్తున్నారని నవీన్ తెలిపాడు. అన్నారం గ్రామ సర్పంచ్ ఇంటి వద్దకు పంచాయతీకి పిలిపించి దాడి చేసి మొబైల్ ఫోన్ పగులగొట్టి తనను తీవ్రంగా బెదిరించినట్లు ఈ విషయం ఎక్కడ చెప్పొద్దు అని గుడిలోకి తీసుకువెళ్లి దేవునిపై ప్రమాణం చేయించారని బాధితుడు ఆరోపించాడు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేయాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు ప్రాణ రక్షణ కల్పించాలని బాధితుడు కలెక్టర్‌ను వేడుకున్నాడు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సైకిల్ యాత్రలో తనతో పాల్గొన్న మిత్రుడికి

# రూ. 5000/- ఆర్థిక సహాయం

### - ఎస్ డి ఎస్ ఎస్ అధ్యక్షులు కుమ్మ జెల్ల రాంబాబు

(వరంగల్, పర్వతగిరి) ఆగస్టు 04, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండలం, జమాల్‌పురం, వరకట్న నిర్మూలన కొరకు 2015లో తెలంగాణ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టి, ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్షలో పాల్గొన్న, ఎస్ డి ఎస్ ఎస్ (స్టాప్ డౌరీ – సేవ్ సొసైటీ) వరకట్న నిర్మూలన సమితి అధ్యక్షులు కుమ్మజెల్ల రాంబాబు తనతో కలిసి ఉద్యమంలో పాల్గొన్న మిత్రుడికి అండగా నిలిచారు. జమాల్‌పురం గ్రామానికి చెందిన ల్యాదెల్ల ప్రశాంత్ తండ్రి ఆకస్మికంగా మరణించిన విషయం తెలిసిన వెంటనే రాంబాబు, ప్రశాంత్ ఇంటికి వెళ్ళి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాల్‌పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్, మాజీ సర్పంచ్ జిల్లా రాములు, రాపాక భాస్కర్, ఆకుల రవీందర్, కారింగుల అనిల్, జిల్లా రాజబాబు, గోదారి రంజిత్



తదితరులు పాల్గొన్నారు. ఉద్యమంలో కలిసి నడిచిన మిత్రుడికి కష్టకాలంలో అండగా మంచితనానికి, స్నేహానికి ఆదర్శంగా నిలిచిన కుమ్మజెల్ల రాంబాబు ని జమాల్ పురం గ్రామస్తులు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.

## ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్

అదిలాబాద్ : ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయం కోసం అప్పటి కేంద్ర మంత్రులకు ప్రధానికి వినతిపత్రాలు ఇచ్చానని, అంటే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం ముందస్తుగా బీజం వేసింది తానేనని గుర్తు చేశారు. దానికి సాక్షం బీజేపీ ఎమ్మెల్లే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్లే, బీజేపీ నాయకులు తామే ఆదిలాబాద్ కు విమానాశ్రయం తెచ్చింది తామేనని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ చేస్తే స్థానిక ఎమ్మెల్లే శంకర్ తానే చేస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇచ్చిందని, రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని దీన్ని పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేను ఓడగొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యకర్తలు సైనికుల్లా పని చెయ్యాలని పిలుపునిచ్చారు

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

మల్లాపూర్, ఆగస్టు 04 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత ధాంరాజ్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించి, నాణ్యతతో నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వాల్గొండ గ్రామంలో రూ.3 కోట్లతో చేపట్టనున్న రహదారి, పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.అనంతరం మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఓపీ, ఐపీ, ల్యాబ్, ఫార్మసీ రికార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వర్షాకాలంలో డెంగ్యూ, వైరల్ జ్వరాలు, పాముకాటు, కుక్కకాటు వంటి అత్యవసర పరిస్థితులకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, అలాగే ఆసుపత్రి పరిశుభ్రత, రోగులకు నాణ్యమైన భోజనం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో నరసింహరావు, జిల్లా వైద్యాధికారి సుజాత, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శ్రీకాంత్,మండల వైద్యాధికారి వాహిని, ఏఈ రాగ సుధ, సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మీచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆకస్మికంగా తనిఖీ....

### - అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్....




ఇబ్రహీంపట్నం ఆగస్టు04 ( ప్రజా కలం ప్రతినిధి)
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్క పేట గ్రామం లో గల మీచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆకస్మికంగా అదనపు కలెక్టర్ రాజ గౌడ్ సందర్శించారు. మీచ్చమ్మ చారిటబుల్ ట్రస్టులో ఉన్నటువంటి పిల్లల వసతులుసౌకర్యాలను అడిగితెలుసుకున్నారు.ట్రస్టు పరిసరాలను పరిశీలించారు.ట్రస్టు పూర్తి వివరాలు తెలుసుకోన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ గణేష్,ఎంపీఓ రామకృష్ణ రాజు, అమ్మక్కపేటసర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి,ట్రస్ట్ వ్యవస్థాపకులుడాక్టర్ జె ఎన్ వెంకట్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఇన్‌చార్జి జిల్లా డీటీఓ రమేష్

పెద్దపల్లి,ఆగస్టు04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)పెద్దపల్లి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సహాయ ట్రెజరీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.రమేష్‌కు ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించబడిన సందర్భంగా



మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారి కె.రమేష్ జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం జిల్లా ట్రెజరీ కార్యాలయ నిర్వహణ,ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణ,ప్రజలకు మెరుగైన సేవలందించే అంశాలపై స్వల్పంగా చర్చించారు.

## గాజులపేట 2వ వార్డులో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే సంజయ్ ఆకస్మిక పర్యటన



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 4 (ప్రజాకలం) పట్టణంలోని గాజులపేట 2వ వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. వార్డులోని పలు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జక్కం బాబు, జావీద్, జియా ఉల్ హాక్, ఈసాక్ మొల్సబ్, అక్రమ్ ఆలం ఖాన్, అమ్ము బాజిగార్‌తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## యోగాలో ప్రతిభ కనపరిచిన గురుకుల విద్యార్థినిలు

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 04, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల హనుమకొండ సుబేదారిలో నిర్వహించిన ఏ ఎస్ ఆర్ స్కిల్ హబ్ యోగాసనా భారత్ యోగాలో పర్వతగిరి తెలంగాణ బాలికల పాఠశాల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనిపరిచారు. అండర్ 14 లో ఆరుగురు బాలికలు, అండర్ 18 లో ఇద్దరు బాలికలు పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎన్నికైన విద్యార్థినులను ప్రిన్సిపల్ జోష్నా, వీపీలు, ఇతర ఉపాధ్యాయ బృందము, పీడీ, పిఈటి లు అభినందనలు తెలియజేశారు.



### భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా

# నైపుణ్యాలను పెంపొందించుకోవాలి




### – కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 4 :

భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని పి.ఎం. శ్రీ కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.పాఠశాలలో నెలకొల్పిన క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యా సంస్కృతి, విద్యార్థుల్లో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం తనను ఎంతో ఆకట్టుకున్నాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరుస్తూ ఆత్మవిశ్వాసంతో పాల్గొనడం వెనుక ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని ప్రశంసించారు.పి.ఎం. శ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతులు, క్రీడా సదుపాయాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, స్మార్ట్ తరగతి గదులు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆవిష్కరణలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టింకరింగ్ ల్యాబ్‌లు, వృత్తి విద్యా ప్రయోగశాలలు, ఇన్నోవేషన్ సెంటర్లు విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో కీలకంగా ఉంటాయని చెప్పారు.

విద్యార్థులు భవిష్యత్తులో ఇంజనీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు, అధికారులు, కళాకారులుగా రాణించాలని ఆకాంక్షించిన కలెక్టర్, పాఠ్యాంశాలతో పాటు ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా ప్రాథమిక పరిజ్ఞానం, నైపుణ్యాలు విజయానికి బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

స్కిల్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, వృత్తి విద్యా ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.అంతకుముందు కలెక్టర్‌కు కేంద్రీయ విద్యాలయ స్కౌట్స్ బృందం గౌరవ వందనంతో స్వాగతం పలికారు. అనంతరం బాలవాటిక విద్యార్థిని పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. స్కిల్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ 12వ తరగతి విద్యార్థుల తరగతి గదిని సందర్శించి వారితో మాట్లాడారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి సారించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని సూచించారు.

ఈ కార్యక్రమంలో పి.ఎం. శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు వై. సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

### - ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ - తానూర్ మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై అధికారులకు కీలక ఆదేశాలు



తానూర్, ఆగస్టు 4(ప్రజా కలం): సర్పంచ్‌లు అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు, మంగళవారం తానూర్ మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు, సమావేశంలో సర్పంచ్‌లు లేవనెత్తిన ప్రతి సమస్యను రాబోయే 45 రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**మిషన్ భగీరథ అధికారులపై సర్పంచ్‌ల ఆగ్రహం:**

సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు,ఈ క్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు,ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు,

నీటి సమస్యలు: నందిగాం, జౌలా (బి), బోంద్రేట్, దహగాం గ్రామాల్లో తీవ్ర నీటి సమస్య ఉందని, ట్యాంకుల నుంచి నీరు రావడం లేదని బోంద్రేట్ సర్పంచ్ రవీందర్ పటేల్ సహా పలువురు సర్పంచ్‌లు వాపోయారు,

దహగాం గ్రామ ట్యాంక్ వద్ద ఉన్న లీకేజీని వారం రోజుల్లోగా పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని మిషన్ భగీరథ ఏఈని ఎమ్మెల్యే ఆదేశించారు,

సమావేశానికి ముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు,ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ మహేందర్ నాథ్, ఎంఈఓ నరేందర్, సొసైటీ చైర్మన్ నారాయణరావు పటేల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మానవత్వం బతికే ఉందని నిరూపించిన కానిస్టేబుల్ గోపాల్, విలేకర్ అజీమ్

### - మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ ఒడికి చేర్చి మానవత్వాని చాటుకున్నారు
### - మతిచేలించి రెండేండ్ల క్రితం తప్పిపోయిన వ్యక్తి కుటుంబంతో మళ్ళీ పునర్మిలినం

( కొత్తూర్ ఆగస్టు 4 ప్రజా కలం ప్రతినిధి )

మతిస్థిమితం కోల్పోయి రోడ్డు పక్కన చెత్తకుప్పలో పడేసివున్న చెడిపోయిన ఆహారాన్ని తింటూ దయనీయ స్థితిలో జీవిస్తున్న ఓ వ్యక్తికి కొత్తూరు పోలీసులు అండగా నిలిచి మానవత్వం ఇంకా బ్రతికేవుందని నిరూపించారు అతనికి ఆశ్రయం కల్పించి, పూర్తి వివరాలు సేకరించి, ఒడిశాలో ఉన్న కుటుంబ సభ్యులను గుర్తించి వారికి క్షేమంగా అప్పగించారు. పోలీసుల విచారణలో ఆ వ్యక్తి రెండు సంవత్సరాల క్రితం ఒడిశా రాష్ట్రం లోని ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తెలంగాణకు చేరుకుని తమ బంధువును చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఎన్నో రోజుల తర్వాత కుటుంబ సభ్యుడు క్షేమంగా దొరకడంతో కొత్తూరు పోలీసులకు, డీడీ 9 వార్త విలేఖర్ ఎండి అజీమ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌లో చోటుచేసుకుంది.

**రిపోర్టర్ ఎండి అజీమ్ మాట్లాడుతూ...**మతిస్థిమితం కోల్పోయిన వారు లేదా నిరాశ్రయులు ఎక్కడైనా కనిపిస్తే వారిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించి మానవత్వంతో స్పందించాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు.

**పోలీస్ కానిస్టేబుల్ గోపాల్ మాట్లాడుతూ...**

రోడ్లపై, చెత్తకుప్పల వద్ద లేదా ఇతర ప్రాంతాల్లో మతిస్థిమితం కోల్పోయిన వారు కనిపిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులను గుర్తించి క్షేమంగా చేర్చేందుకు కొత్తూరు పోలీసులు ఎల్లప్పుడూ కృషి చేస్తారని తెలిపారు.

అనంతరం ఆ వ్యక్తిని కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేర్చి, స్వగ్రామానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.





**మానవ సేవే మాధవ సేవ**

మతిస్థిమితం లేని వారు చెత్తకుప్పల్లో లేదా రోడ్లపై ఆశ్రయం పొందుతున్నప్పుడు వారిని రక్షించడం, వారికి భరోసా కల్పించడం, కుటుంబ సభ్యులతో కలపడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

### అటవీ జంతువుల వేట కేసులో పరారీలో ఉన్న

# మరో ఇద్దరు నిందితుల అరెస్ట్

తల్లాడ, ఆగస్టు 4 (ప్రజా కలం న్యూస్);

తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కల్లూరు సెక్షన్‌లో ఇటీవల అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఎలుగుబంటిని హతమార్చిన కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను అటవీ శాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం చాకచక్యంగా అరెస్టు చేశారు.

ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించిన విషయం విదితమే. ఈ కేసులో పరారీలో ఉన్న అజ్మీర కృష్ణ (కొత్తబోడు మల్లె గ్రామం), ఏనుగంటి రామకృష్ణ (లోకారం గ్రామం) కోసం తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉమా ఆధ్వర్యంలో ప్రత్యేక రెక్కీ నిర్వహించి, ఉదయం వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 11 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఖమ్మం జిల్లా కారాగారానికి తరలించారు. ఈ సందర్భంగా తల్లాడ ఫారెస్ట్




రేంజ్ ఆఫీసర్ జి ఉమా మాట్లాడుతూ అటవీ నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడవుల్లో అక్రమ వేట, విద్యుత్ తీగల ఏర్పాటు వంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి. సురేష్ కుమార్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రమేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (కోర్టు డ్యూటీ), నక్క రమేష్, అజమ్ అలీ (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్), తెనాలి శీను, తేజావద్ కృష్ణ, అంజద్ పాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వివిధ రకాల రెవెన్యూ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### – భూభారతి, సాదాబైనమా, రీసర్వే, నక్షా సర్వే, మీసేవ, ఎస్ఐఆర్, ఆర్‌టీఐ తదితర రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 4:

భూభారతి, సాదాబైనమా, రీసర్వే, నక్షా సర్వే, మీసేవ, ఎస్ఐఆర్, ఆర్‌టీఐ తదితర రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ప్రతి పనిలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు.మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వివిధ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.భూభారతి దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని అన్నారు. భూభారతి పోర్టల్‌లో 60 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లకు ఆదేశించారు. సర్వేయర్ల కొరత, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైన వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ల్యాండ్ యాప్‌లోని జీపీఎస్ కోఆర్డినేట్ల ఆధారంగా స్కెచ్‌లు సిద్ధం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పెండింగ్ ఫైళ్లపై నిరంతరం ఫాలోఅప్ చేయడంతో పాటు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలతో పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పనులు కొనసాగుతున్నప్పటికీ భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు.

సాదాబైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన కేసులను లిఖితపూర్వకంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, ప్రతి మండలంలో పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లాలో చేపడుతున్న గ్రామాల రీసర్వే పనులను వేగవంతం చేస్తూ గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే దశల కోసం ముందస్తుగా గ్రామసభలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, శిక్షణ పొందిన సిబ్బందిని రీసర్వే బృందాలతో సమన్వయం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు లైసెన్స్ సర్వేయర్లను వినియోగించి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.మున్సిపాలిటీల్లో నక్షా సర్వే కోసం అవసరమైన డాక్యుమెంట్ల సేకరణ ఆలస్యంగా జరుగుతుందని గుర్తించిన కలెక్టర్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించి ఆస్తి పన్ను రికార్డులు, ఇతర పత్రాలను వేగంగా సేకరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షిస్తూ డాక్యుమెంట్ సేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు.మీసేవలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, ముఖ్యంగా ఫ్యామిలీ మెంబర్‌షిప్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆలస్యంగా జనన నమోదు వంటి దరఖాస్తులను భౌతికంగా పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అనవసరంగా పెండింగ్‌లో ఉంచడం లేదా తిరస్కరించడం చేయవద్దని స్పష్టం చేశారు.జిల్లాలో ఎస్ఐఆర్ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఏఎస్‌డీ జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులతో పంచుకుని వారి అభిప్రాయాలను స్వీకరించాలని, క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరణ నిర్వహించి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు.

ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ సమయంలో డేటా నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఆర్‌టీఐ దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రతి మండలంలోని ప్రభుత్వ భూముల వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో జిల్లా కార్యాలయానికి పంపాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు.

సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, ఆర్.డి.ఓ నవీన్, జిల్లా భూ సర్వే రికార్డుల శాఖ ఏడీ అశోక్, సంబంధిత అధికారులు, మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపును పారదర్శకంగా చేయాలి

### - సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య డిమాండ్




తల్లాడ, ఆగస్టు 4 (ప్రజా కలం న్యూస్): రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం ఇచ్చిన వాగ్దానం ప్రకారం వృద్ధాప్య వితంతు తదితర పెన్షన్లు వెంటనే పెంచాలని అలాగే,వ్యవసాయ కార్మికులకు, ఆటో కార్మికులకు ఇస్తానన్న పెన్షన్లు వెంటనే అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య చేశారు. మంగళవారం తల్లాడ మండల కేంద్రంలో పార్టీ ఏనుకూరు తల్లాడ సంయుక్త మండల కమిటీ సమావేశం ఎస్కే జానీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం లో ఆయన ముఖ్యఅతిథి గా పాల్గొని మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం జంతర్ మంతర్లో, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులు పెట్టడం, అరెస్టులకు పూనుకోవటం దుర్మార్గమైన చర్యని ఆయన విమర్శించారు. కేసులన్నీ ఎత్తివేస్తామని ఇచ్చిన ఆమెని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేసులను ఉపసంహరించుకోవాలని, అక్రమ అరెస్టులను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే, ఉద్యమకారులపై విచక్షణారహితంగా చేసిన అమానుషకాండపై స్వతంత్ర న్యాయమూర్తుల బృందంతో విచారణ జరిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో, కళాశాల కవితవ్యంతో ఆడుకోవడం సరైనది కాదని పాత బకాయిలు ఇస్తూనే ఫీజు రియంబర్స్మెంట్ ఏ ఏడాది కా ఏడాది ఇచ్చే విధానం పకడబందిగా అమలులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకపోవడం విద్యా శాఖపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. యూనివర్సిటీల నుంచి ప్రభుత్వ బడుల దాకా తీవ్ర నిధుల కొరత సమస్యలతో సతమతమవుతున్నాయని, సౌకర్యాలు లేక శిధిల మవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే వేల బడులు మూసివేసారని విద్యాశాఖను ముఖ్యమైన భాగంగా తీసుకుని తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపును పారదర్శకంగా చేయాలని, పైరవీలకు తావివ్వరాదని,అలాగే, ఉద్యమకారులను ఏబీసీడీలుగా వర్గీకరరించి, వారికి ప్రభుత్వ పథకాలని వర్తింపజేయాలని,తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లాలో మిగిలిన పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని, అలాగే, గోదావరి జలాలను పాలేరు వరకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున, పంటలు ఆలస్యంగా ప్రారంభమైనాయని వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి ?7500 మరియు 20 కిలోల బియ్యం తదితర జీవన భృతి సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు పంటలకు మద్దతు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆగస్టు 11న సోమవారం ఏఐ యు కె ఎస్, ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతుల పంటలకు సమగ్ర ధరలు ప్రకటించాలని, నాలుగు నల్ల చట్టాలను దొడ్డి దారిన అమలు చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ,ఆగస్టు 15న ఆదివారం ఖమ్మం లో జిల్లా పరిషత్తు అంబేద్కర్ విగ్రహం నుండి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య, పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి ఎస్కే లాల్ మియా, డివిజన్ నాయకులు ఎలదండి బాబు, పాశం అప్పారావు, డి శ్రీనివాసరావు, ఏనుకూరు తల్లాడ సంయుక్త మండలాల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు మండల నాయకులు గడ్డం లింకులు ఎస్కే జానీ, గొడ్ల పుల్లమ్మ,డి రమణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్, ఆగస్టు 4 (ప్రజా కలం) నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పదర మండలం మద్దిమడుగు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పూర్ణకుంభ స్వాగతం అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువత విద్య, ఉపాధి రంగాల్లో ఉన్నత స్థాయికి చేరాలని, జిల్లా సమగ్రాభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టతను తెలుసుకున్న కలెక్టర్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, స్థానిక ఎస్సై, వివిధ శాఖల అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## శీనన్న ఆత్మీయ భరోసా.. ఆపదలో అభయహస్తం!



పాలేరు ఆగష్టు 04( ప్రజా కలం న్యూస్ ) ఏదులాపురం మున్సిపాలిటీ మంగళవారంఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయి తీరని శోకంలో ఉన్న 45 నిరుపేద కుటుంబాలకు 'శీనన్న ఆత్మీయ భరోసా' కొండంత అండగా నిలిచింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బాధిత కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4,50,000 ఆర్థిక సాయాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరఫున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో తమను ఆర్థికంగా ఆదుకున్న మంత్రి పొంగులేటికి, పీఎస్ఆర్ ట్రస్ట్‌కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.

## జజ్జులరావుపేట నవిలె కొమరయ్య భౌతికకాయాన్ని నివాళులర్పించిన కూసుమంచి బిఆర్ఎస్ మండల పార్టీ



పాలేరు ఆగష్టు 04(ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలం పరిధిలోని జజ్జులరావుపేట మంగళవారం మాజీ ఎంపీటీసీ నవిలె సుగణ,భర్త నవిలె కొమరయ్య,ఉదయం గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని వారి పార్థివ దేహాన్ని నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించరు. ఈ కార్యక్రమంలో కూసుమంచి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శి వేముల వీరయ్య , ఆసిఫ్ పాషా, జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న స్థానిక సర్పంచ్ దాట్ల సతీష్ ( సలీం) సర్పంచుల సంఘం అధ్యక్షులు బానోత్ బిక్షం నాయక్, మాజీ సర్పంచ్ బానోత్ కిషన్ నాయక్,వద్యా బాలకృష్ణ,ఉప సర్పంచ్ లు, స్థానిక వార్డ్ మెంబర్లు స్థానిక బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర మాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర లీగల్ అడ్వైజర్ గా అవులూరి సత్యనారాయణ నియామకం

### కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన కుసపాటి శ్రీనివాస్ కి సన్మానం

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, ఆగస్టు 04: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాదిగ చర్మకారుల సంఘం సమావేశం మంగళవారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర చైర్మన్ కుసపాటి శ్రీనివాస్ భద్రాచలానికి చెందిన సీనియర్



న్యాయవాది, సీనియర్ దళిత నాయకులు అవులూరి సత్యనారాయణ ని తెలంగాణ రాష్ట్ర మాదిగ చర్మకారుల సంఘం లీగల్ అడ్వైజర్ గా నియమిస్తూ నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అవులూరి సత్యనారాయణ మాట్లాడుతూ నాకు అప్పజెప్పిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ మాదిగ చర్మకారుల సమస్యల పరిష్కారంలో న్యాయపరమైన సలహాలు ఇస్తూ, మాదిగ చర్మకారుల సమస్యల పరిష్కార ఉద్యమాల్లో పాల్గొంటారని తెలియజేశారు. అనంతరం తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘం చైర్మన్ కుసపాటి శ్రీనివాసును కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంటు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా వారిని దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య అవులూరి సత్యనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది.

# విద్యా వాలంటీర్ల శిక్షణ శిబిరానికి డిఇఓకు ఆహ్వానం

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 4:

మహబూబ్ నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి విజయ కుమారి గారిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 8, 9, 10 తేదీలలో మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్న విద్యా వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి తన సొంత నిధులతో విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి చేపట్టిన 'శతశాతం' కార్యక్రమం ప్రస్తుతం మహబూబ్ నగర్ నియోజకవర్గంలో విశేష ఫలితాలను అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో, ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన విద్యా వాలంటీర్లను ఎంపిక చేయడం జరిగింది. ఈ వాలంటీర్లకు బోధనా నైపుణ్యాలు, విద్యార్థులతో మెలగే విధానం, పాఠ్యాంశాల లోతైన అవగాహన వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం కోసం ఈ మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నిష్ణాతులైన అధ్యాపకుల బృందం పాల్గొని, ఆధునిక బోధనా



పద్ధతులు, డిజిటల్ టూల్స్ వినియోగం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, పరీక్షల సిద్ధత వంటి కీలక అంశాలపై సమగ్ర మార్గదర్శకత్వం అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి, విద్యా వాలంటీర్లకు ప్రోత్సాహం ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి గారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ డుంకుడు శ్రీనివాస్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ టి. రవీందర్ రెడ్డి, జీహెచ్ఎంలు బాలు యాదవ్, ఆనంతప్ప, హెచ్ఎం హరినాథ్, రాజు నాయక్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలి

### - పుస్తకాలను చదివించడం ద్వారా పిల్లల్లో ఆసక్తి పెరుగుతుంది

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ఆగస్టు04 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు.

ముందుగా ఎంపిపిఎస్ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలకు సంబంధించిన వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులంతా క్రమం తప్పకుండా బడికి వచ్చే విధంగా చూడాలన్నారు. విద్యార్థులతో ఇంగ్లీషు కథలు చదివిపించి, ప్రశ్నలు అడిగి వారి నుంచి జవాబులు రాబట్టారు. సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి, వారికి పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. పిల్లలకు అర్థం కాని పదాలను బోర్డు మీద రాసి వివరించారు.

కలెక్టర్ మాట్లాడుతూ, పుస్తకాలను చదివించడం ద్వారా భాషా జ్ఞానం, సబ్జెక్టుపై నైపుణ్యం పెరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో రోజూ కొంత సమయం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు కథలు చదివిపించాలన్నారు. సరికొత్త పద్ధతుల ద్వారా విద్యార్థులకు చదువు నేర్పిస్తే, వారికి నేర్చుకోవాలన్న ఆసక్తి కలుగుతుందన్నారు.

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన వివరాలన్నీ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు, ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు.

పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ అడిగారు. భౌతిక శాస్త్ర సబ్జెక్టులో దర్పణాల పాఠంలో నుంచి విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. జవాబులు చెప్పిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. వారికి పెన్నులను బహుమతులుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సబ్జెక్టులోని అన్ని విషయాలు నిత్య జీవితానికి ముడిపడి ఉంటాయని, ఆ విషయాలను అన్వయించుకొని చదవడం వల్ల సారాంశం సులభంగా అర్థమయ్యి, మర్చిపోకుండా ఉంటామని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ సంతోష్, ఎంపీవో ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు : సిడిపిఓ రాజేశ్వరి



ప్రజా కలం ఆగస్టు 4 (గద్వాల ప్రతినిధి)జోగులాంబ గద్వాల్ పట్టణంలోని చింతల్‌పేట సెక్టార్ పరిధిలోని దాదర్‌పల్లి-5,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాశన కార్యక్రమం, ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ రాజేశ్వరి మాట్లాడుతూ, తల్లిపాలే శిశువుకు ప్రకృతి ప్రసాదించిన తొలి ఆహారం, తొలి టీకా అని అన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్వైజర్ వాహిని మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం తల్లిపాల ప్రాధాన్యంపై ప్రతి తల్లి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

2వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి నరసమ్మ మాట్లాడుతూ, తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా కృషి చేయాలని అన్నారు. తల్లిపాల వారోత్సవాల ద్వారా సమాజంలో అవగాహన పెంపొందడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. 3వ వార్డ్ కౌన్సిలర్ నాగులు యాదవ్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబం గుర్తించాలని, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఈకార్యక్రమంలో ఏఎన్ఎం నవీన, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, నాగశేషమ్మ, హెల్పర్ పావని, ఆశ వర్కర్లు హేమలత, సుజాత, చిట్టెమ్మ, శ్యామల, నర్సమ్మ, సౌజన్య, సురేఖ, గర్భిణీలు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు

### - తెలంగాణకు రూ. 9.19 కోట్లు విడుదల

### - ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్ర సామాజిక న్యాయ మంత్రి బీఎల్.వర్మ.

ఖమ్మం ఆగష్టు 04(ప్రజా కలం న్యూస్ ) దేశంలోని దివ్యాంగులకు మెరుగైన వసతులు, అభ్యసన అవకాశాలు కల్పించడంలో భాగంగా 'సుగమ్య భారత్ అభియాన్' అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మంగళవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బీఎల్(బన్వారీలాల్ ). వర్మ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

తెలంగాణకు అందిన నిధులు



సుగమ్య భారత్ అభియాన్ కింద 2015-16 నుంచి 2024-25 వరకు తెలంగాణ రాష్ట్రానికి వివిధ ఏళ్లలో కలిపి మొత్తం రూ. 9.19 కోట్లు (రూ. 919.24 లక్షలు) విడుదల కాగా.. ఇందులో రాష్ట్రం ఇప్పటివరకు మొత్తం రూ.4.56 కోట్లు(రూ.455.63 లక్షలు) నిధులను వినియోగించినట్లు మంత్రి వెల్లడించారు.

యూడీఐడీ పోర్టల్ వివరాలు... దివ్యాంగులకు డిజిటల్ పద్ధతిలో సేవలు అందించేందుకు నిర్వహిస్తున్న యూడీఐడీ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా 1,40,68,994 మంది అనుసంధానం కాగా... తెలంగాణ రాష్ట్రంలో 9,07,019 మంది అనుసంధానమైనట్లు తెలిపారు.

**బడి మానేసే విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు**

దివ్యాంగ విద్యార్థులు చదువు మధ్యలో మానేయకుండా నిరోధించేందుకు 'సమగ్ర శిక్షా అభియాన్' ద్వారా పలు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఏటా రూ. 3,500 చొప్పున ఆర్థిక సహాయంతో పాటు ?బాలికల విద్యను ప్రోత్సహించేందుకు డీబీటీ ద్వారా ఏటా రూ. 2,000 చొప్పున స్టైపెండ్ అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

## బాసర సీటు సాధించిన విద్యార్థి ఆదిత్యకు 25 వేలు ఆర్థిక సాయం అందజేత..



తల్లాడ, ఆగస్టు 4 (ప్రజా కలం న్యూస్): వైరా మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సంపాదించిన కంభంపాటి ఆదిత్య నిరుపేద కుటుంబం కావడంతో తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-1991 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్పందించి ఆదిత్యకు 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నగదును మంగళవారం సదరు విద్యార్థికి పూర్వ విద్యార్థులు అప్పలరాజు సరికొండ అప్పలరాజు, పఠాన్ రహీం, చింతల క్రిషయ్య చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి చదువులో రాణించిన ఆదిత్య కు ఆర్థికంగా ఆదుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆ విద్యార్థి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి పలువురికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

నిర్మల్ ఆగస్టు 04 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)



మండల కేంద్రమైన కుబీర్ లో మంగళవారం అంగన్వాడి కేంద్రం నెంబర్ - 1 లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన హెల్త్ సూపర్వైజర్ సుగుణ మాట్లాడుతూ అప్పుడే జన్మించిన పిల్లలకు ముర్రుపాలు,తల్లిపాలు శ్రీరామరక్ష అని అన్నారు. ఆ పాలలో ఏడు రోగాల నివారణ శక్తి ఉంటుందని అందుకే తప్పకుండా వినియోగించాలని సూచించారు. గర్భిణీలు బాలింతలకు పిల్లల తల్లులకు అందరికీ తగుచూచనలు ఇచ్చారు కార్యక్రమానికి హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎం ఆశ వర్కర్లు గర్భిణీలు బాలింతలు, పిల్లల తల్లుల అందరూ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

### పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే

ప్రజా కలం ఆగస్టు 4 (గద్వాల ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో గ్రామాల అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్షా సమావేశం లో ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో గ్రామాలలో కొనసాగుతున్న అభివృద్ధి గ్రామాలలో ఎదీ-+ ≕ఖఎ + పథకం ద్వారా గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడి భవనాలు, మహిళా సంఘాల భవనము ఏ గ్రామాలలో నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి విషయాల పై అధికారుల తో ఆరా తీశారు. అన్ని గ్రామాలలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలి. గ్రామాలలో ఎంత మేరకు నిర్మాణ పనులు పూర్తి కావడం జరిగింది ఎక్కడ ఇబ్బందిగా ఉన్నది వాటిని వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేయాలి సూచించారు. ప్రజాప్రతినిధులతో గ్రామ సర్పంచ్లతో సమన్వయంతో అధికారులు గ్రామాలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గతంలో గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయడం జరిగిందో అదే విధంగా నూతన సర్పంచులు కూడా గ్రామ అభివృద్ధికి సహకరించాలి అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెంది ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.. గ్రామాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.







## రూ.45 కోట్ల ఏటీసీతో రుద్రంగికి

# ఉపాధి వెలుగు

### విదేశీ ఉద్యోగాల కోసం ప్రత్యేక శిక్షణ..జర్మన్ భాష బోధనకు చర్యలు

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

రాజన్న సిరిసిల్ల,రుద్రంగి, ఆగస్టు 04 (ప్రజాకలం ప్రతినిధి): రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) యువతకు ఆధునిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను మరింత విస్తృతం చేస్తాయని కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు,రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు,ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు,అనంతరం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు డైరెక్టర్ (ఉపాధి కల్పన, శిక్షణ) ఐఏఎస్ ఏ. నిర్మల క్రాంతి వెస్లీ, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితెతో కలిసి శంకుస్థాపన చేశారు,మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి తెలంగాణ గీతాన్ని ఆలపించారు.

**విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ...**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.4 వేల కోట్ల వ్యయంతో 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు,ఐటీఐలను ఆధునీకరిస్తూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు,గత రెండున్నరేళ్లలో లక్ష మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని తెలిపారు,జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విదేశీ భాషల శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు,రుద్రంగికి జర్మన్ భాషా శిక్షకుడిని పంపించి 100 మంది యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు,డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక కోర్సులను కూడా ఏటీసీల్లో ప్రవేశపెడతామని తెలిపారు,ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పెన్షన్లపై కీలక ప్రకటన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**అభివృద్ధి పనులు వేగంగా...**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు,మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్



నిర్మిస్తున్నామని, ఇందులో 2,500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉంటుందని తెలిపారు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధి, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, కలికోట సూరమ్మ ప్రాజెక్టు భూసేకరణ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ తీసుకున్నారని, రోడ్డు విస్తరణ పనులు, మూలవాగుపై రెండో వంతెన నిర్మాణం చివరి దశకు చేరుకుందని వెల్లడించారు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు, రుద్రంగి ఏటీసీలో 288 మంది విద్యార్థులకు ఏడు కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

**పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు...**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో ఆధునిక కోర్సులు రూపొందించామని తెలిపారు, ఏఐ, డ్రోన్ టెక్నాలజీ సహా ఏడు కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు,ఈ అవకాశాన్ని నియోజకవర్గ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుందరెడ్డి, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, ఈఈ సుదర్శన్‌రెడ్డి, మైనింగ్ ఏడీ క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర వేడుకలకు పటాన్‌చెరు ముస్తాబు

### పటాన్‌చెరులో ఘనంగా స్వాతంత్ర వేడుకలకు ఏర్పాట్లు



పటాన్‌చెరు, ఆగస్టు 4(ప్రజా కలం) ప్రతినిధి

స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు పటాన్‌చెరులో ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి.విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ చైతన్యం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం శాసనసభ్యుల శిబిర కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకలపై సమీక్ష నిర్వహించారు.ఆగస్టు 15న పటాన్‌చెరు విభాగంలోని మైత్రి మైదానంలో సాంస్కృతిక ప్రదర్శనలు,కవాతు,దేశభక్తి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి పాఠశాలకు రూ.5 వేల ప్రోత్సాహక నగదు,ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు దేశ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు ఉండాలని గూడెం మహిపాల్‌రెడ్డి సూచించారు..

## ఇంద్రేశం అక్రమ నిర్మాణాలపై విచారణ

### ఇంద్రేశం అక్రమ నిర్మాణాలపై అదనపు కలెక్టర్ విచారణకు ఆదేశం!

పటాన్‌చెరు, ఆగస్టు 4 (ప్రజా కలం) ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు ఇంద్రేశం మున్సిపాలిటీలో కొనసాగుతున్న పరిపాలనా వ్యవహారాలు,కార్యాలయ పరిస్థితులు,అక్రమ నిర్మాణాల అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ పాండు మంగళవారం ఆకస్మికంగా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన,కార్యాలయం చాలా ఇరుకుగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం అక్కడే ఉన్న విలేకరులు పర్యటనకు గల కారణాలపై ప్రశ్నించగా,ఇది సాధారణ తనిఖీ పర్యటనేనని పాండు తెలిపారు. అయితే విలేకరులు ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల విషయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పాండు దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన ఆయన,పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..



## తల్లి పాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారం..

### డెలివరీ అయిన గంటలోపే పాలివ్వాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్ - ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలకు పండ్ల పంపిణీ



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 4 ( ప్రజా కలం ప్రతినిధి) : శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలు తల్లి పాలలోనే ఉంటాయని, ప్రసవం జరిగిన తొలి గంటలోపే శిశువుకు తల్లిపాలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు, ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు, ఈ సందర్భంగా సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యత, పాలిచ్చే సరైన విధానం, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, అపోహల నివృత్తిపై నాటిక ద్వారా అవగాహన కల్పించారు, అనంతరం కలెక్టర్ బాలింతలకు పండ్లను పంపిణీ చేసి, తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువును తల్లి వద్దకు చేర్చి, తొలి గంటలోపే తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు, తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు,తల్లిపాలు శిశువు ఎదుగుదల, బరువు పెరుగుదలకు ఎంతో దోహదపడతాయని, బాలింతలకు కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని పేర్కొన్నారు, బాలింతలు వైద్యుల సూచన మేరకు పోషకాహారం, డ్రైఫ్రూట్స్ తదితర ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు, శిశువుకు సరైన విధంగా పాలిచ్చే పద్ధతులపై బాలింతలకు వైద్యులు, సిబ్బంది శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు, జిల్లావ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని బాలింతలను తరచూ కలుసుకుని తల్లిపాల ప్రాధాన్యం, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, మందుల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ మహేష్ కుమార్, వార్డు కౌన్సిలర్ నీరజ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంతరిక్షంలో సిరిసిల్ల యువత సత్తా!

### విక్రమ్-1 మిషన్‌లో సేవలందించిన యువ ఇంజినీర్లకు కలెక్టర్ ఘన సన్మానం

### ఆకాశమే హద్దుగా లక్ష్యసాధన చేయాలని విద్యార్థులకు పిలుపు

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 04 ( ప్రజా కలం ప్రతినిధి) : స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే యువతకు ఆకాశమే హద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు, స్కైరూట్ స్పేస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'విక్రమ్--1' అంతరిక్ష ప్రయోగంలో కీలక సేవలందించిన సిరిసిల్ల జిల్లాకు చెందిన అడుప సంతోష్ కుమార్, అడుప కిరణ్ కుమార్, బొమ్మదేని నాగరాజులను మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ప్రత్యేక ఇంటరాక్షన్ కార్యక్రమంలో స్పేస్ సిస్టమ్స్, లాంచ్ వెహికల్స్, అత్యాధునిక సాంకేతికత, అంతరిక్ష రంగంలో ఉపాధి అవకాశాలు, ఎదురయ్యే సవాళ్లపై వారు వివరించారు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ తమ అనుభవాలను పంచుకున్నారు, ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాకు చెందిన యువకులు దేశ అంతరిక్ష రంగంలో తమ ప్రతిభను చాటడం జిల్లాకు గర్వకారణమన్నారు,స్కైరూట్ సంస్థలో పనిచేస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్న వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు,లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు,క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ విజయానికి మూలమని పేర్కొన్నారు, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను



పెంపొందించుకుని అత్యాధునిక సాంకేతిక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు, జిల్లాకు వచ్చినప్పుడల్లా విద్యార్థులకు మార్గనిర్దేశం చేసి వారిలో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించాలని స్కైరూట్ యువ ఇంజినీర్లకు సూచించారు. అనంతరం అడుప కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం అందుకోవడం జీవితంలో మరిచిపోలేని ఘట్టమన్నారు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా కృషి, పట్టుదలతో ప్రపంచ స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు, విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## నిలదీసి ప్రశ్నిస్తే...అక్రమ కేసులు...

### ప్రజల కోసం గొంతెత్తడం తప్పా-గజ్జెల నగేష్

### ప్రభుత్వ ఆస్తుల కోసం పోరాడతాము

### చట్టం,న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉంది




కంటోన్మెంట్:ఆగస్టు4, ప్రజాకలం ప్రతినిధి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టుతున్నారని తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అక్రమాలు,అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. సోమవారం కంటోనటట్మంట్ పరిధిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రశ్నించడం నేరమా? ప్రజల తరఫున గొంతెత్తడం తప్పా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. న్యూబోయిన్‌పల్లి మార్కెట్ సమీపంలోని సర్వే నం.157/1 ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ప్రశ్నించినందుకే తమపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా బీఆర్ఎస్ సైనికులుగా భయపడేది లేదని స్పష్టం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ప్రజల హక్కులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తేల్చిచెప్పారు.

## సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో

### వైభవంగా గౌండ్ల కులస్థుల బోనాలు

### - పాల్గొన్న డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 04(ప్రజా కలం):సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో



గౌండ్ల కులస్థుల బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సదాశివపేట పట్టణంలోని దుర్గమ్మ గుడిని సందర్శించిన నిర్మలా జగ్గారెడ్డి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గౌండ్ల కులస్థులు నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు, కౌన్సిలర్ నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలో జరిగిన గౌండ్ల కులస్థుల బోనాల వేడుకలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, గొర్రె పొట్టేళ్లతో అలంకరించిన ఫలహారం బండి ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ జోగిని అవికా బోనం ఎత్తుకుని ఈ ఉత్సవంలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో గౌండ్ల సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, నరేందర్ చక్రవర్తి గౌడ్ , సురేందర్ గౌడ్, నక్క నాగరాజు గౌడ్, ఆర్. సుధాకర్ గౌడ్, దుర్గా గౌడ్, భరత్ గౌడ్, ఫని, కిరణ్, శ్రీకాంత్ , మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిట్కుల్‌లో బోనాల జోష్..

- చిట్కుల్‌లో దుర్గమ్మ జాతర వైభవం.. భక్తుల పోటెత్తిన రాక..
- బోనాల సంబరాలకు సర్వం సిద్ధం.. శుక్రవారం మహోత్సవం..
- నీలం మధు ముదిరాజ్ పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు..
- భక్తి వెల్లువలో చిట్కుల్.. వేలాదిగా తరలివస్తున్న భక్తులు..



పటాన్‌చెరు,ఆగస్టు 4(ప్రజా కలం) ప్రతినిధి

ఇస్నాపూర్ మున్సిపాలిటీలోని చిట్కుల్ గ్రామం భక్తి పారవశ్యంలో మునిగితేలుతోంది! రెండేళ్లకోసారి వచ్చే అపురూప దుర్గమ్మ జాతర,ఆషాఢ బోనాల సంబరాలు మంగళవారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. గ్రామమంతా భక్తి పరవశంతో ఊగిపోతుండగా,వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం పోటెత్తారు.ఏర్పాట్లను మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు నీలం మధు ముదిరాజ్ స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపారు..

**మొదటి రోజు ఉత్కంఠభరితంగా కట్టమైసమ్మ జాతర!..**

తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పవిత్ర జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, మొక్కుబడులతో గ్రామం మారుమోగింది.పసుపు, కుంకుమలు, మామిడి తోరణాలతో అలంకరించిన వీధులు కనువిందు చేస్తున్నాయి..

**రేపే మలిరోజు - దుర్గమ్మ జాతర ఘనంగా..**

బుధవారం ఆలయాన్ని కనుల పండువగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గురువారం పోచమ్మ జాతరలో నైవేద్యాలతో అమ్మవారిని కొలిచి కుటుంబ శ్రేయస్సు కోసం భక్తులు ప్రార్థించనున్నారు..

**అసలు సిసలు ఆకర్షణ శుక్రవారమే!..**

దుర్గమ్మ బోనాల మహోత్సవం అత్యంత అంగరంగ వైభవంగా జరగనుంది.మహిళలు తలపై బోనాలు మోస్తూ,తొట్టెల ఊరేగింపులు,పోతురాజుల చిందులు,శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి చేరుకోనున్న దృశ్యం చూసేందుకు రెండు కళ్లు చాలవు! నాలుగు రోజుల ఈ మహా సంబరాలకు పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనం తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో పాలుపంచుకుని అమ్మవారి దివ్య ఆశీస్సులు అందుకోవాలని నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# సంప్రదాయ పంటల విధానాలను అనుసరించకుండా వర్షపాతం

## నేల పరిస్థితులు,నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలి-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు 04, (ప్రజా కలం)

ఎల్ నినో ప్రభావం మరియు నీటి కొరత నుంచి రైతులను రక్షించేందుకు పంటల వైవిధ్యీకరణను అవలంబించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపు నిచ్చారు. మంగళవారం రోజున జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత అధికారులతో మీటింగ్ నిర్వహించారు .ఎల్ నినో ప్రతికూల ప్రభావం, వర్షపాతం లోటు మరియు భూగర్భ జలాల మట్టాలు ఆందోళనకరంగా పడిపోతున్న నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా రైతులు పంటల వైవిధ్యీకరణను అవలంబించి, కరువును తట్టుకునే మరియు తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి విజ్ఞప్తి చేశారు.వాతావరణ మార్పుల కారణంగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువగా, అస్థిరంగా వర్షపాతం నమోదవుతోందని,దీంతో నేలలో తేమ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వ్యవసాయానికి నీటి లభ్యత తగ్గిపోయాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో అధిక నీరు అవసరమయ్యే పంటలను నిరంతరం సాగు చేయడం వల్ల భూగర్భ జల వనరులపై తీవ్రమైన ఒత్తిడి పెరగడంతో పాటు పంటలు విఫలమయ్యే ప్రమాదం కూడా అధి కమవుతోందని పేర్కొన్నారు. వ్యవసాయం భవిష్యత్తు ప్రతి నీటి బొట్టును సంరక్షించడంపైనే ఆధారపడి ఉంది.సంప్రదాయ పంటల విధానా లను అనుసరించకుండా,వర్షపాతం, నేల పరిస్థితులు,నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలి. శాస్త్రీయ పంట ప్రణాళికే ప్రస్తుత అవసరం అని యాదాద్రి జిల్లా కలెక్టర్ అన్నారు.రైతులు క్రమంగా వాతావరణ మార్పులను తట్టుకునే, కరువు నిరోధక పంటల వైపు మళ్లాలని సూచించారు. అందులో పప్పుధాన్యాలు: కందులు (రెడ్ గ్రామ్), పెసలు (గ్రీన్ గ్రామ్), మినుములు (బ్లాక్ గ్రామ్), శనగలు (బెంగాల్ గ్రామ్), ఉలవలు (హార్స్ గ్రామ్), అలసందలు (కౌపీ), చిరుధాన్యాలు జొన్నలు అయిన సజ్జలు, కొర్రలు, సాములు, రాగులు, నూనెగింజల పంటలు అయిన నువ్వు లు, ఆముదం, పొద్దుతిరుగుడు,వేరుశెనగ (తగిన తేమ ఉన్న ప్రాంతాల్లో). వర్షాధార వాణిజ్య పంటలు శాస్త్రీయ నిర్వహణతో అనుకూల ప్రాంతాల్లో పత్తి,ఉద్యాన పంటలు డ్రిప్ సాగుతో ఆయిల్ పామ్, మునగ, జామ,సీతాఫలం,రేగు,ఉసిరి ఈ పంటలకు గణనీయంగా తక్కువ నీరు అవసరమవు తుందని,తక్కువ తేమ పరిస్థితుల్లో కూడా మెరుగ్గా పెరుగుతాయని, నేల సారాన్ని మెరుగుపరుస్తాయని, సాగు వ్యయాన్ని తగ్గిస్తాయని, తక్కువ వర్షపాతం ఉన్న సంవత్సరాల్లో కూడా స్థిరమైన ఆదాయాన్ని అందిస్తాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. చిరుధాన్యాలు మరియు పప్పుధాన్యాల ప్రోత్సాహం పోషకాహార భద్రతను, వాతావరణ అనుకూలతను కూడా బలోపేతం చేస్తుందని తెలిపారు. వ్యవసాయ,ఉద్యానవన, రెవెన్యూ, భూగర్భ జలాలు, గ్రామీణాభివృద్ధి శాఖలకు రైతు వేదికలు, రైతు సమావేశాలు, క్షేత్ర ప్రదర్శనల ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పరిపాలన ఆదేశించింది. స్థానిక వ్యవసాయ-వాతావరణ పరిస్థితులు మరియు అందుబాటులో ఉన్న నీటి వనరులను ఆధారంగా చేసుకుని రైతులకు అనువైన పంటల ఎంపికపై మార్గనిర్దేశం చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచించింది. డ్రిప్ సాగు, స్ప్రింక్లర్ సాగు, వర్షపు నీటి సంరక్షణ, వ్యవసాయ చెరువులు, మల్చింగ్, నేల తేమ సంరక్షణ వంటి నీటి సంరక్షణ చర్యలను రైతులు అవలంబించాలని, తద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి భూగర్భ జల వనరులను కాపాడాలని జిల్లా కలెక్టర్ కోరారు.శాస్త్రీయ సలహాలు, మెరుగైన పంట ప్రణాళిక, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించే ప్రభుత్వ



పథకాల సమర్థవంతమైన అమలు ద్వారా రైతులకు సాధ్యమైన అన్ని సాంకేతిక సహాయాన్ని అందించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని తెలిపారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో దీర్ఘకాలిక వ్యవసాయ స్థిరత్వం మరియు రైతుల జీవనోపాధి మెరుగుదల కోసం భూగర్భ జల వనరుల సంరక్షణ, వాతావరణ అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సంస్థలు మరియు అన్ని భాగస్వాములు కలిసి పనిచేయాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



## కామ్రేడ్ సంతోష్ మరణం దురదృష్టం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సిపిఐ గుబురుగుట్ట శాఖ సహాయ కార్యదర్శి యువజన నాయకుడు అనారోగ్యంతో మృతి చెందిన కామ్రేడ్ సంతోష్ మృతదేహానికి పూలమాలలు వేసి సిపిఐ నాయకులు నివాళులు అర్పించారు. పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేసి పార్టీ విధేయుడిగా పని చేసిన ఒక యువకుడ్ని కోల్పోవడం పార్టీకి తీరని నష్టమని సిపిఐ నాయకులన్నారు. వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తున్నామని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వారి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.
ఈకార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యేసు రత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శిలు రాములు, హరినాథ్ రావు, ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షులు బాబు, శాఖ కార్యదర్శులు కొండయ్య, వెంకటేష్, సిపిఐ నాయకులు ఇమామ్, యాదగిరి, వెంకటేష్, అరవింద్, శ్రీకాంత్, జంబు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది: రావుల

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని



భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ కైసర్ నగర్ షణ్ముఖ పీఠం సుబ్రమణ్య స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో స్వయంగా భక్తులందరికీ ఆయన వడ్డించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి నిరంతరం ఉంటుందన్నారు. ప్రజలు భక్తితో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవి పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

### - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు షాపూర్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈసందర్భంగా కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన వినతిపత్రాలను ఆయనకు అందజేశారు. పలువురు తమ కుటుంబ శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందించి, కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ప్రజలు వివరించిన సమస్యలను మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్ అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. అత్యవసరమైన కొన్ని సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోగా, మిగిలిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం నా బాధ్యత. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం" అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ డాక్టర్లకు తాప్ర కమిటి ఘన సన్మానం..

హైద్రాబాద్ ఆగస్టు 4(ప్రజాకలం న్యూస్) తెలంగాణ రాష్ట్ర తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిజిహెచ్ఎస్ ఉప్పల్ వెల్నెస్ సెంటర్లో సోమవారం తాప్ర కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో గవర్నమెంట్ హెల్త్ సర్వీస్ వెల్నెస్ సెంటర్ లో చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఏ.సుభాష్ భూషణ్ ఆధ్వర్యంలో డాక్టర్ చేతన్ రెడ్డి,డాక్టర్ కిరణ్,డాక్టర్ కిరణ్ అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ కమిటి అధ్యక్షులు బి.నరహరి, సెక్రటరీ బి.చార్లెస్, ట్రెజరర్ ఆర్.సుధాకర్ ఆధ్వర్యంలో డాక్టర్లను మర్యాదపూర్వకంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## సర్పంచ్ నవీన్ కు విరాళం అందజేసిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు



మహేశ్వరం, ఆగస్టు 04,(ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రం లోని ఉన్న చారిత్రాత్మక గడికోట మైసమ్మ అమ్మవారి దేవాలయం పునర్ నిర్మాణం కొరకు గ్రామంలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ప్రతి ఇంటి నుండి రూ. 1,000 చొప్పున విరాళాలు సేకరించి మొత్తం రూ. 20,555/- రూపాయలను గడికోట మైసమ్మ ఆలయ అమ్మవారి పునర్ ప్రతిష్ట నిర్మాణానికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం తరపున గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ కి విరాళాలు అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సేవ సంఘం సభ్యుల సేవాభావాన్ని అభినందిస్తూ, ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు, గ్రామ ప్రజల సహకారంతో గడికోట మైసమ్మ ఆలయ పునర్ నిర్మాణం పూర్తి చేసి, భక్తులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రతి ఒక్కరిపై ఉండాలని తెలియజేశారు, ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవ సంఘం పెద్దలు మాట్లాడుతూ, గ్రామ ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రతీకగా నిలిచే గడికోట మైసమ్మ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, నాయి బ్రాహ్మణ సేవ సంఘం కుల పెద్ద దూసకంటి సత్తయ్య, అధ్యక్షులు దూసకంటి మైసమ్మ రాజు, ఉపాధ్యక్షుడు దూసకంటి మహేష్, ప్రధాన కార్యదర్శి దూసకంటి శంకర్, డి.మహేందర్, డి.ప్రభాకర్, డి. బాలేష్, జే.శివ, డి.సాయినాథ్, డి. పరమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ జిల్లా విస్తరణ అక్రమం: టీసీఏ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజా కలం ప్రతినిధి)

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తాజాగా ప్రకటించిన జిల్లా విస్తరణ కార్యక్రమం అక్రమమని, బీసీసీఐ రాజ్యాంగానికి విరుద్ధమని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ధ్వజమెత్తింది.బాంబే హైకోర్టు,బీసీసీఐ ఆదేశాలను పక్కనబెట్టి ఏకపక్షంగా ఏర్పాటు చేసిన జిల్లా కమిటీలను తక్షణమే నిలిపివేయాలని టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరమ్ గుర్వా రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగిల్ మెంబర్ కమిటీ (రావీజ) చైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) పి. నవీన్ రావు పర్యవేక్షణలో, హెచ్‌సీఏ కార్యదర్శి ఎం. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో సాగుతున్న ఈ ప్రక్రియ గ్రామీణ క్రికెట్‌పై జరుగుతున్న దాడి అని ఆరోపించారు. ఆరోపణలు, ప్రయోజనాల



సంఘర్షణ ఉన్న వ్యక్తులకు కొత్త కమిటీల్లో చోటు కల్పించారని, ప్రైవేట్ అకాడమీల పేరుతో పే-టు-ప్లే సంస్కృతిని ప్రోత్సహిస్తూ జిల్లా క్రికెట్‌ను వాణిజ్యపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ౧+20 లీగ్‌లోనూ 60 శాతం మంది బయటి రాష్ట్రాల ఆటగాళ్లే ఉన్నారని, స్థానిక ప్రతిభకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న అంశాలు తేలే వరకు ఈ విస్తరణను ఆపాలని, తెలంగాణ యువ క్రికెటర్ల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## గౌడ సంఘం బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్.



సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 04(ప్రజా కలం): సంగారెడ్డి లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఆషాఢ బోనాల ఊరేగింపు కార్యక్రమం లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బోనాలు సమర్పించిన మహిళలకు, భక్తులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల వేషధారణలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

గౌడ సంఘం ప్రతి నిధులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనం గా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడు తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకో వడం ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ,నరేందర్ గౌడ్, చింత సాయినాథ్, భరత్ గౌడ్, కిరణ్ గౌడ్ , సంకీర్త్ గౌడ్ , శ్రీకాంత్ గౌడ్ , దుర్గ గౌడ్ , సంగమేశ్వర్ గౌడ్ , కౌన్సిలర్ నాని, జీవీ శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, విఠల్, గోవర్ధన్ రెడ్డి, ప్రభు గౌడ్, గౌడ సంఘం నాయకులు, మహిళలు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు అవగాహన.

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 04.

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ రేణుక రాజాగౌడ్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారీ చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా గ్రామ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మురుగు కాలువలు, వీధులు, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పాఠశాల, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవడం, కాచి చల్లార్చిన లేదా శుభ్రమైన నీటిని తాగడం, ఆహార పరిశుభ్రతపై శ్రద్ధ వహించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వివరించారు. జ్వరం, దగ్గు, వాంతులు లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, దోమల నివారణ చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం ద్వారా సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని సర్పంచ్ రేణుక రాజాగౌడ్ తెలిపారు.



భారీ వర్షాల నేపథ్యంలో.....

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 ప్రజా కలం : కామారెడ్డి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రలు కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, వాగులు, రహదారులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితిని వారు అంతకు ముందు సమగ్రంగా పరిశీలించారు. చెరువులు, వాగులు, కాలువల వద్దకు ఎవరూ వెళ్లొద్దని, యువత, పిల్లలు సెల్ఫీలు, ఈత వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షించి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని సూచించారు. కామారెడ్డి పెద్ద చెరువు పూర్తిగా నిండి పొంగుతున్నందున, చెరువు పరివాహక ప్రాంతాలు, జీఆర్ కాలనీ, సమీప వార్డుల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువు కట్టలు, వంతెనలు, కల్వర్టులు, పాత భవనాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని అధికారులను ఆదేశించారు. లింగంపేట మండలం లింగంపల్లి వద్ద దెబ్బతిన్న కేకే వై రహదారి పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని, ఆ మార్గంలో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 171 ఇళ్లు దెబ్బతిన్నాయని, వాటిలో 167 పాక్షికంగా, 4 పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. 4 చెరువులు, 32 రహదారులు కూడా దెబ్బతిన్నట్లు అధికారులు నివేదించారు. నష్టపరిహారం, పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై. గిరి, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని జగిత్యాలలో 100వ శాఖను ప్రారంభించిన సారథి ఫైనాన్స్



ముంబై, ఆగస్టు 4 (ప్రజా కలం ప్రతినిధి)

ఎంఎస్ఎంఈ రంగంపై దృష్టి సారించిన ఎన్‌బీఎఫ్‌సీ సారథి ఫైనాన్స్ నేడు తెలంగాణలోని జగిత్యాలలో తన 100వ శాఖను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ కొత్త శాఖతో ఉత్తర తెలంగాణలో సంస్థ తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, ఆ ప్రాంతంలోని ఎంఎస్ఎంఈలు, పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపార యజమానులకు సకాలంలో, వినియోగదారుల అవసరాలకు అనుగుణమైన ఆర్థిక పరిష్కారాలను మరింత సమర్థవంతంగా అందించనుంది. 2025 ఏప్రిల్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన సారథి ఫైనాన్స్, కేవలం 2026 ఆగస్టు 3 నాటికే 100 శాఖల మైలురాయిని చేరుకోవడం ద్వారా తన వేగవంతమైన వృద్ధిని, అలాగే ఆర్థిక సమ్మిళిత విస్తరణకు ఉన్న నిబద్ధతను చాటుకుంది. ఎంఎస్ఎంఈలపై దృష్టి సారించిన ఈ ఎన్‌బీఎఫ్‌సీ, రూ.5 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు లోన్ అగెనెస్ట్ ప్రాపర్టీ (ఎల్.ఎ.పి.) రుణాలను అందిస్తోంది. దీని ద్వారా చిన్న వ్యాపారాలు, పారిశ్రామికవేత్తలు తమ ఆస్తుల విలువను సమర్థంగా వినియోగించుకొని వ్యాపార విస్తరణకు, వర్కింగ్ క్యాపిటల్‌ను పెంపొందించుకోవడానికి, అలాగే తమ వ్యాపార లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని పొందగలుగుతున్నారు.

హైదరాబాద్‌కు ఉత్తర దిశలో సుమారు 190 కిలోమీటర్ల దూరంలో ఉన్న జగిత్యాల, వ్యవసాయంతో పాటు వాణిజ్యపరంగానూ కీలక కేంద్రంగా ఉంది. ఈ ప్రాంతంలో ఎంఎస్ఎంఈల ఉనికి కూడా గణనీయంగా ఉంది. గత ఏడాది కాలంలో సారథి ఫైనాన్స్ తెలంగాణవ్యాప్తంగా 20 శాఖలను ప్రారంభించింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తన కార్యకలాపాలను విస్తరించి, తన సేవల పరిధిని మరింత బలోపేతం చేసుకుంది.

సారథి ఫైనాన్స్ ఇప్పటికే రూ.650 కోట్లకు పైగా నిర్వహణలోని ఆస్తులు (ఎ.యు.ఎం.) సాధించింది. ఇది సంస్థపై వినియోగదారులు ఉంచిన విశ్వాసాన్ని, అలాగే సంస్థ బలమైన వృద్ధి ప్రస్థానాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రస్తుతం సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో తన కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తోంది. అలాగే, దేశవ్యాప్తంగా అధిక అవకాశాలు ఉన్న ఎంఎస్ఎంఈ మార్కెట్లలో తన ఉనికిని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. విస్తరిస్తున్న శాఖల నెట్‌వర్క్, వినియోగదారుల అవసరాలకు ప్రాధాన్యమిచ్చే సేవా విధానం ద్వారా, సారథి ఫైనాన్స్ దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపార యజమానులు అధికారిక రుణ సౌకర్యాలను సులభంగా పొందేలా చేయడంతో పాటు, వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సంస్థ 100వ శాఖ ప్రారంభం సందర్భంగా సారథి ఫైనాన్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ వివేక్ బన్సల్ మాట్లాడుతూ, “100 శాఖల మైలురాయిని చేరుకోవడం, రూ.650 కోట్లకు పైగా నిర్వహణలోని ఆస్తులు (ఎ.యు.ఎం.) సాధించడం మా వ్యాపార నమూనా బలాన్ని, అలాగే దానిని సమర్థవంతంగా అమలు చేసిన మా సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. మా విస్తరణ కొనసాగుతున్నప్పటికీ, స్థిరమైన వృద్ధి, వివేకవంతమైన రిస్క్ నిర్వహణ, సాంకేతికత ఆధారిత రుణ సేవల వ్యవస్థను నిర్మించడం పైనే మా ప్రధాన దృష్టి కొనసాగుతుంది. ఈ విధంగా మా వినియోగదారులు, భాగస్వాములు, పెట్టుబడిదారులు సహా అన్ని వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించడమే మా లక్ష్యం” అని అన్నారు.

సారథి ఫైనాన్స్ స్వతంత్ర డైరెక్టర్ శశి శేఖర్ వెంపటి మాట్లాడుతూ, “కేవలం ఏడాదికి కొద్దిగా మించిన వ్యవధిలోనే సారథి ఫైనాన్స్ 100వ శాఖను ప్రారంభించడం, ఆర్థిక సమ్మిళిత ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతికత, పటిష్ఠమైన కార్పొరేట్ పాలన, వినియోగదారుల అవసరాలకు ప్రాధాన్యమిచ్చే విధానాన్ని సమన్వయం చేయాలన్న సంస్థ దూరదృష్టికి నిదర్శనం. భారతదేశం డిజిటల్ పరివర్తన దిశగా వేగంగా ముందుకు సాగుతున్న ఈ సమయంలో, ఎంఎస్ఎంఈలకు బాధ్యతాయుతంగా రుణ సౌకర్యాలను విస్తరించే సంస్థలు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, నవకల్పనలకు ఊతమివ్వడం, అలాగే దేశం యొక్క సుస్థిర ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి” అని అన్నారు.

ఈ సందర్భంగా టీవీఎస్ క్యాపిటల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ శ్రీనివాసన్ మాట్లాడుతూ, “కేవలం ఏడాదికి కొద్దిగా మించిన కాలంలోనే 100 శాఖలను ప్రారంభించడం సారథి ఫైనాన్స్ నాయకత్వం, బృందం సామర్థ్యానికి నిదర్శనం. ఇంత పెద్ద స్థాయిలో వేగం మరియు క్రమశిక్షణ రెండింటినీ ఒకేసారి కొనసాగించడం చాలా అరుదు. అయితే, సారథి ఈ రెండింటినీ విజయవంతంగా సాధించింది. ఏడాదికి కొద్దిగా మించిన చరిత్ర కలిగిన సంస్థకు ఇది ఎంతో విశేషమైన ఘనత. సంస్థను ముందుకు నడిపిస్తున్న బృందం ప్రతిభ, సామర్థ్యాన్ని ఇది స్పష్టంగా తెలియజేస్తోంది. టీవీఎస్ క్యాపిటల్లో మేము అత్యున్నత లక్ష్యాలతో పాటు క్రమబద్ధమైన అమలు సామర్థ్యం కలిగిన వ్యవస్థాపకులకు మద్దతు ఇస్తాము. సారథి ఫైనాన్స్ తన ఆవిర్భావం నుంచే ఈ రెండు లక్షణాలను చక్కగా ప్రదర్శించింది. ఈ విజయయాత్రలో భాగస్వాములుగా ఉండటం మాకు గర్వకారణం. సంస్థ మొత్తం బృందం ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము” అని అన్నారు.

# 36 దేశాల నుంచి 274 మంది పరారీ నేరస్థుల అప్పగింత

## 2021-26 మధ్య కేంద్రం విజయవంతమైన చర్యలు

## మోదీ నాయకత్వంలో మిషన్ మోడ్‌లో ఆపరేషన్





న్యూఢిల్లీ, ఆగస్టు 4 (పీఐబీ): విదేశాలకు పారిపోయిన నేరస్థులను స్వదేశానికి రప్పించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో 2021 నుంచి 2026 మధ్యకాలంలో 36 దేశాల నుంచి మొత్తం 274 మంది పరారీ నేరస్థులను భారత్‌కు తీసుకువచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పరారీ నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం, వారికి చట్టప్రకారం శిక్ష పడేలా చూడడం లక్ష్యంగా 2018లో పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. అనంతరం నేరస్థులను స్వదేశానికి రప్పించే ప్రక్రియను వేగవంతం చేసేందుకు సాంకేతికత, ఇంటెలిజెన్స్ ఆధారిత సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. కేంద్రం వివరాల ప్రకారం.. 2014కు ముందు అప్పగింత వ్యవస్థ బలహీనంగా ఉండేది. అప్పట్లో భారత్‌కు కేవలం 37 దేశాలతో మాత్రమే అప్పగింత ఒప్పందాలు ఉండగా, 2004-2013 మధ్య ఏడాదికి సగటున నలుగురు నేరస్థులను మాత్రమే స్వదేశానికి రప్పించగలిగారు. అలాగే 110 అప్పగింత విజ్ఞప్తులు పెండింగ్‌లో ఉండేవని వెల్లడించింది. అసంపూర్ణ పత్రాలు, నెమ్మదైన ప్రక్రియ, న్యాయపరమైన అడ్డంకులు, విభాగాల మధ్య సమన్వయ లోపం వల్ల అనేక కేసుల్లో విదేశీ కోర్టులు భారత విజ్ఞప్తులను తిరస్కరించేవని పేర్కొంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం పరారీ నేరస్థుల అప్పగింతను జాతీయ ప్రాధాన్య అంశంగా తీసుకుందని తెలిపింది. ప్రపంచవ్యాప్త ఆపరేషన్లు, బలమైన అంతర్‌శాఖ సమన్వయం, చురుకైన దౌత్యం అనే మూడు సూత్రాల ఆధారంగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. పరారీ నేరస్థుల అంశం దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థిరత్వం, శాంతిభద్రతలు, జాతీయ భద్రతతో ముడిపడి ఉందని హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నట్లు తెలిపింది. 2019లో తీసుకొచ్చిన ఎన్ఐఏ (సవరణ), యూఏపీఏ (సవరణ) చట్టాలతో విదేశాల్లో తలదాచుకున్న ఉగ్రవాదులు, వారి సహాయక వ్యవస్థలు, నిధుల సమీకరణ నెట్‌వర్క్‌లపై చర్యలు మరింత కఠినతరం చేసినట్లు కేంద్రం వెల్లడించింది. 2020 నుంచి పరారీ నేరస్థులను భారత్‌కు రప్పించే ప్రక్రియను మిషన్ మోడ్‌లో అమలు చేస్తున్నట్లు తెలిపింది. అలాగే 2024లో అమల్లోకి వచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాల్లో భాగంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్లు 355, 356 ద్వారా నిందితుడు కోర్టుకు హాజరుకాకపోయినా విచారణ నిర్వహించే అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొంది. దీంతో పరారీలో ఉన్న నిందితులపై విచారణ నుంచి శిక్ష ఖరారు వరకు న్యాయ ప్రక్రియను పూర్తి చేసే వీలు కలుగుతుందని వివరించింది.

# దుండిగల్ హై స్కూల్‌ను సందర్శించిన మాజీ సర్పంచ్ కావలి గణేష్



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 296 డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామంలోని హై స్కూల్ ప్రాంగణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించేందుకు దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో నిలిచిన నీటిని పరిశీలించి, సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాల ప్రాంగణాన్ని త్వరితగతిన శుభ్రపరచి, నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ZPHS (HM) ముత్యం గౌడ్, వాపుల శ్రీనివాస్, మంగలి కుమార్, మేకల మోహన్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎంసి పరిధిలోని డివిజన్లకు కాంగ్రెస్ మైనార్టీ సెల్ నూతన అధ్యక్షులు

## నియామక పత్రాలను అందజేసిన జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,ఎం.డి. ఖాజా మొయినుద్దీన్

మేడిపల్లి ఆగస్టు 4(ప్రజాకలం న్యూస్)

మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.డి. ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ల మైనారిటీ సెల్ అధ్యక్షులకు మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏ బ్లాక్ మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ రహ్మత్ అలీ, బీ బ్లాక్ అధ్యక్షులు షేక్ అక్బర్, చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ యకూబ్, ఎల్లంపేట్ డివిజన్ రాజబొల్లారం అధ్యక్షులు పాషా, శామీర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ అజీముద్దీన్, పీర్జాదిగూడ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ కరీం, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ అజ్గర్, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షులు షేక్ సల్మాన్ ఖాన్, నాగారం డివిజన్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు షేక్ మహబూబ్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ అమీర్ ఖాన్, మూడుచింతలపల్లి డివిజన్ అధ్యక్షులు యూసుఫ్, పుడూర్--కిష్టాపూర్ డివిజన్ అధ్యక్షులు ముక్తర్, కీసర డివిజన్ అధ్యక్షులు అన్వర్ పాషాలకు నియామక పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు ముజీబ్ ఉద్దీన్,బోడుప్పల్ మాజీ అధ్యక్షులు పోగుల నరసింహ రెడ్డి,చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు దిలీప్ రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ యుసుఫ్ బాబా, ఘట్కేసర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పీర్జాదిగూడ నాయకులు మహమ్మద్ మజర్, యూత్ కాంగ్రెస్ నాయకులు అజ్జు, మొహమ్మద్ తాజుద్దీన్, అబ్దుల్ ఖాదర్, మొహమ్మద్ సమీ తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ యాకూబ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.డి. ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ యుసుఫ్ బాబా పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ చెంగిచర్ల డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, యువతను కాంగ్రెస్ పార్టీలోకి ఆకర్షించేందుకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు నూతనంగా నియమితులైన మైనారిటీ సెల్ అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# 30 నెలల నో-కాస్ట్ ఈఎంఐతో శాంసంగ్ ఫోల్డబుల్స్

## నెలకు రూ.4,167 నుంచే గెలాక్సీ ఫ్లిప్ 8





గురుగ్రామ్, ఆగస్టు 4 (ప్రజా కలం ప్రతినిధి)

ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లను మరింత మందికి అందుబాటులోకి తీసుకురావడానికి శాంసంగ్ 30 నెలల నో-కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని ప్రకటించింది. కొత్తగా విడుదల చేసిన గెలాక్సీ ఫోల్డ్ 8 అల్ట్రా, గెలాక్సీ ఫోల్డ్ 8, గెలాక్సీ ఫ్లిప్ 8 మోడళ్లపై ఈ ఆఫర్ వర్తించనుంది. జీరో డౌన్‌పేమెంట్‌తో ప్రీమియం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకు లభించనుంది. ఈ పథకం కింద గెలాక్సీ ఫోల్డ్ 8 అల్ట్రా (256 జీబీ) నెలకు రూ.6,667 ఈఎంఐతో, గెలాక్సీ ఫోల్డ్ 8 రూ.6,000 ఈఎంఐతో, గెలాక్సీ ఫ్లిప్ 8 నెలకు రూ.4,167 ఈఎంఐతో సొంతం చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. గెలాక్సీ ఫోల్డ్ 8 అల్ట్రాపై నెలవారీ ఈఎంఐ గత తరం గెలాక్సీ ఫోల్డ్ 7తో పోలిస్తే సుమారు 9 శాతం తగ్గిందని పేర్కొంది.

ఈ ఫైనాన్స్ సదుపాయం శాంసంగ్ ఫైనాన్స్ం (డీఎంఐ ఫైనాన్స్), టీవీఎస్ క్రెడిట్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, పూనావాలా ఫిన్‌కార్ప్ ద్వారా అందుబాటులో ఉంటుంది. 30 నెలల చెల్లింపు గడువుతో వినియోగదారులపై నెలవారీ ఆర్థిక భారం తగ్గుతుందని సంస్థ తెలిపింది.

ధరలు : గెలాక్సీ ఫోల్డ్ 8 అల్ట్రా (256 జీబీ): రూ.1,99,999 నుంచిగెలాక్సీ ఫోల్డ్ 8 (256 జీబీ): రూ.1,79,999 నుంచి గెలాక్సీ ఫ్లిప్ 8 (256 జీబీ): రూ.1,24,999 నుంచి

ఈ మోడళ్లు వివిధ రంగుల్లో అందుబాటులో ఉండగా, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో ప్రీ-ఆర్డర్లు ప్రారంభమయ్యాయి. Samsung.com, శాంసంగ్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్లు, ఎంపిక చేసిన రిటైల్ అవుట్‌లెట్లలో 30 నెలల నో-కాస్ట్ ఈఎంఐ ఆఫర్ అందుబాటులో ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

# సీఎంఆర్ అవకతవకల కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

## నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 04:

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) రైస్ మిల్లులలో చోటుచేసుకున్న అవకతవకలపై నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పోలీస్, సివిల్ సప్లై శాఖల అధికారులతో




కలిసి కేసుల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నమోదైన కేసుల ప్రస్తుత దర్యాప్తు స్థితి, స్వాధీనం చేసుకున్న ధాన్యం, బియ్యం నిల్వలు, సంబంధిత అధికారుల పరిశీలన నివేదికలు, మరియు నిందితులపై చేపడుతున్న చట్టపరమైన చర్యలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ.. సీఎంఆర్ ధాన్యం, బియ్యం నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి అవకతవకలు పునరావృతం కాకుండా ఉండేందుకు రైస్ మిల్లులలో నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజా ప్రయోజనాలను పరిరక్షించేందుకు సివిల్ సప్లై, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. హాజరైన అధికారులుఈ సమీక్షా సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం. శ్రీకాంత్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ అరవింద్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే రైస్ మిల్ అసిస్టెంట్ ప్రెసిడెంట్ దయానంద్ గుప్తా, రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ కార్యదర్శి వడ్డీ మోహన్ రెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# రేషన్ పంపిణీ సజావుగా సాగాలి

## : అదనపు కలెక్టర్ భుజంగరావు

### - ఈ నెల 15లోపు రేషన్ ఈ-కేవైసీ పూర్తి చేయండి: డీలర్లకు ఆదేశం

### - మూడు నెలల రేషన్ కోటా పంపిణీపై అదనపు కలెక్టర్ కీలక సమీక్ష

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 04 :

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్ షాపుల) ద్వారా ఆగస్టు,సెప్టెంబర్, అక్టోబర్ మూడు మాసాలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతోందని అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. చౌక ధరల దుకాణ డీలర్లు మూడు మసాల కోటాను దిగుమతి చేసుకుని వినియోగదారులకు సకాలంలో సన్న బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఆయా మండలాల రేషన్ డీలర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ,ఈ నెల (ఆగస్టు) 31వ తేదీ లోపు రేషన్ పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.



బియ్యం పంపిణీలో అవకతవకలు, అలసత్వానికి తావిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.వానాకాలం సీజన్‌లో సంభవించే వర్షాలు,వరదలు, నిల్వ సమస్యలు తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.డీలర్లు సమయపాలన పాటిస్తూ, నిర్ణీత గడువు లోపు పంపిణీని పూర్తి చేయాలని,స్టాక్ బోర్డు తప్పక ప్రదర్శించాలని, బియ్యం తూకంలో తేడా ఉండకూడదని సూచించారు. వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అనుచితంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.స్టాక్ నిల్వలు, వాటి వివరాలతో కూడిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం నిల్వలు చేరుకునేలా, కార్డు హోల్డర్లకు వారి కోటా మేరకు ఏకకాలంలో మూడు నెలల పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకులు సక్రమంగా తరలించేలా, బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.ఈ-పాస్ యంత్రాలలో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు.

కాగా,రేషన్ కోటా కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేసుకునేలా రేషన్ డీలర్లు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. జూలై 31 నాటితో పూర్తయిన గడువును ప్రభుత్వం ఆగస్టు 31 వరకు పొడిగించిందని అన్నారు.

ఈ వెసులుబాటును వినియోగించుకుని రేషన్ పొందుతున్న ప్రతి ఒక్కరూ చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గడువు లోపు ఈ-కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కోటా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని ప్రతి సభ్యుడు ఆగస్టు 15వ తేదీ లోపే తప్పక ఈ-కేవైసీ చేసుకునేలా, తద్వారా అర్హులైన వారు రేషన్ కోటా కోల్పోకుండా రేషన్ డీలర్లు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి,ఏ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి,డీ.టీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు



కామారెడ్డి ఆగస్టు 4 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ దంపతులు మాజీ ఏఎంసీ చైర్పర్సన్ ప్రతాప్ రెడ్డి దంపతులతో కలిసి మంగళవారం తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడు తూ ఎల్లారెడ్డి నియోజక వర్గ ప్రజలం దరూ ఆయురా రోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండా లని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని శ్రీవారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు.

# యుద్ధ ప్రతిపాదికన తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

### - లింగంపల్లి తాత్కాలిక వంతెన పునరుద్ధరణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామం వద్ద వరదల కారణంగా దెబ్బతిన్న తాత్కాలిక వంతెన పునరుద్ధరణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని ఆయన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంతెన పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకూడదని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బలమైన నిర్మాణ ప్రమాణాలను పాటించాలని సూచించారు. వంతెన మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు గ్రామస్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, అవసరమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పోలీసు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఆకస్మిక వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేశ్ చంద్ర, ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ), సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మెండోరా లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఘోర వైఫల్యం

## : ముత్యాల సునీల్ కుమార్

### ఎమ్మెల్యేకు విమర్శలు తప్ప ప్రజా సమస్యలు పట్టవా?

### పనిచేసే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయడం సిగ్గుచేటు.

### మెండోరా మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ సముదాయాన్ని పరిశీలించిన కాంగ్రెస్ ఇంచార్జ్.



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 04: మెండోరా మండల కేంద్రంలో నిర్మిస్తున్న రెండు పడక గదుల (డబుల్ బెడ్‌రూమ్) ఇళ్ల సముదాయాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇళ్ల నిర్మాణ నాణ్యతను, అక్కడ ఉన్న మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్లు మంత్రిగా ఉండి ఏం చేశారు?2017 మే నెలలో ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని సునీల్ కుమార్ గుర్తు చేశారు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు రాష్ట్ర మంత్రిగా అత్యంత కీలక పదవిలో కొనసాగిన ప్రశాంత్ రెడ్డి, ఇప్పుడు ఈ ప్రభుత్వంలో మూడేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండి కూడా కనీసం ఈ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించలేక పోయారని మండిపడ్డారు.

నేటికీ ఈ ఇళ్ల సముదాయానికి కనీసం సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి కనీస వసతులు కూడా కల్పించకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తాను చేయుడు.. చేసేవారిని చేయనివ్వడు:ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఇంకా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని, ప్రభుత్వాన్ని విమర్శించే పని తప్ప ఆయనకు ప్రజా సమస్యలు పట్టడం లేదని సునీల్ కుమార్ విమర్శించారు. ప్రజలు ఓట్లేసి గెలిపించినందుకు బాధ్యతతో వ్యవహరించి, ప్రభుత్వ పెద్దలను కలిసి నియోజకవర్గ సమస్యలను పరిష్కరించుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, తాను బాధ్యతగా ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఎంఆర్ఓ (ఎమ్మార్వో) లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తే.. దానిపై ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. "ఆయన పనులు చేయడు.. చేసేవారిని చేయనివ్వడు" అంటూ తీవ్రంగా ఆక్షేపించారు. ప్రజల కోసం సహకారానికి సిద్ధం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి గనుక పిలిస్తే, ఎలాంటి భేషజాలు లేకుండా ప్రజా పనుల నిమిత్తం ఆయనకు పూర్తి సహకారం అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సునీల్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి బాల్కొండ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జెన్-జీ ఉద్యమం ద్వారా జై భీం విశ్వవ్యాపితం -బొడ్డు మురళీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)ఆగస్టు 04:

భారతదేశ విద్యార్థి యువకుల ఐతిహాసిక జెన్- జీ ఉద్యమం "జై భీం" నినాదాన్ని విశ్వవ్యాప్తం చేసింది. అంబేద్కర్ భావజాలం అమెరికా ఆస్ట్రేలియా యూరోప్ ప్రపంచ ఖండాల్లో నోట వినిపిస్తున్న తరుణంలో ఉన్నమని కష్టజీవుల



నాయకులు బొడ్డు మురళీ మాలజీ వెల్లడించారు. వీరు ముంబైలోని అంధేరీ సాకినాక వద్దగల అన్నచాల్ లో నివాసమై ఉన్నారు. కస్టకరి యువక సంఘటన క్రియాశీల నేత. ముంబై తెలంగాణ ఉద్యమకారుడు. మంచి విశ్లేషకుడు. ఆయన ఇకముందు మాట్లాడుతూ గత అనేక ఏళ్ళుగా మనువాదుల సంస్థఐన ఆర్.ఎస్.ఎస్ మతద్వేషం, శ్రామికుల మధ్య విద్వేషాలు, మతకల్లోలాల ద్వారా దేశ యువత మైండ్ ను నాశనం చేసిందన్నారు. పైగా వారి రాజకీయ పార్టీ సామాన్య ప్రజల ఏ ఒక సమస్యల్ని పరిష్కరించిన దాఖలాలు లేవు. ప్రభుత్వపు సంస్థలు అమ్మేయడం, ధరలు విపరీతంగా పెంచడం, నిరుద్యోగం, కార్మిక చట్టాల్ని ఖతం చేయడం, నిరసన గళం నొక్కెయ్యడం, అవినీతి, విద్య వైద్య రంగాన్ని దయనీయ స్థితికి దిగజారిన ఘనత వారికే దక్కిందన్నారు. పౌరుల ప్రతి ఉద్యమంపై రాజ్యహింస ప్రయోగించడం జనం కండ్లార చూస్తున్నారు. విటాన్నిటి పరిణామాలే నేటి జెన్-జీ యూత్ పోరాటమని బి.ఎల్ మాలజీ విశ్లేషించారు. ఈ మహత్తర ఉద్యమానికి తాము సంఘీభావం తెలుపుతున్నామన్నారు. అయితే ఇప్పటికైన పాలకులు పీడిత ప్రజల పక్షాన నిలబడి రాజ్యాంగ అనుసారంగా పని చేయాలని ఆయన హితబోధ చేశారు.

# అలుగు పారిన పోచారం ప్రాజెక్టు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 ప్రజాకలం : కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని మంగళవారం ఉదయం నుండి అలుగు పొరలడం ప్రారంభించింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మంచిప్ప, గాంధారి, లింగంపేట ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల లింగంపేట పెద్దవాగు ఉధృతంగా ప్రవహించి పోచారం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు కాగా నిలువ సామర్థ్యం 1.82 టిఎంసిలు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు చేరడంతో అదనపు వరద జలాలు అలుగుపై నుంచి కిందకు విడుదలవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురుస్తాయో లేదోనని అంచనాలు వేసిన నేపథ్యంలో ఈ ఏడాది కూడా భారీ వర్షాలతో ప్రాజెక్టు పూర్తి స్థాయికి చేరుకొని, ప్రాజెక్టు పరిధిలోని 20 వేల ఎకరాలకు సాగునీరు అందివ్వనుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డిఈ బి. కిష్టయ్య తెలిపారు.



# బ్రాహ్మణపల్లి రైతు వేదికలో... వరిలో ఎరువుల యాజమాన్యం పై శిక్షణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో మంగళవారం వరి పంటలో యాజమాన్యం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం మల్తుమ్మెద శాస్త్రవేత్త కో ఆర్డినేటర్ డా, జెకె, రేవంత్ నాథన్ మాట్లాడుతూ వరిలో యూరియాను మూడు లేదా నాలుగు దాఫాలుగా వాడుకోవాలని, అలాగే వరి పొలం పిలుక దశలో యూరియా ఒక దఫా, చిరు పొట్ట దశలో యూరియాతో పాటు పోటాష్ ఎరువులను కూడా తప్పనిసరిగా వాడుకోవాలని సూచించారు. పంట 20-25 రోజుల దశలో కాండం తొలుచు పురుగుల నివారణకు మొదటి దఫా ఎరువులతో పాటు వెంటనే క్లోరంత్ర నీలి ప్రోల్ 0.4+ ఎకరానికి 4 కేజీ వేసుకోవాలన్నారు. వరిలో కలుపు లేకుండా చూసుకోవాలని రైతులకు వివరించారు. రైతులు పోషక యాజమాన్యంలో సమికృత పద్ధతి పాటించాలని, కెమికల్ ఫర్టిలైజర్స్ మీద ఆధారపడటం తగ్గించి నేల యొక్క జీవం పెంచుకోవాలన్నారు. ఇఫ్కో ప్రతినిధి విష్ణు నానో యూరియా, నానో డియేపి ల ఉపయోగాలు, వాడే పద్ధతి గురించి వివరించారు. అనంతరం ఎల్లారెడ్డి



ఏవో శోభ మాట్లాడుతూ రైతులు నానో యూరియా, నానో డియేపి మీద ఒక డెమో చేపించాలని వివరించారు. తరువాత రైతులతో పాటువరి పొలం క్షేత్ర సందర్శన తోపాటు వరి పొలంలో గల సమస్యలను పరిశీలించి రైతులకు పలు సూచన సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓలు ముఖీద్, రాజా గౌడ్, రవీందర్ తో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో ఉచిత సిపిఆర్ అవగాహన కార్యక్రమం

మల్కాజిగిరి,ఆగస్టు4,(ప్రజా కలం ప్రతినిధి)

అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసస్సిటేషన్) అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని సెంజాన్ అంబులెన్స్ ఇండియా సీనియర్ ఫ్యాకల్టీ కలారి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సి పి ఆర్ విధానం గురించి చెబుతూ సీపీఆర్ ప్రతి పౌరుడు తప్పనిసరిగా




నేర్చుకోవాల్సిన ప్రాణరక్షక నైపుణ్యమని అన్నారు.ప్రమాదాలు, గుండెపోటు,శ్వాస సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చేలోపు బాధితుడికి సీపీఆర్ అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు.అనంతరం విద్యార్థుల సమక్షంలో సీపీఆర్ చేసే సరైన విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి,విద్యార్థులతో సాధన చేయించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యతో పాటు ఇలాంటి జీవన నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలని సూచించారు.సమాజ సేవలో నేటి యువత ముందుండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎడ్ల ప్రదీప్,డాక్టర్ హరిత, డాక్టర్ జి.ఎన్.జగన్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు,ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాజేశ్‌కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్,డాక్టర్ మల్లికతో పాటు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ

## అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, ఆగస్టు 04,(ప్రజా కలం)

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి వివిధ కాలనీల దేవాలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని, భక్తులతో కలిసి



ఊరేగింపులో నడిచారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తిభావానికి బోనాల పండుగ నిదర్శనం. అమ్మవారి కృషి కటాక్షాలతో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను.కాలనీల్లో ప్రజలు పండుగను ఇంతటి ఉత్సాహంతో,సోదరభావంతో జరుపుకోవడం సంతోషదాయకం. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఊరు, ప్రతి కాలనీ అభివృద్ధి చెందడమే మన అందరి లక్ష్యం అన్నారు.

ఈ కార్యక్రమంలో మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ ముదిరాజ్ , రాము యాదవ్ , రాఘవేందర్ యాదవ్ రాజేష్ యాదవ్ , కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను, ప్రవీణ్, మైసి రెడ్డి, వెంకటరమణ,సునీల్ మహేష్ , సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి,అఖిల్,నిఖిల్ నితిన్,చిరు, పవన్, అనిల్, చిన్న, కొన్ని, సోనం దీపు,గాంధీ,పవన్,చింటూ స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు , తదితరులు పాల్గొన్నారు..

# ఆగస్టు 6 సంకల్ప సభను విజయవంతం చేయండి..

## గజ్వేల్ నుంచి వెయ్యి మంది కార్యకర్తల తరలింపు:

## టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు: కొట్టాల యాదగిరి ముదిరాజ్



గజ్వేల్:04 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సామాజిక న్యాయం,బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన ఈ నెల 6న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న “సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ”ను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది,గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గజ్వేల్ నియోజకవర్గం నుంచి వెయ్యి మంది ముఖ్య కార్యకర్తలతో సభకు హాజరవుతున్నట్లు తెలిపారు.సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తితో టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించబడుతుందని, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని చెప్పారు.తెలంగాణ ఉద్యమం ఆశించిన సామాజిక న్యాయం ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని, వెనుకబడిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించడమే ఈ సంకల్ప సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం అమలుపై బలమైన సందేశాన్ని ఈ సభ ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆకాంక్షించిన సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం ఈ సభ ఒక కీలక వేదికగా నిలుస్తుందని, రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించాలనే డిమాండ్‌ను బలంగా వినిపిస్తామని యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎడ్ల నర్సింలు,శ్రీకాంత్,స్వామి, అమర్‌సింగ్,చందు,ప్రసాద్, కుమార్, వెంకటేష్,అశోక్, రాజేష్,కిషన్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్నమాసన్ పల్లిలో వరి పంటలో సల్ఫైడ్ ఇంజురీపై రైతులకు అవగాహన.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 04.

రాయపోల్ మండలంలోని చిన్నమాసనపల్లి గ్రామ పరిధిలో వరి పంటలో హైడ్రోజన్ సల్ఫైడ్ ఇంజురీ లక్షణాలు, నివారణ చర్యలపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించింది. వ్యవసాయ సహాయ సంచాలకులు బాబు నాయక్ ఆధ్వర్యంలో పంట పొలాన్ని సందర్శించి సమస్యను పరిశీలించి రైతులకు సూచనలు అందించారు.

అధిక రోజులు పొలంలో నీరు నిల్వ ఉండటం, సేంద్రియ పదార్థాలు కుళ్లిపోవడం, నేలలో ఆక్సిజన్ కొరత ఏర్పడడం వల్ల హైడ్రోజన్ సల్ఫైడ్ ఇంజురీ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమస్యతో వేర్లు నల్లగా మారడం, కొత్త వేర్లు రాకపోవడం, మొక్కల ఎదుగుదల మందగించడం, ఆకులు పసుపురంగులోకి మారి ఎండిపోవడం, పిలకలు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. నివారణలో భాగంగా పొలంలో నీటిని 3--5 రోజుల పాటు పూర్తిగా తొలగించి నేలకు గాలి తగిలేలా చేయాలని, అనంతరం 2--3 సెం.మీ. పలుచటి నీటి పొర మాత్రమే ఉంచాలని సూచించారు. సిఫార్సు మేరకు పొటాష్ ఎరువు వేయడంతో పాటు జింక్ లోపం ఉంటే జింక్ సల్ఫేట్‌ను 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే 19:19:19 ఎరువుతో పాటు ఫార్ములా--4ను ఎకరానికి 600--1000 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే సమస్యను నివారించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, చిన్నమాసనపల్లి సర్పంచ్ నర్సింహారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి మాధవి, రైతులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనం

## - ఆన్లైన్ గేమింగ్ కు చార్టెడ్ అకౌంటెంట్ బలి..



సంతోష్ (ఫైల్ ఫోటో )



హోటల్ గదిలో దొరికిన సూసైడ్ లెటర్

సిద్దిపేట రూరల్:04 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనం, అప్పుల భారంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ చార్టర్డ్ అకౌంటెంట్ మృతిచెందిన ఘటన సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హరితా హోటల్‌లో చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం, సిద్దిపేట పట్టణంలోని మంగమ్మతోటకు చెందిన గుడూరి సంతోష్ (33) చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు.ఆన్‌లైన్ గేమ్స్‌లో భారీగా నగదు కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ నేపథ్యంలో అప్పుల భారంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఈ నెల 1న సిద్దిపేట శివారులోని హరితా హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఘటన స్థలంలో లభించిన లేఖలో తన మరణానికి ఎవరూ బాధ్యులు కారని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బావ వినయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.సంఘటన స్థలాన్ని ఏసీపీ రవీందర్ రెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో ఆన్‌లైన్ గేమ్స్ కారణంగా ఏర్పడిన అప్పులు,ఆర్థిక ఒత్తిడే ఈ ఘటనకు దారితీసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# గుంతలమయమైన జాలిగామ బైపాస్ రోడ్డు

## నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

గజ్వేల్:04 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జాలిగామ గ్రామానికి వెళ్లే బైపాస్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారిపై గుంతల కారణంగా





తరచూ చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నట్లు తెలిపారు.గత వారంలోనే పత్రికల ద్వారా రోడ్డు దుస్థితిని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాలిగామ బైపాస్ రోడ్డుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టి, ప్రమాదాలను నివారించి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాలని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ప్రజలు, జాలిగామ గ్రామస్థులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు

# నీలోఫర్ లో కనీస సౌకర్యాలు కరువు..

## కుర్చీలో కూర్చోబెట్టి గర్భిణీలకు వైద్యం..

## మహిళా మంత్రులు స్పందించాలని డిమాండ్

## బాలింతకు కోసం పోరాడుతామన్న మనోజ

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజా కలం ప్రతినిధి)

నీలోఫర్ ఆసుపత్రిలో బాలింతలకు కనీస వైద్య సౌకర్యాలు అందడంలేదని తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్ తెలిపారు. ఆసుపత్రిలో వైద్యచికిత్స కోసం వచ్చిన గర్భిణీలకు కుర్చీలో కూర్చోబెట్టి వైద్య సేవలు అందించడం బాధాకరమన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిశీలించేందు మంగళవారం ఆసుపత్రికి చేరుకోగా.. సెక్యూరిటీ, ఆసుపత్రి సిబ్బంది అడ్డుకున్నారని తెలిపారు. సాటి మహిళగా ఇతర మహిళల సమస్యలను తెలుసుకునేందుకు వస్తే అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు.సెక్యూరిటీ ,ఆసుపత్రి సిబ్బంది తీరు పై ఆమె అసహనం వ్యక్తం చేశారు. వైద్యం కోసం వచ్చిన మహిళలను



ఒక్క బెడ్డును ముగ్గురు రోగులకు కేటాయిస్తున్నారని, ఆపరేషన్ అయిన బాలింతలను స్ట్రెచర్‌పై తీసుకెళ్లకుండా నడిపించుకుంటూ తీసుకెళ్లడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనల పై మహిళా మంత్రులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించాలని, లేదంటే ప్రత్యక్ష పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మెడలు వంచి బాలింతలకు సరైన వైద్య సదుపాయాలు అందేలా చూస్తామని మనోజ గౌడ్ హెచ్చరించారు.

# ఫోన్ కాల్ ద్వారా ఓటర్లను గుర్తించండి

**- షిఫ్టింగ్, డెత్, దొంగ ఓటర్ల పేర్లు నమోదు చేసుకోండి**

**- ఆగస్టు 10తో తెలంగాణలో ముగియనున్న సర్**

**-మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**

మహేశ్వరం, ఆగస్టు 04,(ప్రజా కలం)

ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అలసత్వంగా తీసుకోవద్దని మహేశ్వరం



నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. ఇంటింటికి చేరిన ఎన్యుమరేషన్ ఫారమ్స్ నింపి ఇచ్చారా.. లేదా.. షిఫ్టింగ్ ఓట్లు ఎన్ని. చనిపోయిన వారు, దొంగ ఓట్లను తొలగించారా లేదా అని ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని బి ఎల్ ఏ లను, ఇన్ఛార్జులను, కో-ఆర్డినేటర్స్ ను, బూత్ అధ్యక్షులను, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కొంత మంది ఓటర్ల అడ్రస్ లను వెతకటం బి ఎల్ ఓ లకు కష్టంగా మారినా పక్కింటి వారు, గ్రామస్తులు, కాలనీవాసులను అడిగి ఫోన్ ద్వారా సంప్రదించి ఎన్యుమరేషన్ ఫారమ్స్ నింపి ఇచ్చేలా అవగాహన కల్పించాలని కిచ్చెన్న అన్నారు.రెండు ఓట్లు, దొంగ ఓట్లు కలిగి ఉంటే జైలు తప్పదని లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఆగస్టు 10తో ముగియనున్న సర్ ప్రక్రియలో ఓటర్ల అందరూ పాల్గొని అప్ డేట్ చేయించుకోవాలని కె ఎల్ ఆర్ కోరారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

# తాగు,సాగు నీళ్లకు కాళేశ్వరమే శరణ్యం

మాజీ మంత్రి జీవన్ రెడ్డి

మంత్రులు కన్నెపల్లికి వెళ్లాలి, వాస్తవాలు తెలుసుకోవాలి

నీటి లభ్యత కోసమే మేడిగడ్డను ఎంచుకున్న కేసీఆర్

బాహుబలి మోటార్లతో మిడ్ మానేరుకు నీళ్లు

ఫుట్ బాల్ కోసం ఖర్చు కాదు, కాఫర్ డ్యామ్ కోసం




సిటీ బ్యూరో:ఆగస్టు4: ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తాగునీరు, రైతులకు సాగు నీరు అందించాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు శరణ్యమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాధారమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కక్షసాధింపు చర్యలు మానుకుని వెంటనే ప్రాజెక్టు మరమ్మత్తులు చేపట్టి నీటిని లిఫ్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 2004 నుంచి 2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజ్ నిర్మించడానికి మహారాష్ట్ర అంగీకరించలేదని గుర్తు చేశారు.కానీ 40 టీఎంసీల లభ్యత మాత్రమే ఉండటంతోనే కేసీఆర్ మేడిగడ్డ వైపు మొగ్గు చూపారని తెలిపారు. 240 టీఎంసీల నీటి లభ్యత కోసమే మేడిగడ్డను ఎంచుకున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు దేశ చరిత్రలోనే అతి తక్కువ సమయంలో పూర్తయిన పార్జెక్టు కాళేశ్వరం అని గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టులో కేవలం 500 కోట్ల విలువైన రెండు పిల్లర్లు మాత్రమే కుంగాయని, ఇది ప్రాజెక్టు వ్యయం లో కేవలం 0.5 శాతమేని స్పష్టం చేశారు.

**ఫుట్ బాల్ మ్యాచ్ కాదు....**

**కాఫర్ ప్రాజెక్ట్ కోసం ఖర్చు ..**

ఎల్లంపల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ పదేళ్లలో పూర్తి చేయలేకపోయినా...కేసీఆర్ బాహుబలి మోటార్లు ఏర్పాటు చేసి మిడ్ మానేరుకు నీటిని తరలించారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి కేసీఆర్ పై ఉన్న ద్వేషంతోనే ఎల్ అండ్ టీ సంస్థ మరమ్మత్తులు చేసేందుకు ముందుకు వచ్చినా పనులు ముందుకు సాగనివ్వడం లేదన్నారు.ఇక మేడ్చల్ లో మనుమడి కోసం ఫుట్ బాల్ మ్యాచ్‌కు వంద కోట్లు ఖర్చు పెట్టినవి, కన్నెపల్లి వద్ద కాఫర్ డ్యామ్ కోసం ఖర్చు చేస్తే ఇప్పటికే నీళ్లు లిఫ్ట్ చేసేవాళ్లని వివరించారు. రాష్ట్రంలో మరో ఎనిమిది నెలల పాటు సాగు, తాగునీరు పూర్తి స్థాయిలో అందాలంటే కాళేశ్వరం ప్రాజెక్టే శరణ్యమని పేర్కొన్నారు.మంత్రులు ఎస్సారెస్పీకి వెళ్లకుండా కన్నెపల్లికి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ మీద ఉన్న కోపం ఎన్నికల్లో రాజకీయంగా తేల్చు కోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకు నీళ్లివ్వాల్సిన బాధ్యతను విస్మరించవద్దని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కవిత వ్యూహాత్మక అడుగులు

## తెలంగాణ సామాజిక న్యాయం పేరుతో సభ



### ఆసక్తిగా మారిన కవిత రాజకీయాలు

తెలంగాణలో మార్పుకు శ్రీకారం..

మహిళా బిల్లు, నిరుద్యోగుల సమస్య..

బీసీలకు సగానికి పై గా అవకాశాలు..

అటు ప్రజల్లో సానుభూతి, ఇటు రాజకీయ పార్టీలకు సవాల్..

సిటీబ్యూరో:ఆగస్టు4:ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ఆమె తీసుకునే నిర్ణయాలు అధికార ప్రతిపక్షాల పై ప్రభావం చూపడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.తెలంగాణ సామాజిక న్యాయం పేరుతో ఆమె నిర్వహిస్తున్న సభ తాజాగా ఆసక్తిగా మారింది. ఈ సభతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమరానికి తెరలేపుతు న్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్పుతున్నారు. బీఆర్ఎస్ నుంచి వేరుపడి సామాజిక తెలంగాణ నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్న కవిత, రాబోయే రోజుల్లో రష్ట్ర రాజకీయాల్లో పెను మార్పుకు పునాదులు వేస్తాయని ధీమాను వ్యక్తం చేశారు.

**సామాజిక న్యాయం,తెలంగాణ..**

స్వరాష్ట్రంలో సామాజిక న్యాయం కొరవడిందని కవిత పలుమార్లు వెల్లడించారు.కేసీఆర్ పాలనలో జరిగిన కొన్ని తప్పులను ఆమె బహిరంగంగా ఒప్పుకున్న సందర్భాలు ఉన్నవి.అయితే తాజాగా సామాజిక న్యాయం, సామాజిక తెలంగాణగా రూపుదిద్దటంలో టీఆర్ఎస్ క్రియాశీలకంగా పనిచేస్తుందని వెల్ల డించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ల పై చిలుకు గడిచినా అందరికి న్యాయం జరగలేదని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ లో ఉంటి ఆ అంశాన్ని ఎత్తిచూపే పరిస్థితులు తప్పలేదన్నారు.కానీ తానే రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన తర్వాత సామాజిక న్యాయం, సామాజిక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేస్తామాని తన వైఖరిని స్పష్టంగా తెలిపారు. దీనితో కవితకు ఈ అంశం భాగా కలిసివస్తుందని ధీమాతో ఉన్నారు..

**బీసీ నినాదం...**బీసీ వాదం తోనే రాజకీయాలను మొదలుపెట్టిన కవిత, తాను చెప్పింది, ఆచరిస్తుంది. తాజాగా పార్టీలో పార్లమెంట్, నియోజకవర్గాల ఇన్ చార్జీల నియామకంలో బీసీలకు పెద్దపీట వేసింది. దీనితో బీసీల కోసం టీఆర్ఎస్ పోరాటం చేస్తుందని చెప్పకనే చెప్పింది. జనాభాలో సగం ఉన్నట్లు చెప్పుతున్న బీసీలకు న్యాయపరమైన రిజర్వేషన్ అందాల్సిన అవసరం ఉందని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. ఇక తాను ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీలో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించారు. దీనితో పై అటు బీసీల్లోని, ఇరు రాజకీయ పార్టీల్లోనే చర్చకు దారతీసే అవకాశం ఉంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు కవిత తీసు కున్న ఈ అజెండా మారనుందని ఆశిస్తున్నారు.

**నిరుద్యోగులు...**

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదురుకొంటున్న సమస్యలు, ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కవిత పోరాటం చేసింది. అందులో భాగంగా దిల్ సుక్ నగర్ లో నిరుద్యోగులతో కలిసి నిరసన ధర్నా చెపట్టారు. జ్యాబ్ క్యాలెండర్ ను అమలు చేయాలని, రాష్ట్రంలో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనితో నిరుద్యోగులు సైతం కవిత వైపు చూస్తున్నారు. వారికి న్యాయం చేస్తుందని నమ్మకం వారిలో కలిగిస్తే ఎన్నికల్లో ఓటు బ్యాంకును సొమ్ము చేసుకోవచ్చని ఆలోచనలో ఉన్నారు.ఇక కవిత పోరాటంతో రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం దిగివచ్చిందని చెప్పక తప్పదు. అందులో భాగంగా పోలీసు విభాగంలో భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీఆర్ఎస్ కు కలిసొచ్చే అంశం అని చెప్పకతప్పదు..

**మహిళా బిల్లు అమలు...**

మహిళా రిజర్వేషన్ల బిల్లులో వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) సబ్‌కోటా కేటాయించాలని, నామమాత్రపు రిజర్వేషన్ల తో కాకుండా అణగారిన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో సగానికి పైగా అవకాశాలు కల్పించాలన్నది టీఆర్ఎస్ ప్రధాన ఎజెండా.. అందులో భాగంగా సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న టీఆర్ఎస్ సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను తలపెట్టిందని పార్టీ నేతలు తెలిపారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేలా కవిత గళం విప్పనుంది.బడుగు బలహీన వర్గాలతో పాటు బీసీలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని ఈ సభ వేదికగా వెల్లడించనున్నారు.మరోవైపు తెలంగాణ ప్రజలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పులకు శ్రీకారం చుట్టాలన్న కవిత ఆశయం సామాజిక న్యాయం, సామాజిక తెలంగాణ సాధన ధ్యేయంగా అడుగులు వేస్తున్న కవిత ఇటు ప్రజల్లో, అటు రాజకీయాల్లో మార్పును చూపనుంది. ఈ నెల ఆరున సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో తలపెట్టిన సభ తరువాత రాజకీయాల్లో వేడిపుట్టనుందని టీఆర్ఎస్ భావిస్తుంది. టీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కవిత ఆకాంక్షిస్తుంది. ఇటు ప్రజలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని చెప్పుతుందో. కవిత కదుపుతున్న పావులు ప్రజలను ఏమేరకు ప్రభావితం చేస్తాయి? సామాజిక న్యాయం పేరుతో ఆమె వినిపిస్తున్న ఈ కొత్త స్వరానికి తెలంగాణ ప్రజల నుంచి ఎలాంటి ఆమోదం లభిస్తుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# కల్తీరాయుళ్ల పై కఠిన చర్యలు

## ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగుల వినియోగం : సీపీ సజ్జనార్

13 మసాలా తయారీ కేంద్రాల పై దాడులు....

ముగ్గురి అరెస్టు,25 టన్నుల కల్తీ మసాల స్వాధీనం....

H-FAST ఏర్పడి 140 రోజులు, 659 ప్రాంతాల్లో సోదాలు...

202 ఎఫ్ఐఆర్‌లు, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారం...




సిటీబ్యూరో:ఆగస్టు4:ప్రజాకలం ప్రతినిధి

మహానగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాల పై మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ నగర్ పోలీసు కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. H-FAST బృందాలు నిర్వహించిన దాడుల్లో భయంకరమైన నిజాలు వెలుగులోకి వచ్చినట్లు ఆయను స్పష్టం చేశారు. సోమవారం సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా...13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు.ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోగా, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వంటింటి మసాలలో కల్తీ.....

మసాలా దినుసుల్లో కల్తీ జరుగుతున్నట్లు అధికారులు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలకు ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు స్పష్టం చేశారు.సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని సీపీ వివరించారు.. H-FAST బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహా రాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# సాయినాథ్‌కు బీఆర్ఎస్ భరోసా..

## - సాయినాథ్‌కు అండగా బీఆర్ఎస్.. ఆదర్శ్ రెడ్డి ఆర్థిక సాయం..



పటాన్‌చెరు, ఆగస్టు 4 (ప్రజా కలం) ప్రతినిధి

అరుదైన నరాల,కండరాల వ్యాధితో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త సునీత కుమారుడు సాయినాథ్ నాయక్‌కు బీఆర్ఎస్ అండగా నిలిచింది.పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి,భారతి నగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి భారతి నగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.సాయినాథ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న ఆదర్శ్ రెడ్డి,సింధు ఆదర్శ్ రెడ్డి వారికి ధైర్యం చెప్పారు.మెరుగైన వైద్యం అందేలా పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.చికిత్స కోసం ఆర్థిక సహాయం అందజేసి, అవసరమైతే భవిష్యత్తులోనూ మరింత సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ,బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,వారి కుటుంబాల కష్టసుఖాల్లో అండగా నిలవడం తమ బాధ్యత అని అన్నారు. సాయినాథ్ నాయక్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాణి యాదవ్, అరుణ జ్యోతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాజన్న క్షేత్రానికి

# మహా వైభవం!

### రూ.249.40 కోట్లతో రూపు మారుతున్న ఆలయం

- శరవేగంగా అభివృద్ధి పనులు - పనులను పురోగతిని పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 04

( ప్రజా కలం ప్రతినిధి ) :

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆలయంలో జరుగుతున్న విస్తరణ, అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ విస్తరణ, తూర్పు రాజగోపురం నిర్మాణం, అనంతి మండపం విస్తరణ తదితర పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో పాటు జిల్లా మంత్రుల సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే మంజూరైన రూ.150 కోట్లకు అదనంగా ఇటీవల రూ.99.40 కోట్లు విడుదల కావడంతో పనులను మరింత వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 55 శాతం పూర్తయ్యాయని అధికారులు వివరించినట్లు తెలిపారు. తూర్పు రాజగోపురాన్ని 95 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నామని, ఇందుకు అవసరమైన కృష్ణశిలలను దశలవారీగా సమీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన శిలలను త్వరగా తరలించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు, అనంతి మండపం విస్తరణ పనులు కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్నాయని, భక్తులకు త్వరిత దర్శనం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధి పురోగతిపై ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారని చెప్పారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ.12 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన పార్కును ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. పట్టణంలో రూ.47 కోట్లతో రహదారుల విస్తరణ, బద్దిపోచమ్మ ఆలయాన్ని రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలో శృంగేరి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ విధూశేఖర భారతి స్వామివారిని కలిసి ఇప్పటివరకు పూర్తైన పనులను వివరించి, మిగిలిన అభివృద్ధి పనులపై వారి సూచనలు, అనుమతులు తీసుకుంటామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు మొత్తం రూ. 249.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.





# ప్రభుత్వ పాఠశాలలో సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నివారించాలి

– ఆదిభట్ల సిఐ రమేష్ కు వినతిపత్రం అందజేసిన
డీవైఎఫ్ఐ మహేశ్వరం మండల కార్యదర్శి మునగని ప్రశాంత్
ఎస్ఎఫ్ఐ మహేశ్వరం మండల అధ్యక్షుడు మునగని వంశీ
సీఐటీయూ మహేశ్వరం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్




మహేశ్వరం, ఆగస్టు 04, (ప్రజా కలం ) రావిరాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సంఘవ్యతిరేక కార్యకలాపాలు నివారించి, రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ మహేశ్వరం మండల కార్యదర్శి మునగని ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ మహేశ్వరం మండల అధ్యక్షుడు మునగని వంశీ, సీఐటీయూ మహేశ్వరం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ ఆదిభట్ల సిఐ రమేష్ కు వినతిపత్రం అందజేశారు. మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో మద్యం సేవించడం, మద్యం సీసాలు మరియు కిటికీలు పగులగొట్టడం, అసభ్యకరంగా గోడలపై రాయడం, మలవిసర్జన చేయడం, తరగతి గది తలుపులపై పాన్ ఉమ్మివేయడం, నీటి కుళాయిలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీనివల్ల పాఠశాల వాతావరణం కలుషితమై విద్యార్థుల చదువుకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఈ సంఘటనలపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, పాఠశాల వద్ద రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని సి ఐ ని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలకు పరిశ్రమల అండ

పరిశ్రమల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఊపు



పటాన్‌చెరు, ఆగస్టు 4: ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధికి పరిశ్రమలు మరింత సామాజిక బాధ్యత నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్‌టెక్ సంస్థ సహకారంతో బాల వికాస్ ఫౌండేషన్ రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ప్రభుత్వ విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతుల కల్పనకు పరిశ్రమలు సహకరించాలని కోరారు. పాఠశాల నుంచి ప్రధాన రహదారి వరకు సిమెంట్ కాంక్రీట్ రహదారి నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ తాన్యను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ గణేష్, ఉపాధ్యక్షుడు మహేందర్ గౌడ్, కమిషనర్ తాన్య, బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, కార్యనిర్వాహక సంచాలకుడు శౌరి రెడ్డి, కౌన్సిలర్లు అశోక్, సతీష్, సహనియామక సభ్యుడు రవీందర్, నాయకులు బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, కార్యక్రమ నిర్వాహకుడు తిరుపతి, మోల్డ్‌టెక్ ప్రతినిధి ఉగేష్ పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

- మహేశ్వరం ఎంపీడీఓ శారదమ్మ
గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్

మహేశ్వరం, ఆగస్టు 04, (ప్రజా కలం ) మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ అధ్యక్షతన ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథి గా మహేశ్వరం ఎంపీడీవో శ్వారదమ్మ ఎంపీడీఓ పాల్గొన్నారు. అనంతరము గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు మహిళల మహిళలతో కలిసి తల్లి పాల ప్రాముఖ్యత, శిశువులకు అన్నప్రాశన, చిన్నారులకు అక్షరాభ్యాసం మరియు మహిళల భద్రత అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్ జొరల రమేశ్ వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, సూపర్ వైజర్ జయమ్మ ,వైధ్య బృంధము, పంచాయతి కార్యదర్శి సుజాత,అంగన్ వాడి టీచర్లు ,ఆశ కార్యకర్తలు, చిన్న పిల్లల తల్లులు ,గర్భిణీలు , బాలింతలు ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి లో శాంతియుతంగా బోనాల వేడుకలను జరుపుకోవాలి

## మల్కాజిగిరి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, మల్కాజిగిరి ఏసిపి




మల్కాజిగిరి,ఆగస్టు 04
(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి లో ఆగస్టు 9,10 వ తేదీలలో జరగనున్న ఆషాడ మాస బోనాల వేడుకలను శాంతియుత, భద్రతా యుతంగా బోనాల జరుపుకోవాలని మల్కాజిగిరి మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా మల్కాజిగిరి పోలీస్ శాఖ ఏసీపి యాదగిరి రెడ్డిలు తెలిపారు. మంగళవారం మల్కాజిగిరి పోలీసుల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవం సమన్వయ సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు బోనాల ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు పోలీస్,మున్సిపల్ శాఖల అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని పలు అంశాల పైన చర్చించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ ఆలయం వద్ద బోనాల నిర్వహణలో భక్తుల రద్దీగా ఉండే ప్రదేశాలలో పాటించాల్సిన జాగ్రత్తలు ఏర్పాట్ల పై పలు అంశాలను చర్చించడంతోపాటు ముఖ్యంగా స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేసుకోవడం ఎలాంటి ప్రమాదాలకు ఆ చావు లేకుండా భక్తులకు మౌలిక వసతులను కల్పించే విషయంలో తీసుకోవాల్సిన పరిస్థితులపై కూడా ఈ సందర్భంగా ఈ సమావేశంలో మాట్లాడారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని డీజేలు శబ్ద కాలుష్య నియంత్రణకు నిబంధనలకు అనుసరించాలని అధికారులు గుర్తు చేశారు. అన్ని శాఖల వారు పరస్పర సమన్వయంతో పనిచేసి శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల పండుగలను విజయవంతం చేయాలని తగనుగుణంగా అన్ని చర్యలు చేపడతామని అధికారులు చెప్పారు. అనంతరం మల్కాజిగిరి ఏసీబీ యాదగిరి రెడ్డి,సిఐ విజయ్ కుమార్,డీఐ శ్రీను ట్రాఫిక్ సిఐ నరసింహాతో పాటు ఎస్ఐలను కలుపుకొని బోనాలు వచ్చు ప్రాంతాలను,అమ్మవారి ఊరేగింపు జరిగే ముఖ్యమైన రహదారులను ఆలయాలను పరిశీలించారు.

## ఇంటింటికి ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్



మహేశ్వరం, ఆగస్టు 04,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో బి ఎల్ ఓ తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు ఇతర వివరాలను పరిశీలించాలని ప్రజలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ పిలుపునిచ్చారు.

## గంగారం గ్రామంలో తల్లిపాలు వారోత్సవాల్లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్



మహేశ్వరం, ఆగస్టు 04, (ప్రజా కలం ) మహేశ్వరం మండలం గంగారం గ్రామ పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో ఏటా ఆగస్టు 1 నుండి 7వ తారీకు వరకు తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తూ తల్లిపాల ప్రముఖత ఆరోగ్య నిరోధక శక్తి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దీర్ఘకాలిక ఆరోగ్యం పై అవగాహన కల్పించడం జరుగుతుందని అంగన్వాడీ మండల సూపర్వైజర్ విద్యావతి తెలిపారు. పుట్టిన మొదటి రోజు గంటలోనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా నవజాతి శిశు మరణాలు తగ్గించవచ్చు అని దీనిపై సామాజిక అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అమ్మ పాలు అమృతమైనదని ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్,ఉప సర్పంచ్ మహేందర్,వార్డ్ మెంబర్స్ ఏం మోహన్, ఏం రవి, ఏం శ్రీనివాస్,ఏం భాస్కర్, అంగన్వాడీ మండల సూపర్వైజర్ విద్యావతి, అంగన్వాడీ టీచర్స్ అనిత,స్కూల్ టీచర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకమే రెవెన్యూ శాఖకు బలం

– పారదర్శక సేవలతో మరింత విశ్వాసం పెంచాలి
– పెండింగ్‌కు తావులేకుండా సేవలు అందించాలి: కలెక్టర్ కె.హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి:04
ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

రెవెన్యూ శాఖపై ప్రజలకు మరింత గౌరవం,నమ్మకం పెరిగేలా అధికారులు పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు,ఇతర రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ముందుగా రెవెన్యూ అధికారులనే ఆశ్రయిస్తారని,ఆ విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. జిల్లాలో భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించిన కలెక్టర్, టీజీఐఐసీ గుర్తించిన భూముల సేకరణను ఆర్డీవోలు అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేయాలని సూచించారు. దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించి చేర్యాల,కొమురవెల్లి, కొండపాక మండలాలు,గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి కోహెడ, అక్కన్నపేట,హుస్నాబాద్ మండలాల్లో కాలువల భూ సేకరణ ప్రక్రియను సర్వే నిర్వహించి అవార్డులు జారీ చేయాలని ఆదేశించారు. నేషనల్ హైవే కోసం బస్వాపూర్,హుస్నాబాద్ ప్రాంతాల్లో భూ సేకరణను వేగవంతం చేయాలని హుస్నాబాద్ ఆర్డీవోకు, రీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని గజ్వేల్ ఆర్డీవోకు సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని,భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు,సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని,ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ భూముల వివరాలను మండలాల వారీగా నక్షా ప్రకారం పరిశీలించి, ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న రెండు పడకగదుల ఇళ్ల వివరాలు సేకరించి,పూర్తయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూమిని గుర్తించి,శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఆదాయ,కుల,నివాస,మరణ ధ్రువపత్రాల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో నాగరాజమ్మ, ఆర్డీవోలు సదానందం,చంద్రకళ, రామ్మూర్తి,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య,ఎస్‌డీసీ వరలక్ష్మి తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పేదరికమే అక్రమ రవాణా మూలం

## పేదరికం, వివక్షే మానవ అక్రమ రవాణాకు మూలం: డాక్టర్ అజైలియు నియుమై..

పటాన్‌చెరు, ఆగస్టు 4(ప్రజా కలం) ప్రతినిధి

పేదరికం,నిరుద్యోగం,సామాజిక వివక్షలే మానవ అక్రమ రవాణాకు ప్రధాన కారణాలని హైదరాబాద్ విశ్వవిద్యాలయం సామాజిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అజైలియు నియుమై అన్నారు. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మానవీయ,సామాజిక శాస్త్రాల పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆమె మాట్లాడారు.



మానవ అక్రమ రవాణా ఆర్థిక,సామాజిక, రాజకీయ,సాంస్కృతిక అంశాలతో ముడిపడి ఉన్న సంక్లిష్ట సమస్య అని,దీనిని అంతర్‌శాఖ పరిశోధనల ద్వారా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్నప్పటికీ శిక్షల శాతం తక్కువగా ఉండటంతో నేరస్థులు తప్పించుకుం టున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల పునరావాసానికి పటిష్టమైన విధానాలు, ఆర్థిక సహాయం అవసరమని, ప్రభుత్వం,పరిశోధకులు,చట్ట అమలు సంస్థలు, పౌర సమాజం సమన్వయంతో పనిచేస్తేనే మానవ అక్రమ రవాణాను అరికట్టగలమన్నారు. కార్యక్రమానికి మానవీయ, సామాజిక శాస్త్రాల పాఠశాల డీన్ డాక్టర్ రథిన్ రాయ్ అధ్యక్షత వహించగా,సామాజిక శాస్త్ర విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ సాకిబ్ ఖాన్ స్వాగతం పలికారు. డాక్టర్ రోమా భట్టాచార్య వందన సమర్పణ చేశారు.

# న్యాయవాది హత్యను నిరసిస్తూ కోర్టు విధులకు దూరమైన న్యాయవాదులు

- హంతకులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్



వేములవాడ, ఆగస్టు 04:( ప్రజా కలం ప్రతినిధి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన న్యాయవాది మల్లయ్య హత్యను నిరసిస్తూ వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్టల మనోహర్ నాయకత్వంలో కోర్టు ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు,ఈ సందర్భంగా పిట్టల మనోహర్ మాట్లాడుతూ న్యాయవాది మల్లయ్య హత్య అత్యంత దారుణమైన ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు, నిందితులపై ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వేగవంతంగా విచారణ జరిపించి, కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు, న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొత్తూరు అనిల్ కుమార్, గుండ రవి, పెంట రాజు, న్యాయవాదులు రేగుల దేవేందర్, పర్లపెల్లి అంజయ్య, నక్క దివాకర్, మాదాసు దేవయ్య, జెట్టి శేఖర్, కనికరపు శ్రీనివాస్, గుజ్జే మనోహర్, నేదూరి అభిలాష్, బీమా మహేష్‌బాబు, ఒద్యారపు వేణుకుమార్, వడ్లకొండ శ్రీకాంత్, పొత్తూరు మల్లేశం, వంగ పర్శరాములు, గోపు మధు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం : కాంతారావు



కూకట్ పల్లి, ఆగస్టు 04, ప్రజా కలం ప్రతినిధి: తెలంగాణలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తులతో చెలగాటం ఆడుతున్నాయని కూకట్ పల్లి నియోజకవర్గ బిజెపి ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బిజెపి యువజన విభాగం నాయకులు ఆధ్వర్యంలో "ఫీజు బకాయి బిజెపి లాడాయి" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరసనలో భాగంగా భరత్ నగర్ మార్కెట్‌లో బిజెపి యువజన నాయకులు కూలీలుగా మారి బస్తాలు మోసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ కష్టంతో సంపాదించిన డబ్బును ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయానికి మనీ ఆర్డర్ చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో ఉంచడం అత్యంత సిగ్గుచేటని, ఇది పూర్తి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా, కళాశాల యాజమాన్యాల వద్ద విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని బిజెపి నాయకులు కార్యకర్తలు బీజేపీ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాదర్గుల్ డివిజన్ సమగ్ర అభివృద్ధే నా లక్ష్యం

**ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసిన ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి**

మహేశ్వరం, ఆగస్టు 04, (ప్రజా కలం) మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం నాదర్గుల్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం అని ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అన్నారు. డివిజన్‌కు అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సంబంధించి వినతి పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి మర్యాదపూర్వకంగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాదర్గుల్ డివిజన్ పరిధిలో రోడ్ల నిర్మాణం విస్తరణ, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సౌకర్యాల మెరుగుదల, కాలనీ పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై మంత్రి తో సవివరంగా చర్చించడం జరిగింది.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి



మహేశ్వరం, ఆగస్టు 04,(ప్రజా కలం) ప్రజాపాలన లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చడమే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యం అని టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం ప్రశాంతి హిల్స్ డివిజన్ 58. లోని లెనిన్ నగర్ లో 33 వార్డ్ లో ఆలేటి గిరిబాబు ఆధ్వర్యంలో టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి స్థానిక సమస్యలపై దృష్టిసాధించారు. బోనాల పండగ వర్షాలు వస్తున్న నేపథ్యంలో బస్తిబాట లో భాగంగా స్థానిక సమస్య లను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల ను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కోప్షన్ సభ్యులు జెటవత్ రవినాయక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ చరణ్ రెడ్డి సామిడి ఇందిరమ్మ కమిటీ సభ్యులు ధరవాత్ స్వామి నాయక్, నక్క బాలకృష్ణ, గడివేముల కృష్ణ, టిట్ల కృష్ణ, కమోజీ తిరుపతయ్య సార్ల రవి గుడేటి నర్సింహా, కేతావత్ చిన్న, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే ప్రాధాన్యం

- 11వ వార్డులో ఇంటింటికి చెత్త బుట్టల పంపిణీ

తడి-పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని కౌన్సిలర్ భవాని కర్ణాకర్ పిలుపు



గజ్వేల్:04 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో వార్డు కౌన్సిలర్ కొలిచేలిమి భవాని కర్ణాకర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఆకుపచ్చ,నీలం రంగు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. పరిశుభ్రమైన వార్డు నిర్మాణమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ భవాని కర్ణాకర్ మాట్లాడుతూ, ఇంటింటికీ పంపిణీ చేస్తున్న ఆకుపచ్చ రంగు చెత్త బిన్ను తడి చెత్త కోసం మాత్రమే ఉపయోగించాలని సూచించారు. కూరగాయల తొక్కలు, మిగిలిన ఆహారం,పండ్ల వ్యర్థాలు, ఆకులు వంటి సేంద్రియ వ్యర్థాలను ఆకుపచ్చ బిన్‌లో వేయాలని తెలిపారు. అదేవిధంగా నీలం రంగు చెత్త బిన్ను పొడి,పునర్వినియోగం చేయగల వ్యర్థాల కోసం మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కవర్లు,ప్లాస్టిక్ బాటిళ్లు,కాగితాలు, అట్టపెట్టెలు,గాజు వస్తువులు,లోహాలకు సంబంధించిన వ్యర్థాలను నీలం బిన్‌లో వేయాలని సూచించారు. ప్రతి కుటుంబం తడి చెత్త,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ప్రతిరోజూ ఇంటింటికీ వచ్చే మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని కోరారు. చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతో పాటు పరిశుభ్రమైన,ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచేలిమి స్వామి, అమరేందర్ శర్మ,వర్మరాములు, కనకరాజు,జమీల్,మున్సిపల్ సిబ్బంది,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# హరీశరావుపై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు అవివేకం

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



గజ్వేల్:04ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని,అవి వారి అవివేకానికి నిదర్శనమని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తున్న హరీశ్‌రావును వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని విమర్శించడం ద్వారా కట్టడి చేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించడం సరైన విధానం కాదన్నారు. గుడికి వెళ్లి దేవుడిని దర్శించుకోవడం ప్రతి వ్యక్తికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని,వ్యక్తిగత విశ్వాసాలను రాజకీయ వివాదాలుగా మార్చడం తగదన్నారు. హరీశ్‌రావు ఆలయ దర్శనాన్ని వక్రీకరిస్తూ "క్షుద్ర పూజలు" వంటి ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ అంశాన్ని కాంగ్రెస్ నేతలు తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిన ప్రతిసారి అసలు సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఇలాంటి రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. హరీశ్‌రావుపై నిరాధార ఆరోపణలు చేసిన వారికి ఇప్పటికే లీగల్ నోటీసులు పంపినప్పటికీ,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా అదే అంశాన్ని ప్రస్తావించడం బాధ్యతాయుతమైన రాజకీయాలకు విరుద్ధమన్నారు. ప్రజలు సహించలేని అంశాలపై నిరాధార వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలపై వ్యక్తిగత విమర్శలు చేయడం కంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని మాదాసు శ్రీనివాస్ హితవు పలికారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని,ఇలాంటి విమర్శలతో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

## బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నిర్ణాయక

# జాతీయ ప్రచారం ప్రారంభం

వనపర్తి : వనపర్తి ,జోగులాంబ గద్వాల, మహబూబ్నగర్ జిల్లాలో ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బాలల హక్కుల సంస్థ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, న్యూఢిల్లీలో ప్రారంభించబడిన దేశవ్యాప్త 'బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారం'లో భాగంగా బాలల అక్రమ రవాణాపై నిర్ణాయక పోరాటాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపింది. బాలల అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం మరియు బాల సంక్షేమ వర్గాలతో కలిసి పనిచేస్తూ, జిల్లాను పిల్లలకు మరింత సురక్షితంగా మార్చడానికి తాము కట్టుబడి ఉన్నామని సదరు సంస్థ తెలిపింది. ఈ ప్రచారంలో భాగంగా, జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే, అణగారిన, ప్రమాదంలో ఉన్న కుటుంబాలను గుర్తించి, పిల్లలు బడిలోనే ఉండేలా మరియు రవాణా ముఠాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానిస్తారు. దీనికిదనంగా, గుర్తించిన అక్రమ రవాణాదారులపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటారు. జాతీయ ప్రచారం నేపథ్యంన్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో బాలల హక్కులు, సామర్థ్యం మరియు సమృద్ధిని నిర్ధారించడం అనే అంశంపై జరిగిన నాలుగు రోజుల జాతీయ ఆలోచనా సదస్సులో ఈ జాతీయ ప్రచారాన్ని ప్రారంభించారు. 2030 నాటికి భారతదేశాన్ని బాలల అక్రమ రవాణా రహితంగా మార్చడానికి మరియు బాలల హక్కులను కాపాడటానికి పనిచేస్తున్న 250కి పైగా స్వచ్ఛంద సంస్థల దేశవ్యాప్త నెట్‌వర్క్ 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' ఆధ్వర్యంలో, భారతదేశంలోని 782 జిల్లాల భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీఅనేది 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' యొక్క భాగస్వామ్య సంస్థ. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' పిల్లలపై జరిగే నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచంలోనే అతిపెద్ద చట్టపరమైన జోక్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. భాగస్వామ్య సంస్థల ఉమ్మడి కృషితో, ఏప్రిల్ 2023 మరియు డిసెంబర్ 2025 మధ్య కాలంలో భారతదేశంలో 1,22,516 మంది పిల్లలను. అక్రమ రవాణా నుండి రక్షించారు. ఇది సమన్వయంతో కూడిన చట్టపరమైన చర్యలు మరియు సమాజ-ఆధారిత జోక్యాల ప్రభావాన్ని నిరూపిస్తోంది.

**కేంద్ర మంత్రి ప్రశంసలు**

ఈ సదస్సును ప్రారంభిస్తూ కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్. బాలల సంరక్షణను దేశంలోని అత్యంత సవాలుతో కూడిన బాధ్యతల్లో ఒకటిగా అభివర్ణించారు మరియు దోపిడీ నుంచి పిల్లలను రక్షించడంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఒక్క చిన్నారి ప్రాణాన్ని కాపాడినా అది అత్యంత పవిత్రమైన కార్యం. చాలామంది చిన్న పిల్లలు అక్రమ రవాణాకు గురై మళ్లీ ఇంటికి చేరుకోలేకపోతున్నారు. ఎవరైనా వచ్చి తమను రక్షిస్తారని ఈ పిల్లలు ఎదురుచూస్తుంటారు. లైంగిక దోపిడీ నుంచి వారిని రక్షించే స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు దేవదూతలతో సమానం," అని ఆమె అన్నారు.

**క్షేత్రస్థాయి పరిస్థితులపై డైరెక్టర్ ఆందోళన**... ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ థామస్. మాట్లాడుతూ, భారతదేశంలో పిల్లలకు అత్యంత తీవ్రమైన ముప్పులలో బాలల అక్రమ రవాణా ఒకటిగా కొనసాగుతోందని చెప్పారు. సగటున ప్రతిరోజూ ఆరుగురు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతుంటే, ఐదుగురు పిల్లలు బాలకార్మికు లుగా మారుతున్నారనేది విషాదకరమైన నిజం. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతీ గంటకు 11 మంది పిల్లలు కనిపిం చకుండా పోతున్నారు, వారిలో అత్యధిక శాతం మంది అక్రమ రవాణా బాధితులుగా మారుతున్నారు. ఆయుధాలు, మాదక ద్రవ్యాల రవాణా తర్వాత మానవ హక్కుల ఉల్లంఘనగా నిలిచే మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద వ్యవస్థీకృత నేరం. మహిళలు, పిల్లలే దీని ప్రధాన లక్ష్యంగా ఉన్నారు.

# పెరవలి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కే ఈ శాంబాబు

మద్దికేర: మద్దికేర మండల పరిధిలోని గల పెరవలి గ్రామంలో రూ. 2.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ నూతన ఉపకేంద్రం ద్వారా పెరవలి, బసినేపల్లి,రామాపురం,రామాపురం కొట్టాల,మదనంతపురం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. దీంతో తక్కువ వోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గి,ముఖ్యంగా వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా విద్యుత్ అందడంతో రైతులు సకాలంలో సాగునీరు అందించి పంటలను మెరుగ్గా సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. 5 ఎంవిఏ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ 33/11 కేవీ ఉపకేంద్రం భవిష్యత్తు విద్యుత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని నిర్మించబడిందని,ఈ ప్రాంత ప్రజలకు మరియు రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు."రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్న ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ విద్యుత్, రోడ్లు,తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను ప్రతి గ్రామానికి అందిస్తూ పత్తికొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,కార్యకర్తలు, రైతులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు



కరీంనగర్ : తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు. 3 బ్యారేజీల దిగువన సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భంలో ఉన్న పరిస్థితులు, సీపేజీ మార్గాలు, అనామలీస్ (భిన్నమైన పరిస్థితులు)ను అధ్యయనం చేయడానికి ఈ అధునాతన జీపీఆర్ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగముగా మూడు బ్యారేజీల్లోని మొత్తం 225 వెంట్లకు గాను 217 వెంట్స్ వద్ద క్షేత్రస్థాయి అధ్యయనాలు జరిగాయి. ఈ నివేదికలోని వివరాల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలోని 7 వెంట్స్ దిగువన అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదయ్యాయి. కీలకమైన మేడిగడ్డలోని 7వ బ్లాక్‌కు చెందిన 17, 18, 19, 20, 21 వెంట్లలోనూ, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్‌లోనూ, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్‌లోనూ ఈ భూగర్భ లోపాలను గుర్తించినట్లు నివేదికలో తెలిపారు. ఇదే ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలోని 5వ బ్లాక్‌లో ఉన్న 47వ వెంట్ ఎగువ భాగంలోనూ, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, మరియు 53వ వెంట్స్ వద్ద ఎగువ, దిగువ ప్రాంతాలలో సమస్యలు ఉన్నట్లు తేలింది. ఈ 3 బ్యారేజీలలో కలిపి మొత్తం 11 వెంట్స్ కింద మాత్రమే ఎలాంటి సమస్యలు లేదా అనామలీస్ లేవని, మిగతా వాటిలో చిన్న సమస్యలు ఉన్నాయని నివేదికలో వెల్లడించినట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద నీటి ఉధృత ప్రవాహాల కారణంగా ఇసుక కొట్టుకుపోయి, రాఫ్ట్ దిగువన పెద్ద ఎత్తున శూన్య ప్రాంతాలు ఏర్పడ్డాయి. 6 వెంట్స్ వద్ద పదికి పైగా విభిన్నమైన అనామలీస్ జోన్లను శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఇటువంటి పరిస్థితులు నీటి అంతర్గత సీపేజ్, పైపింగ్ వంటి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, జీపీఆర్ పరీక్షలు కేవలం భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమని, నేరుగా స్ట్రక్చరల్ లోపాలను ఇవి నిర్ధారించలేవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. అందువల్ల పునరావాస లేదా మరమ్మతు పనులు ప్రారంభించే ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించడం అనివార్యమని సూచించింది. ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణ సమయంలో ముందస్తు భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ టీమ్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టడం గానీ, మంత్రులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ ( సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికపై స్పందిస్తే మరిన్ని విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది

# స్టేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ నివారణ బిల్లుపై సెలెక్ట్ కమిటీ సమావేశం

కరీంనగర్ : తెలంగాణ స్టేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (నివారణ) బిల్లు-2026పై ఏర్పాటైన సెలెక్ట్ కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలతో పాటు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్లులోని ప్రధాన నిబంధనలు, అమలు విధానం, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ బిల్లును ఈ ఏడాది మార్చిలో తెలంగాణ శాసనసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ద్వేషపూరిత ప్రసంగాలు, కులం, మతం, జాతి, భాష, ప్రాంతం లేదా ఇతర గుర్తింపుల ఆధారంగా వ్యక్తులు, వర్గాలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. మతం, కులం, జాతి, భాష లేదా ఇతర గుర్తింపుల ఆధారంగా విద్వేషాన్ని ప్రేరేపించే ప్రసంగాలు, సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, ప్రచార సామగ్రి, బహిరంగ సభల్లో చేసే ద్వేషపూరిత వ్యాఖ్యలను ఈ చట్టం కింద నేరంగా పరిగణించనున్నట్లు బిల్లులో ప్రతిపాదించారు. బిల్లులోని ప్రతిపాదనల ప్రకారం, మొదటిసారి నేరానికి కనీసం ఒక సంవత్సరం నుంచి గరిష్ఠంగా ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే నేరాన్ని పునరావృతం చేస్తే రెండు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు అధిక మొత్తంలో జరిమానా విధించాలని ప్రతిపాదించారు.

# రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నిక

- ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా వడ్ల సత్యనారాయణ
- జిల్లా ప్రధాన కార్యదర్శిగా దత్తు నాయక్ ఏకగ్రీవ ఎన్నిక



మహేశ్వరం , ఆగస్టు 04, (ప్రజా కలం ) తుక్కుగూడ పట్టణంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, శాసనమండలి సభ్యులు నెల కంటి సత్యం, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ పాల్గొన్నారు. మహాసభలలో జిల్లా నలుమూలల నుండి 250 మంది ప్రతినిధులు అనేక సమస్యలపై తీర్మానాలు చర్చించుకోవడం జరిగింది. భవిష్యత్తు కర్తవ్యం మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించుకోవడం జరిగింది. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నిక చేయడం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులుగా వడ్ల సత్యనారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీ.దత్తు నాయక్ 9మంది ఆఫీస్ బేరర్స్, 35 మంది కార్యవర్గ సభ్యులుగా, 57 మంది కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా మహాసభ ప్రతినిధులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బీ దత్తు నాయక్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నాకు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన బాధ్యతను కార్మిక వర్గ సమస్యలపై నిరంతరం కార్మిక హక్కుల కోసం పోరాడుతామని, కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా నాయకత్వం పానుగంటి పర్వతాలు రామస్వామి మిగతా ఆఫీస్ బేరర్లకు ప్రత్యేకమైనటువంటి తెలియజేశారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో అవ్వాతాతల జీవితాల్లో భరోసా..

నందిగామ 11వ వార్డులో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ: పేదల సంక్షేమమే ధ్యేయంగా, అవ్వాతాతలకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నందిగామ పట్టణం 11వ వార్డులో ఉత్సాహంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి పెన్షన్లు అందజేశారు. టీటీడీ కల్యాణ మండపం సమీపంలో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.. పెన్షన్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వారి కుటుంబాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంధకారంగా ఉన్న సమయంలోనూ పేదల కష్టాలను అర్థం చేసుకుని, ఇంటి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ అందిస్తూ పేదల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నారని తెలిపారు. ఒకటో తేదీ సెలవు రోజైతే అంతకుముందు రోజే పెన్షన్ అందించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం మాటల్లో కాకుండా చేతల్లో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం.. ప్రతి అవ్వాతాత గడపకు భరోసాను చేర్చే ప్రభుత్వమని తంగిరాల సౌమ్య గారు స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు, స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా నగరి మండలంలో కలకలం రేపిన ఘటన

చిత్తూరు : విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి న్యాయ పోరాటం చేసిన ఓ కుటుంబంపై రౌడీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశాయన్న ఆరోపణలు తీవ్ర సంచలనంగా మారాయి. కోర్టు ఆదేశాలు ఉన్నా అమలు చేయలేదని... అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో విద్యుత్ శాఖ అధికారులపై, పోలీసుల వ్యవహారశైలిపై కూడా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గాయపడిన బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చట్టం సామాన్యుడికి రక్షణ కల్పించేందుకా...? లేక బలవంతుల చేతిలో బలహీనులు బలైపోవడానికా...? అనే ప్రశ్నకు చిత్తూరు జిల్లా నగరి మండలంలో జరిగిన ఈ ఘటన అద్దం పడుతోంది. నగరి మండలం ఓజీ కుప్పం పంచాయతీలో నివసిస్తున్న ఆర్. వెంకటేశ్వర్, శాంతిలకు చెందిన తమ సొంత భూమికి విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బాధితుల వాదన ప్రకారం... కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా, స్థానిక స్థాయిలో విద్యుత్ శాఖ అధికారులు వాటిని అమలు చేయకుండా ఆలస్యం చేశారని ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో... విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్న సమయంలో చందు, సుబ్రమణ్యం అనే వ్యక్తులు మరికొందరితో కలిసి తమ భూమిలోకి చొరబడి దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్, శాంతి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన వెనుక భూ కబ్జాదారులకు కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారంటూ బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు... స్థానిక పోలీసుల వ్యవహారంపై కూడా బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన వారు బాధితులకు న్యాయం చేయకుండా ఒత్తిళ్లు తెస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఒక సాధారణ విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్ల తరబడి న్యాయపోరాటం చేయాల్సి రావడం... చివరకు దాడులకు గురై ఆస్పత్రి పాలవడం... ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# నిరుపేద మహిళకు లయన్స్ క్లబ్ చేయూత

కమాన్ పూర్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ నివసిస్తున్న కిరాయి ఇల్లు కూలిపోవడంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, బాధిత మహిళకు నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ డైరెక్టర్గా ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ల సేవా కార్యక్రమాలకు మార్గనిర్దేశం చేస్తూ సేవే పరమావధి అనే భావనతో లక్షలాది మంది లయన్స్ సభ్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వం, సేవా తపన, నిస్వార్థ అంకితభావం లయన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సమాజ సేవే లయన్స్ ఉద్యమానికి మూల స్ఫూర్తి అని, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి టీవీ సురేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు మొల్మూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, క్లబ్ చైర్పర్సన్లు గంట వెంకటరమణ రెడ్డి, మర్రి శరణ్య తదితరులు పాల్గొన్నారు.